www.andhrajyothy.com

వెల (Price) : Rs. 6.50

విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పేజీలు: 12

సంపుటి (Volume) : 65

సంచిక (Issue) : 289

సోమవారం | 3-2-2025

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి ఉ. 6.53, షష్ఠి తె. 4.37 వరకు; నక్షత్రం: రేవతి రా. 11.17 తదుపరి అశ్వని; వర్జ్యం: మ. 12.04-1.34; దుర్ముహూర్తం: మ. 12.51-1.36, మ. 3.07-3.52; అమృతఘడియలు: రా. 9.02-10.32; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 6.07

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



వాంఖడేలో రికార్డుల 'అభిషేక'ం

సిక్సర్లతో హోరెత్తిన మైదానం

37 బంతుల్లోనే శతకం

ఆఖరి టీ20లో ఇంగ్లండ్‌పై భారత్ ఘన విజయం

బట్లర్ సేన 'రికార్డు' ఓటమి

భారత బ్యాటర్ అభిషేక్ శర్మ ఇంగ్లండ్‌ను ఓ ఆటాడుకున్నాడు. 13 సిక్సర్లు, 7 ఫోర్లతో 135 పరుగులు చేసి వాంఖడే మైదానాన్ని ఊపేశాడు. భారత్ తరఫున అధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. టీ20ల్లో రెండో ఫాస్టెస్ట్ సెంచరీ (37 బంతుల్లో) నమోదు చేశాడు. భారత్ స్కోరు (247) ఛేదనలో ఇంగ్లండ్ 97 పరుగులకే ఆలౌటై 150 పరుగుల తేడాతో ఓడింది. ఆ జట్టుకు టీ20లో ఇదే అత్యంత ఘోర పరాజయం.

10

మన అమ్మాయిలే.. మళ్లీ

జగజ్జేతలు



అండర్19 టీ20 ప్రపంచకప్ విజేత భారత్

వరుసగా రెండోసారి ట్రోఫీ కైవసం

ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఘన విజయం

తెలుగమ్మాయి త్రిష ఆల్‌రౌండ్ ప్రదర్శన

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ

భారత అమ్మాయిలు అదరగొట్టారు. అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో వరుసగా రెండోసారి జగజ్జేతలుగా నిలిచారు. టోర్నీ ఆరంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శిస్తూ వచ్చి.. ఫైనల్లోనూ అదేజోరు కొనసాగించారు. మలేసియాలోని కౌలాలంపూర్‌లో ఆదివారం ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో యువ భారత్ 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసింది. భీకర బౌలింగ్, మెరుపు ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని 82 పరుగులకే చుట్టేసిన మన అమ్మాయిలు.. లక్ష్యాన్ని 11.2 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించారు. తెలుగమ్మాయి గొంగడి త్రిష భారత్ విజయంలో ప్రధానపాత్ర పోషించింది. తొలి ప్రపంచకప్ నెగ్గిన జట్టులోనూ సభ్యురాలైన త్రిష.. ఈసారి ఫైనల్లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీని కూడా సొంతం చేసుకుంది.

10

త్రిషాన్‌దార్

పరుగులు: 309

అత్యధికం: 110

వికెట్లు: 7

బెస్ట్ బౌలింగ్: 3/6

ఫైనల్లో..

44 నాటౌట్

3 వికెట్లు



నాడు

డంపింగ్ యార్డ్ అనుకునేరు. ఇది రోడ్డే. అనంతపురం శివారులోని ఆలమూరి రోడ్డు ఇది. 2023 సెప్టెంబరు 12న తీసిన ఫొటో మొదటిది. జగన్ ప్రభుత్వంలో రోడ్ల దుస్థితికి అద్దం పట్టే చిత్రమిది. ఇక రెండోది కూడా అదే రోడ్డు. కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి చేపట్టిన తర్వాత ఈ రహదారి రూపం ఇలా సమూలంగా మారింది. ఫిబ్రవరి 1, 2025న తీసిన ఈ చిత్రంలో అటూఇటూ డబుల్ రోడ్డు, మధ్యలో డివైడర్‌ను చూడొచ్చు.



నేడు

నాడు గజానికో గుంతతో విలవిల

నేడు అద్దంలా రోడ్లు మిలమిల

రోడ్లకు మహర్దశ

ఐదేళ్లూ పట్టించుకోని జగన్ సర్కారు

కూటమి ప్రభుత్వం రాగానే కదలిక

రాష్ట్రవ్యాప్తంగా మరమ్మతులు, కొత్త రోడ్లు

జగన్ పాలన అనగానే వెంటనే అవినీతి, అక్రమాలు, కేసులు, దోపిడీ, దౌర్జన్యాలు.. ఇలా ఎన్నో గుర్తుకొస్తాయి. ఈ విషయాలను కాసేపు పక్కనపెడితే గతుకుల రోడ్లతో గత ఐదేళ్లూ ప్రజలు నరకం చూశారు. రాష్ట్ర పరిధిలోని రోడ్లకు జగన్ సర్కారు కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. ఐదేళ్లలో తట్టెడు మట్టి కూడా వేసిన పాపాన పోలేదు. నాడు వాహనదారుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా వర్షాకాలంలో రోడ్లు ఏకంగా కాలువలు, మడుగులను తలపించేవి. బురద రోడ్లలో అడుగడుగునా గుంతలే. ఎన్నో ప్రమాదాలు జరిగినా జగన్ సర్కారు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వీటిపై దృష్టిసారించింది. ఓవైపు ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నా.. యుద్ధప్రాతిపదికన పనులు చేయడానికి నిధులు మంజూరు చేసింది. పాడైన రోడ్లకు మరమ్మతులు

మిగతా 11వ పేజీలో...



ఆంధ్రజ్యోతి ఫీల్డ్ రిపోర్ట్

నాడు-నేడు రోడ్ల స్థితిపై 'ఆంధ్రజ్యోతి' ఫొటో ఫీచర్ 11వ పేజీలో...

టాస్క్ లేదు.. ఫోర్స్ లేదు!

రాష్ట్రంలో భూముల అక్రమాల నిగ్గు తేలుస్తాం. జిల్లా, రాష్ట్రస్థాయిల్లో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తాం. అక్రమార్కులు ఎంతటివారైనా ఉపేక్షించం. రెవెన్యూ శాఖ ఈ విషయంలో పట్టుదలగా పనిచేయాలి.

- డిసెంబరు 12న కలెక్టర్ల సదస్సులో సీఎం ఆదేశం

ముఖ్యమంత్రి ప్రకటించి రెండు నెలలు గడిచిపోయింది. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుపై రెవెన్యూ శాఖ ఇప్పటికీ స్పందించలేదు. గత ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాల్లో వైసీపీ నేతలతో పాటు రెవెన్యూ అధికారుల పాత్ర ఉన్నట్టు ఆరోపణలున్నాయి. ఇవేవీ బయటికి రాకుండా ఉండేందుకే కొందరు అధికారులు టాస్క్‌ఫోర్స్ ప్రతిపాదనను అడ్డుకుంటున్నట్టు తెలుస్తోంది.

భూవివాదాలపై చేష్టలుడిగిన రెవెన్యూ

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు డిసెంబరులో నిర్ణయం.. నేటికీ కార్యరూపం దాల్చని సీఎం ఆదేశం



అతీగతీలేని మదనపల్లె ఫైల్స్ దహనం కేసు

విశాఖ భూముల వ్యవహారమూ కంచికే

లోతైన విచారణ జరిగితే అధికారులు, వైసీపీ నేతల అక్రమాలు బట్టబయలు

అందుకే సీఎం ఆదేశాలు బుట్టదాఖలు?

అధికారుల తీరుపై సర్వత్రా అనుమానాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత డిసెంబరులో కలెక్టర్ల సదస్సు నిర్వహించింది రెవెన్యూ శాఖనే. ఈ సదస్సులో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలు, ఉమ్మడిగా తీసుకున్న నిర్ణయాల అమలు, తదుపరి కార్యాచరణ బాధ్యత ఆ శాఖదే. కానీ రెవెన్యూ అధికారులు తమకు ఆ సమావేశపు నిర్ణయాలతో సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలను అమలు చేయడం లేదు. కలెక్టర్ల సదస్సులో తీసుకున్న నిర్ణయాల మినిట్స్‌లోనూ ఈ అంశం ప్రస్తావన లేదు. అంటే.. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు గురించి రెవెన్యూ శాఖతో పాటు ప్రభుత్వం మరచిపోయినట్లేనా? ఇలాగైతే భూముల అక్రమాల్లో నేతలు, అధికారుల దోపిడీ గుట్టు రట్టయ్యేదెలా? ఎవరి పాత్ర ఏమిటో ఎలా తెలుస్తుంది? ఇదంతా జరగడం ఇష్టం లేకనే రెవెన్యూ శాఖ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు అంశాన్ని పక్కన పెట్టేసిందా? కొన్ని పరిణామాలను విశ్లేషిస్తే ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తోంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలి రోజుల్లో.. గత ఏడాది జూలై 21వ తేదీ అర్ధరాత్రి ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీసుకు

మిగతా 12వ పేజీలో...

అతీగతీ లేని కేసులు

మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీసుకు నిప్పు పెట్టిన సంఘటన గత ఏడాది జూలైలో జరిగింది. వెంటనే సీఐడీ విచారణకు ఆదేశించారు. నేటికి ఎనిమిది నెలలవుతోంది. ఈ కేసులో పెద్ద పురోగతి లేదు. సంఘటన జరిగిన వెంటనే నాటి ఆర్డీఓ, మాజీ ఆర్డీఓను సస్పెండ్ చేశారు. తర్వాత కేసు విచారణలో సీఐడీ కొత్తగా ఏం సాధించిందో ఎవరికీ తెలియడం లేదు. మరోవైపు విశాఖలో భూ కుంభకోణాలే లేవని, ప్రభుత్వ, అసైన్డ్ భూములు సురక్షితమని జిల్లా కలెక్టర్ గత ఏడాది డిసెంబరులోనే నివేదించారు. వైసీపీ పెద్దలు, కొందరు బడా అధికారులు అసైన్డ్, ఇనాం భూములను చేజిక్కించుకున్న ఉదంతాలేవీ బయటకు రాలేదు. అసలు ఎలాంటి అక్రమాలూ జరగలేదని నివేదించారు.



బాపట్ల శ్రీనివాస నగర్ కాలనీలో టీడీపీ కార్యాలయం కోసం విరాళంగా ఇచ్చిన స్థలం

టీడీపీ స్థలానికి ఎసరు!

పాతికేళ్ల కిందట బాపట్లలో పార్టీ ఆఫీసు కోసం భూదానం

చంద్రబాబు పేరుతో 9.5 సెంట్లు రిజిస్టర్ చేయించిన అభిమాని

ప్రస్తుత విలువ రూ.1.5 కోట్లు.. దీనిపై ఎన్నడో కన్నేసిన భూ మాఫియా

నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్‌కు యత్నాలు

తాజాగా దొంగ పత్రాలతో రుణం కోసం యత్నం.. గుట్టురట్టు

టీడీపీ నేతల ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు

వారి అదుపులో నక్కా సత్తార్‌రెడ్డి.. మరో సూత్రధారి కూడా?

(బాపట్ల-ఆంధ్రజ్యోతి)

ఆయన భూముల విలువ గురించి పదేపదే చెబుతుంటారు.. ప్రభుత్వ భూముల సంరక్షణకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తుంటారు. కానీ తన భూమినే కాపాడుకోవడం మరిచారు. ఆయన మరెవరో కాదు మన ముఖ్యమంత్రి చంద్రబాబే..! భూమాఫియా ఆయనకే శఠగోపం పెట్టేందుకు ప్రయత్నించిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. బాపట్ల పట్టణం రైలుపేటకు చెందిన టీడీపీ అభిమాని

మిగతా 3వ పేజీలో...

ట్రంప్ సుంకాల కొరడా



కెనడా, మెక్సికో దిగుమతులపై 25 శాతం విధింపు

చైనా దిగుమతులపై 10 శాతం అదనపు సుంకం

వలసలు, డ్రగ్స్ కట్టడికి సహకరించట్లేదన్న వైట్‌హౌస్

తామూ 25 శాతం సుంకం విధిస్తామన్న కెనడా

అదేబాటలో నడుస్తామంటూ మెక్సికో హెచ్చరికలు

డబ్ల్యూటీవోలో సవాల్ చేస్తాం: చైనా సర్కారు

వాషింగ్టన్, ఫిబ్రవరి 2: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచార సమయంలో హెచ్చరించినట్టుగానే కెనడా, మెక్సికో, చైనాపై అదనపు సుంకాల కొరడా ఝుళిపించారు. తాను అధికారంలోకి వస్తే దేశంలోకి అక్రమ వలసలను, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకుంటానని ఆయన హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే.. అక్రమ వలసలను కట్టడి చేయలేకపోతున్నాయంటూ కెనడా, మెక్సికో దిగుమతులపై 25% సుంకం.. 'ఫెంటనిల్' అనే సింథటిక్ డ్రగ్ తయారీకి అవసరమైన ముడిపదార్థాలను సరఫరా చేస్తోందంటూ చైనా దిగుమతులపై 10% మేర అదనపు సుంకం విధిస్తూ శనివారం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. కెనడా నుంచి దిగుమతి చేసుకునే చమురు, సహజవాయువు వంటి ఇంధన వనరులపై మాత్రం 10 శాతం సుంకం ఉంటుందని వెల్లడించారు. ఈ సుంకాలు విధించేందుకు వీలుగా అమెరికాలో ఆర్థిక ఎమర్జెన్సీని ట్రంప్ ప్రకటించారు. నిషేధిత ఫెంటనిల్ వంటి మాదకద్రవ్యాలు అమెరికాలోకి అక్రమ మార్గాల్లో ప్రవేశించడం వల్ల ప్రజారోగ్య సంక్షోభం ఏర్పడుతోందని.. సింథటిక్ డ్రగ్స్ ముడిపదార్థాలను అక్రమంగా తరలిస్తున్న నేరగాళ్ల ముఠాలకు చైనా అడ్డుకట్ట వేయలేకపోతోందని.. అందుకే ఆయన ఈ ఉత్తర్వులు జారీ చేశారని వైట్‌హౌస్ ఒక ప్రకటన

మిగతా 2వ పేజీలో...



ఆదివారం రాత్రి ఢిల్లీలో బీజేపీ ప్రచార సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఢిల్లీని భ్రష్టుపట్టించారు

ఆప్ పాలనలో అభివృద్ధికి దూరమైన రాజధాని

పదేళ్లలో కనీసం ప్రజలకు తాగునీరూ ఇవ్వలేదు

1995 నాటి హైదరాబాద్‌లా ఇప్పటి ఢిల్లీ ఉంది

డబుల్ ఇంజన్ సర్కారు ఉండి ఉంటే వాషింగ్టన్, న్యూయార్క్‌ను తలదన్నేలా అభివృద్ధి చెందేది

ప్యాలెస్‌లు కట్టుకున్నవారిని ఇంటికి పంపించాలి

తెలుగు వారంతా బీజేపీకే ఓటేయాలి

ఢిల్లీ ప్రచార సభలో సీఎం చంద్రబాబు పిలుపు

తెలుగు వారికి తోడుగా ఉంటానని భరోసా

12

తెలంగాణలో సగానికిపైగా బీసీలే!

బీసీలు 46.25%.. ముస్లింలలో 10.08%.. మొత్తం బీసీలు 56.33%

తేలిన కుల సర్వే లెక్కలు.. సర్వేలో 96.9 శాతం పాల్గొన్న ప్రజలు

11

రక్షణ బడ్జెట్ తగ్గించలేదు!



ఆయుధ వ్యవస్థల కొనుగోళ్లకు చెల్లింపులు ఉన్నప్పుడే పెంపు: నిర్మల

మన రక్షణ ఎగుమతులూ పెరిగాయ్

25 వేల కోట్లు ఆర్జించాం: ఆర్థిక మంత్రి

2

రాందేవ్ బాబాపై నాన్‌బెయిలబుల్ వారెంట్

జారీ చేసిన కేరళలోని పాలక్కడ్ కోర్టు

తప్పుదోవ పట్టించేలా ఫార్మసీ ప్రకటనలు

రాందేవ్, బాలకృష్ణపై కేసు నమోదు

ఈ నెల 1న కోర్టు విచారణకు గైర్హాజరు

15న ప్రవేశపెట్టాలంటూ వారెంట్లు

2



2

జైలు నుంచి బెయిల్‌పై వచ్చి..

వృద్ధురాలిపై రేప్, హత్య

గుంటూరు జిల్లాలో కామోన్మాది ఘాతుకం

ఇంతకు ముందూ రేప్ కేసుల్లోనే జైలుకు

అయోధ్యలో దళిత యువతిపై

హత్యాచారం

2

మర్మావయంలో కర్ర దూర్చి.. కాళ్లూచేతులు విరగ్గొట్టి.. నగ్నంగా మృతదేహం లభ్యం

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

లేదంటే లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా

మీడియా ఎదుట ఫైజాబాద్ ఎంపీ కన్నీరు

భర్త కిడ్నీ విక్రయించి

ప్రియుడితో పరార్

రూ. 10 లక్షలతో ఉడాయించిన భార్య

కిడ్నీ అమ్మితే ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడొచ్చంటూ మాయమాటలు

బిడ్డ చదువు, పెళ్లి చేద్దామని సూచన

పశ్చిమబెంగాల్‌లో ఘటన

2

జైలు నుంచి బెయిల్‌పై వచ్చి.. వృద్ధురాలిపై అత్యాచారం, హత్య

- పెదనందిపాడులో కామోన్మాది ఘాతుకం
- ఇంతకు ముందూ అత్యాచారం కేసుల్లోనే జైలుకు
- పరారీలో నిందితుడు.. పోలీసుల గాలింపు

పెదనందిపాడు, గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసుల్లో జైలుకు వెళ్లిన ఓ కామోన్మాది.. మూడు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలై మరో ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈసారి ఏకంగా 64 ఏళ్ల వృద్ధురాలిని కాటేశాడు. తన కామవాంఛ తీర్చుకున్నాక ఆమెను దారుణంగా హత్య చేశాడు. గుంటూరు జిల్లా పెదనందిపాడులో జరిగిన ఈ దారుణ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. తొలుత అనుమానాస్పద మృతిగా పోలీసులు భావించినప్పటికీ, ఆ వృద్ధురాలు ఓ ఉన్మాది ఈ ఘాతుకానికి బలైపోయినట్లు గుర్తించారు. నిందితుడు మంజు 2023లో ఇదే తరహా ఓ మహిళపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆ తర్వాత 2024లో కూడా ఓ మహిళపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ప్రస్తుతం ఆ కేసులో జైలులో ఉన్న అతడు మూడు రోజుల క్రితమే బెయిల్‌పై విడుదలయ్యాడు. వృద్ధురాలు స్థానికంగా స్వీపర్‌గా పనిచేసుకుంటూ గుడిసెలో నివాసం ఉంటోంది. శనివారం రాత్రి వృద్ధురాలిపై అత్యాచారం, హత్యకు ఒడిగట్టిన నిందితుడు వెంటనే పరారయ్యాడు. ఆదివారం ఉదయం పనికి రాకపోవడంతో, అదే గ్రామంలో ఉంటున్న ఆమె కుమార్తె గుడిసె వద్దకు వచ్చి చూడగా.. వృద్ధురాలు రక్తం మరకలతో పాటు ఒంటిపై గాట్లతో కనిపించింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. శనివారం రాత్రి సాంబ, మంజు అనే వ్యక్తులు అనుమానంగా తిరగడం గమనించినట్లు స్థానికులు తెలపడంతో పోలీసులు ఆ దిశగా విచారణ జరిపి మంజు రేప్ చేసినట్లు నిర్ధారణకు వచ్చారు. ఘటనా స్థలాన్ని ట్రైనీ ఎస్పీ దీక్షిత, డీఎస్పీ భానోదయ పరిశీలించారు. ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలం వద్ద క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్ఐ మధుపవన్ తెలిపారు. వరుస అత్యాచారాలు, హత్యల నేపథ్యంలో మంజు నేర ప్రవృత్తిపై పోలీసు వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. నిందితుడు మంజును త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

అయోధ్యలో దళిత యువతిపై హత్యాచారం

- బాధిత యువతి కుటుంబానికి న్యాయం జరగాలి
- లేదంటే లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేస్తా
- మీడియా ఎదుట ఫైజాబాద్ ఎంపీ అవధేశ్ కంటతడి

అయోధ్య, ఫిబ్రవరి 2: దళిత యువతిపై హత్యాచారం ఉత్తరప్రదేశ్‌లో దుమారం రేపుతోంది. అయోధ్య సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువతి గురువారం రాత్రి భాగవతం వినేందుకు ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఆమె మృతదేహాన్ని అత్యంత దారుణ స్థితిలో గ్రామ సమీపంలోని కాల్వలో గుర్తించారు. కాళ్లుచేతులు విరగ్గొట్టి, కళ్లు పీకేయడమే కాక మర్మావయాల్లో కర్ర దూర్చినట్లు తేలింది. శరీరంపై ఇతర చోట్లా తీవ్ర గాయాలున్నాయని యువతి కుటుంబ సభ్యులు ఆరోపించారు. యువతి అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా సరిగా స్పందించలేదని విమర్శించారు. పోస్టుమార్టం నివేదిక కోసం ఎదురుచూస్తున్నామని, అది వచ్చాకే నిజానిజాలు తేలుతాయని స్థానిక పోలీసులు తెలిపారు. కాగా, హత్యాచార ఘటనపై మీడియాతో మాట్లాడుతూ ఫైజాబాద్ ఎంపీ అవధేశ్ ప్రసాద్ కన్నీటి పర్యంతమయ్యారు. "ఓ మర్యాద రామా.. ఓ సీతమ్మ తల్లీ మీరెక్కడున్నారు?" అంటూ రోదించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరగాలని లేదంటే ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని హెచ్చరించారు. లోక్‌సభలో విషయాన్ని లేవనెత్తుతానని, ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

మైక్రోసాఫ్ట్ ఉద్యోగులకు షాక్!

- పనితీరు మెరుగుపరచుకోనందునే ఉద్వాసనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తన ఉద్యోగులకు మరోసారి షాక్ ఇచ్చింది. ఉద్యోగులు పనితీరును మెరుగుపరచుకోవడం లేదని తొలగింపులకు ఉపక్రమించింది. దీంతో కొందరు ఉద్యోగులు తక్షణమే తమ కొలువులను కోల్పోతున్నట్టు బిజినెస్ ఇన్‌సైడర్ కథనం పేర్కొంది. ఉద్యోగులు తమ స్థాయికి తగిన కనీస పనితీరు ప్రమాణాల ను అందుకోలేని కారణంగా ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్టు వారికి పంపిన లేఖల్లో పేర్కొంది. తక్షణమే అన్ని విధుల నుంచి రిలీవ్ చేస్తున్నామని, మైక్రోసాఫ్ట్ సిస్టమ్స్, అకౌంట్స్, బిల్డింగ్‌లలోకి యాక్సెస్‌ను తొలగించినట్టు తెలిపింది. అయితే ఎంత మందిపై వేటు పడిందనేది తెలియరాలేదు. కాగా కంపెనీ ఇటీవల సెక్యూరిటీ, ఎక్స్‌పీరియన్సెస్, డివైజెస్, సేల్స్ గేమింగ్ వంటి విభాగాల్లో ఉద్యోగులను తొలగించింది.

కెనడా స్టడీ పర్మిట్లలో 10శాతం కోత

అట్టవా, ఫిబ్రవరి 2: విదేశీ విద్యార్థులకు మంజూరు చేసే స్టడీ పర్మిట్లలో కెనడా కోత విధించింది. ప్రస్తుత సంవత్సరానికి గాను 4,37,000 స్టడీ పర్మిట్లను కెనడా వలసలు, శరణార్థులు, పౌరసత్వ శాఖ(ఐఆర్‌సీసీ) ప్రావిన్స్‌ల వారీగా కేటాయింపులు ఖరారు చేసింది. ఇది మునుపటి సంవత్సరంకంటే 10శాతం తక్కువ. కాగా, విదేశీ విద్యార్థుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడంతో ప్రత్యేకించి నగరాలు, పట్టణాల్లో ఇళ్ల కొరత, ఆరోగ్య సంరక్షణ, పౌరసేవల లభ్యతపై ఆందోళనలు వెల్లువెత్తిన నేపథ్యంలో కెనడా ప్రభుత్వం 2024లో తొలిసారిగా స్టడీ పర్మిట్లపై పరిమితిని అమలు చేసింది. దీనిద్వారా తమ దేశానికి వచ్చే అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను 40 శాతం వరకూ తగ్గించింది.

ఐర్లాండ్‌లో కారు చెట్టుకు ఢీకొని ఇద్దరు తెలుగు విద్యార్థుల మృతి

లండన్, ఫిబ్రవరి2: దక్షిణ ఐర్లాండ్ ప్రాంతంలో ఉన్న కార్లో కౌంటీలో చెట్టును కారు ఢీ కొని ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. మృతులను చెరుకూరి సురేశ్ చౌదరి, చిట్టూరి భార్గవ్‌గా గుర్తించారు. జనవరి 31 శుక్రవారం తెల్లవారుజామున ఘటన జరిగిందని స్థానిక పోలీసు అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన యువకుడిని, యువతిని కిల్కెన్నిలోని సెయింట్ లూక్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబాలకు అందుబాటులో ఉన్నామని డబ్లిన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ప్రమాదానికి గురైన నలుగురు స్నేహితులు కార్లో లోని సేతు(సౌత్ ఈస్ట్ టెక్నాలాజికల్ యూనివర్సిటీ) విశ్వవిద్యాలయం విద్యార్థులు. నలుగురూ ఒకే ఇంట్లో ఉంటున్నారని అధికారులు తెలిపారు.

కుంభమేళాకు పోటెత్తుతున్న భక్తులు

- నేడు వసంత పంచమి నేపథ్యంలో మరింత రద్దీ..



అయోధ్య, ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 2: మహాకుంభమేళాకు భక్తులు పోటెత్తున్నారు. 20 రోజుల్లో 33 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. శనివారం ఒక్కరోజే 2.15 కోట్ల మంది పుణ్య స్నానాలు చేశారు. సోమవారం వసంత పంచమి నేపథ్యంలో 4 నుంచి 6 కోట్ల మంది భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. మౌని అమావాస్య సందర్భంగా చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటన నేపథ్యంలో మరోసారి అవాంఛనీయ ఘటనలు జరగకుండా యూపీ సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. కోల్డ్‌ప్లే సింగర్ క్రిస్ మార్టిన్ తన స్నేహితురాలు డకోటా జాక్సన్‌తో కలిసి కుంభమేళాకు వచ్చి పుణ్యస్నానమాచరించారు.

ట్రంప్ సుంకాల కొరడా

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా వెల్లడించింది. మెక్సికోలో మాదకద్రవ్యాల అక్రమరవాణా ముఠాలకు ప్రభుత్వంతోనే సంబంధాలున్నాయని ఆరోపించింది. డ్రగ్స్ తయారీ, రవాణాకు మెక్సికో సర్కారు సహకరిస్తోందని దుయ్యబట్టింది. తద్వారా ఆ మాదక ద్రవ్యాలన్నీ అమెరికాకు చేరి.. డ్రగ్ ఓవర్‌డోస్ కారణంగా వేలాదిమంది అమెరికన్లు మరణిస్తున్నారని ఆందోళన వెలిబుచ్చింది.



మేమూ విధిస్తాం..

ట్రంప్ విధించిన సుంకాల భారానికి ప్రతిగా.. మెక్సికో, కెనడా కూడా అమెరికాపై ప్రతీకార చర్యలకు దిగాయి. అమెరికా నుంచి తాము దిగుమతి చేసుకునే 155 బిలియన్ డాలర్ల ఉత్పత్తులపై 25 శాతం సుంకాన్ని విధించనున్నట్టు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రకటించారు. ఇందులో 30 బిలియన్ డాలర్ల ఉత్పత్తులపై వెంటనే, మరో 125 బిలియన్ డాలర్ల ఉత్పత్తులపై 21రోజుల తర్వాత నుంచి సుంకాలు విధిస్తామని, ఈలోగా కెనడా కంపెనీలు ఆయా ఉత్పత్తులకు ప్రత్యామ్నాయాలను వెతుక్కోవాలని వెల్లడించారు. "మెక్సికో ప్రయోజనాల పరిరక్షణ" పేరిట 'ప్లాన్ బి'ని అమలు చేయాలని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా తమ దేశ ఆర్థిక మంత్రికి ఆదేశాలు జారీచేశారు. 'ప్లాన్ బి' అంటే.. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై పలు చర్యలు తీసుకోవడం. మెక్సికోలో నేరగాళ్ల ముఠాలతో ప్రభుత్వానికి సంబంధాలున్నాయంటూ అమెరికా చేసిన ఆరోపణలను క్లాడియా తీవ్రస్థాయిలో ఖండించారు. "సుంకాల విధింపుతో సమస్యలు పరిష్కారం కావు. చర్చలతోనే పరిష్కారమవుతాయి" అన్నారు. మరోవైపు అమెరికా తమపై విధించిన 10శాతం అదనపు సుంకాలను ప్రపంచ వాణిజ్య సంస్థలో సవాల్ చేస్తామని చైనా వాణిజ్య శాఖ మంత్రిత్వ శాఖ ఆదివారం వెల్లడించింది. ట్రంప్ సర్కారు నిర్ణయం డబ్ల్యూటీవో నిబంధనల తీవ్ర ఉల్లంఘనే అని మండిపడింది. ఇక.. 'ఫెంటనిల్ అమెరికా సమస్య అని, దాంతో తమకేం సంబంధమని చైనా విదేశాంగ శాఖ ప్రశ్నించింది.

ఏమిటీ ఫెంటనిల్?

భారతీయులు వంటల్లో వాడే గసగసాల (పాపీ) మొక్క నుంచి తీసే నల్లమందు (ఓపియం)ను రసాయనాలతో శుద్ధి చేస్తే హెరాయిన్ అనే మాదక ద్రవ్యం వస్తుంది. పాపీ మొక్క నుంచి వచ్చే మార్ఫిన్, కోడిన్‌వంటివాటిని ఓపియేట్స్‌గా వ్యవహరిస్తారు. పూర్తిగా పాపీ మొక్క నుంచి కాక.. కొంతమేర సింథటిక్ మాలిక్యూల్స్‌ను ఉపయోగించి తయారుచేసే మాదకద్రవ్యాలను 'పార్షియల్లీ సింథటిక్ ఓపియాయిడ్స్' అంటారు. హైడ్రోకోడోన్, ఆక్సీకోడోన్, హైడ్రోమార్ఫోన్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. పాపీ మొక్కతో సంబంధం లేకుండా పూర్తిస్థాయిలో దాన్ని అనుసరించే సింథటిక్ మాలిక్యూల్స్‌తో తయారుచేసే మాదకద్రవ్యాలను 'ఓపియాయిడ్స్'గా వ్యవహరిస్తారు. ఫెంటనిల్, మెథాడోన్, మెపెరిడిన్ వంటివి ఇందుకు ఉదాహరణ. ఈ ఓపియాయిడ్స్ మొక్కల నుంచి తయారయ్యే హెరాయిన్, ఓపియం, మార్ఫిన్, కోడిన్‌లో 50 నుంచి 100 రెట్లు శక్తిమంతమైనవి. ప్రాణాంతక వ్యాధుల కారణంగా భరించలేనంత నొప్పితో బాధపడేవారికి నొప్పినివారణ మందులుగా వీటిని ఇస్తుంటారు. ఈ క్రమంలోనే ఫెంటనిల్‌కు అమెరికా ఔషధ, ఆహార నియంత్రణ సంస్థ కూడా ఎనాల్జెసిక్(నొప్పినివారిణి), ఎనెస్థెటిక్ (మత్తు కలిగించే ఔషధం)గా వినియోగించేందుకు అనుమతులు ఇచ్చింది. కానీ తగు మోతాదులోనే అది నొప్పినివారిణిగా పనిచేస్తుంది. డోసు కాస్త ఎక్కువైనా ప్రాణాంతకంగా మారుతుంది. కొందరిలో 2 గ్రాముల డోసు సైతం కోమా, శ్వాసవ్యవస్థ వైఫల్యానికి కారణమై ప్రాణాలు తీస్తుంది. ఈ డ్రగ్‌ను చాలా మంది అమెరికన్లు ఇటీవలికాలంలో మత్తు కోసం అధికమోతాదులో తీసుకుని ప్రాణాలు పోగొట్టుకుంటున్నట్టు అధికారిక గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. 2021లో ఫెంటనిల్ ఓవర్ డోస్ కారణంగా 1,07,000 మంది, 2022లో రోజుకు సగటున 200మంది ప్రాణాలు కోల్పోయారు. 2023లో 75వేల మంది చనిపోయారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కీలకమైన ఏడు 'స్వింగ్ రాష్ట్రాల' ప్రజలు ప్రధానంగా పేర్కొన్న సమస్యల్లో ఫెంటనిల్ డ్రగ్ ఒకటి. ట్రంప్ అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఫెంటనిల్ తయారీకి అవసరమైన ముడిపదార్థాల సరఫరాను అడ్డుకోలేకపోతోందంటూ చైనాపై 10% అదనపు సుంకం విధించారు.

లోకం తీరు



భర్త కిడ్నీ విక్రయించి ప్రియుడితో పరార్

రూ. 10 లక్షలు తీసుకొని ఉడాయించిన భార్య

కోల్‌కతా, ఫిబ్రవరి 2: భర్త కిడ్నీ విక్రయించి, వచ్చిన సొమ్ము తీసుకొని ప్రియుడితో పరారైన ఓ భార్యామణి ఉదంతం పశ్చిమ బెంగాల్‌లో చోటుచేసుకుంది. హవ్‌డా జిల్లా శంకరైల్ గ్రామానికి చెందిన ఆ మహిళ భర్తకు తీయనిమాటలు చెప్పి చివరకు మోసగించింది. అన్ని కుటుంబాలు మాదిరిగానే వారికి కూడా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. వాటి నుంచి బయట పడాలంటే కిడ్నీని విక్రయించాలని భర్తకు చెప్పి చూసింది. వచ్చిన సొమ్మును బ్యాంకులో వేసుకుంటే కుమార్తె చదువులు, పెళ్లికి సమస్యలు ఉండవని నచ్చజెప్పింది. నిజమే అని నమ్మిన అతడు ఏడాది పాటు వెతికి 'కిడ్నీ కొనుగోలుదారుడు'ను పట్టుకున్నాడు. మూడు నెలల క్రితం కిడ్నీ అమ్మకం జరిగింది. ఇందుకు రూ.10 లక్షలు తీసుకున్నాడు. అనంతరం భార్య మోసం బయటపడింది. ఈ మొత్తం సొమ్ము తీసుకొని ఆ భార్య ప్రియుడితో పరారయింది. బారక్‌పూర్‌కు చెందిన ఓ పెయింటర్‌కు ఫేస్‌బుక్ ద్వారా ఆమెకు పరిచయం ఏర్పడింది. చివరికది ప్రేమగా మారింది. లబోదిబోమన్న ఆ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బారక్‌పూర్‌లో ఉన్నారని తెలుసుకొని పదేళ్ల కుమార్తె, తల్లిదండ్రులు, బంధువులను తీసుకొని అక్కడికి వెళ్లాడు. వారిని చూసి ఇంటి తలుపు వేసుకున్న ఆమె ఎంతకూ తీయలేదు. వారితో మాట్లాడడానికి బయటకు రాలేదు. పైగా ఏమి చేసుకుంటారో చేసుకోండని బెదిరించింది. విడాకులు ఇస్తానని భర్తను హెచ్చరించింది.

ఆధునిక టెక్నాలజీలకు భారత్ సై!

- ఏఐ, రోబోటిక్స్ తదితర టెక్నాలజీల వాడకంలో భారత్ కంపెనీల ముందంజ
- 2030నాటికి నికరంగా లభించే కొత్త ఉద్యోగాలు 9.2 కోట్లు .. ఏఐతో ఉద్యోగ మార్కెట్లో తీవ్ర మార్పులు
- డబ్ల్యూఈఎఫ్ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: కృత్రిమమేధ (ఏఐ), రోబోటిక్స్, అటానమస్ వ్యవస్థలు వంటి అత్యాధునిక టెక్నాలజీలను తమ సంస్థల్లో ప్రవేశపెట్టే విషయంలో భారతీయ పారిశ్రామికవేత్తలు ఇతర దేశాల పారిశ్రామికవేత్తలకన్నా ముందంజలో ఉన్నారు. 'ఉద్యోగాల భవిష్యత్తు' పేరుతో ప్రపంచ ఆర్థిక సంస్థ (డబ్ల్యూఈఎఫ్) ఇటీవల విడుదల చేసిన నివేదిక ఈ వివరాల్ని వెల్లడించింది. సెమీకండక్టర్లు, కంప్యూటింగ్ టెక్నాలజీలను వాడేందుకు భారత్‌లో 35శాతం కంపెనీల అధిపతులు సముఖత వ్యక్తం చేశారని నివేదిక తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఇది సగటున 20శాతం ఉంది. క్వాంటమ్, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీలను ఉపయోగించుకోవటానికీ భారతీయ పారిశ్రామికవేత్తలు సిద్ధపడుతున్నారు. ఈ టెక్నాలజీల పట్ల 21శాతం మంది ఆసక్తితో ఉన్నారని, ఇది ప్రపంచ సగటు 12శాతం కన్నా చాలా ఎక్కువని నివేదిక పేర్కొంది. భారత్‌లో డేటా, ఏఐ, మెషిన్ లెర్నింగ్, సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ రంగాల నిపుణులు గ్లోబల్ ట్రెండ్‌లకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటున్నారని తెలిపింది. ఏఐ నిపుణుల సంఖ్యను పెంచుకోవడంలో అమెరికా, భారత్ ముందువరుసలో ఉన్నాయని పేర్కొంది. అమెరికాలో వ్యక్తిగతస్థాయిలో ఆసక్తి కొద్ది ఏఐ రంగంలోకి ప్రవేశిస్తున్నారని, భారత్‌లో మాత్రం కార్పొరేట్ కంపెనీలు ముందుండి ఏఐ శిక్షణను ప్రోత్సహిస్తున్నాయని తెలిపింది. రానున్న కాలంలో అవసరమైన శ్రామికశక్తికి 2/3వంతు వాటాను భారత్, సబ్‌సహారన్ ఆఫ్రికా దేశాలే అందజేస్తాయని పేర్కొంది. 2030 నాటికి కొత్తగా 17కోట్ల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని.. సాంకేతిక మార్పులు, ఆర్థిక భౌగోళిక ఒత్తిళ్ల తదితర కారణాలతో 7.8కోట్ల ఉద్యోగాలు పోతాయని, ఫలితంగా నికరంగా లభించే కొత్త ఉద్యోగాలు 9.2 కోట్లని అంచనా వేసింది. ఇక ఏఐ రంగంలో శరవేగ మార్పులతో క్యాషియర్లు, టికెట్ క్లర్కులు, బిల్డింగ్ కేర్‌టేకర్లు, అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్లు, గ్రాఫిక్ డిజైనర్లు, ప్రింటింగ్ వంటి ఉద్యోగాలు క్రమంగా కనుమరుగవుతాయని నివేదిక తెలిపింది. వ్యవసాయ, భవన నిర్మాణ కూలీలు, లారీ, ట్రక్కు డ్రైవర్లు, డెలివరీ సర్వీసుఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, నర్సింగ్ ఉద్యోగులు, టీచర్లకు డిమాండ్ పెరుగుతుందని పేర్కొంది. ఏఐ, బిగ్‌డేటా, సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలకు భారీ ఎత్తున డిమాండ్ ఉంటుందని తెలిపింది.

ఇది మధ్యతరగతి బడ్జెట్: మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: భారతదేశ చరిత్రలోనే మధ్యతరగతికి అత్యంత అనుకూల బడ్జెట్ ఇది అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ప్రతి కుటుంబం హ్యాపీగా ఉందన్నారు. ఆదివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మోదీ మాట్లాడారు. రూ.12 లక్షల వరకు ఆర్జించే ప్రజలకు తాజా బడ్జెట్ గణనీయమైన ఉపశమనం కలిగించిందని, స్వాతంత్ర్య భారత చరిత్రలో ఇప్పటి వరకూ ఇంతటి ప్రయోజనం కలగలేదని చెప్పారు. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం తప్పుడు హామీ లు ఇస్తోందని, అవినీతిలో కూరుకుపోయిందని, దాని ఫలితంగానే దేశరాజధానిలో ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయని మోదీ విమర్శించారు. అద్దాల మేడ ల్లో నివసించేవారికి పేదల పూరిగుడిసెలు, మధ్యతరగతి ప్రజల డబు ల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు పట్టవంటూ ఆప్ అధినేత కేజ్రీవాల్‌పై విమర్శలు గుప్పించారు. ప్రజలను లూటీ చేస్తున్నవారిని జవాబుదారీగా చేస్తామన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

వేల ఏళ్ల భారత్-ఇండోనేసియా బంధం

భారత్, ఇండోనేసియా దేశాల మధ్య సంబంధాలు భౌగోళిక రాజకీయ అంశాలకు మాత్రమే పరిమితం కాదని, వేల సంవత్సరాలుగా ఒకే విధమైన సంస్కృతి, చరిత్రను కలిగి ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. రెండు దేశాలూ భిన్నత్వంలో ఏకత్వం కలిగి ఉన్నాయన్నారు. ఇండోనేసియా రాజధాని జకార్తాలోని మురుగన్ ఆలయ మహాకుంభాభిషేకానికి విచ్చేసిన భక్తులను ఉద్దేశించి ఆదివారం మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించార

బాబా రాందేవ్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్

తిరువనంతపురం, ఫిబ్రవరి 2: యోగా గురు బాబా రాందేవ్‌కు కేరళలో కోర్టు ఒకటి నాన్‌బెయిలబుల్ వారెంటు జారీ చేసింది. విచారణకు హాజరు కావాలన్న ఆదేశాలను విస్మరించినందుకు పాలక్కాడ్‌లోని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేటు కోర్టు-2 ఈ వారెంటు ఇచ్చింది. ఔషధాలకు సంబంధించి పతంజలి సంస్థకు అనుబంధంగా ఉన్న దివ్య ఫార్మసీ తప్పుదోవపట్టించేలా ప్రకటనలు ఇచ్చిందంటూ ఆ సంస్థ నిర్వాహకులైన రాందేవ్‌తో పాటు, ఆచార్య బాలకృష్ణలపై కేరళ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేసు పెట్టారు. ఫిబ్రవరి ఒకటో తేదీన విచారణకు హాజరు కావాలంటూ గతంలో కోర్టు నోటీసులు ఇవ్వగా వారు దాన్ని అమలు చేయలేదు. దాంతో వారిని ఈ నెల 15న కోర్టులో ప్రవేశపెట్టాలంటూ శనివారం వారెంట్లు జారీ చేసింది.

రక్షణ బడ్జెట్ తగ్గించలేదు!

ఆయుధ వ్యవస్థల కొనుగోళ్లకు చెల్లింపులు ఉన్నప్పుడే పెంపు: నిర్మల



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ఈ దఫా బడ్జెట్‌లో రక్షణ శాఖకు కేటాయింపులు సంతృప్తిగా లేవన్న వాదనను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. 2024-25లో రక్షణ బడ్జెట్ రూ.6.22 లక్షల కోట్లు ఉండగా.. కొత్త బడ్జెట్‌లో రూ.6.81 లక్షల కోట్లకు (9.53%) పెంచారు. అయితే ఇది చాలా తక్కువని విమర్శలు వస్తున్న నేపథ్యంలో నిర్మల ఓ ఇంటర్వ్యూలో వివరణ ఇచ్చారు. రక్షణ బడ్జెట్ ప్రత్యేకతను అర్థం చేసుకోవాలన్నారు. రక్షణ ఉత్పత్తుల కొనుగోళ్లకు ఒక ఏడాదిలో ఆర్డర్ ఇచ్చినప్పుడు.. ఆ ఏడాదిలోనే చెల్లింపులు జరపాల్సి ఉంటుందని.. అప్పుడు తప్పనిసరిగా కేటాయింపులు పెంచుతూ వస్తున్నామని తెలిపారు. ఈ చెల్లింపులు దీర్ఘకాలిక ప్రాతిపదికన ఉంటాయన్నారు. 'రక్షణ వ్యయంలో కోతపెట్టలేదు. పైగా పెన్షన్లు, కొనుగోలు వ్యయాలు తగ్గకుండా చూస్తున్నాం. సైనిక విభాగాలు కొనుగోలు చేస్తున్న ఉత్పత్తుల్లో 60శాతం దేశీయంగా తయారుచేసినవే. దీన్ని గుర్తించాలి. అయితే వేరే దేశం (రష్యా) నుంచి భారీఎత్తున రక్షణ ఉత్పత్తులు కొనడం వేరే విషయం. రోజువారీ వినియోగించాల్సినవి, ఇతర ఉత్పత్తులను మన దేశం నుంచే కొంటున్నాం. ఆయుధ వ్యవస్థలను ఎగుమతి కూడా చేస్తున్నాం. విదేశాలకు ఎగుమతుల ద్వారా వస్తున్న ఆదాయం తాజాగా రూ.25 వేల కోట్లు దాటింది' అని వివరించారు. కాగా.. చైనా, పాకిస్థాన్‌ల నుంచి పొంచి ఉన్న సవాళ్ల నేపథ్యంలో నూతన ఆయుధ వ్యవస్థలు కొనాలని సాయుధ బలగాలు అభిలషిస్తున్నాయి. ఈ క్రమంలో రూ.6.8 లక్షల కోట్ల తాజా రక్షణ బడ్జెట్‌లో ఇందుకోసం రూ.1.8 లక్షల కోట్లు కేటాయించడం గమనార్హం. ఈ మొత్తంతో ఆయుధాలు, యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, ఇతర సైనిక సామగ్రి కొననున్నారు. నిజానికి భారత స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 1.9 శాతం రక్షణ బడ్జెట్‌కు కేటాయిస్తున్నారు. నిరుడు రూ.6.2 లక్షల కోట్లు కేటాయించినా ఖర్చు మాత్రం రూ.6.41 లక్షల కోట్లకు చేరినట్లు సవరించిన అంచనాల్లో పేర్కొన్నారు.

మోదీ సరే.. అధికారులు ససేమిరా!!

ఆదాయ పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచేందుకు ప్రధాని మోదీ సంపూర్ణ మద్దతు తెలియజేశారని.. అయితే అధికారులు మాత్రం ఇందుకు అంగీకరించలేదని నిర్మలా సీతారామన్ చెప్పారు. 'పన్ను రేట్లు తగ్గించాలని ప్రధాని స్పష్టతతో ఉన్నారు. మా ఆర్థిక శాఖ యంత్రాంగానికి నచ్చజెప్పి ఈ ప్రతిపాదనపై ముందుకెళ్లాం. పన్ను వసూలు సామర్థ్యంపై కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డును ఒప్పించడానికి చాలా శ్రమించాల్సి వచ్చింది' అని తెలిపారు. పన్ను రేట్ల తగ్గింపు వల్ల ప్రత్యక్ష పన్నుల ఆదాయంలో రూ.లక్ష కోట్లు, పరోక్ష పన్నుల రాబడిలో రూ.2,600 కోట్లు నష్టం వచ్చే అవకాశమున్నా ప్రభుత్వం ముందుకెళ్లడం గమనార్హం. ప్రధాని వివిధ వర్గాల ప్రజలు చెప్పేది నిత్యం ఆలకిస్తుంటారని.. అణగారిన వర్గాలు.. ప్రత్యేకించి గిరిజనులతో కూడా మాట్లాడుతుంటారని.. వారందరితో సంభాషించి సమాచారం సేకరిస్తారని నిర్మల వెల్లడించారు.

దేశానికి క్యాన్సర్ సవాల్

2025లో 15 లక్షల కొత్త కేసులు నమోదయ్యే ప్రమాదం

- ముందే గుర్తిస్తే చాలా కేసులు నయం చేయదగ్గవే
- కేంద్రం బడ్జెట్ నిర్ణయాలు ప్రశంసనీయం
- ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు



రేపు ప్రపంచ క్యాన్సర్ దినం

భారతదేశానికి 2025లో క్యాన్సర్ ముఖ్యమైన ప్రజారోగ్య సవాల్‌గా మారనుందని.. దేశవ్యాప్తంగా 15 లక్షల కొత్త కేసులు నమోదయ్యే ప్రమాదం ఉందని ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ మహమ్మారిని నోటిఫయబుల్ డిసీజ్‌గా గుర్తించి.. దాని కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. మంగళవారం (ఫిబ్రవరి 4) 'ప్రపంచ క్యాన్సర్ దినం' సందర్భంగా.. దాని నియంత్రణ, నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆయన పలుసూచనలు చేశారు. దేశంలో నమోదవుతున్న క్యాన్సర్ మరణాల్లో మూడింట రెండువంతులు.. పొగాకు, మద్యం, ఇన్ఫెక్షన్ల కారణంగా సంభవించేవేనని, ఈ క్యాన్సర్లన్నీ నిరోధించదగ్గవి, తొలి దశలో గుర్తించి, సత్వర చికిత్సతో నయంచేయదగ్గవేనని ఆయన స్పష్టం చేశారు. "క్యాన్సర్‌పై పోరులో అందరూ కలిసిరావాలి" అంటూ విధాన నిర్ణేతలు, వైద్య నిపుణులు, ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. క్యాన్సర్ రోగుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో.. బాధితులకు సత్వర వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చేలా కేంద్ర బడ్జెట్‌లో మోదీ సర్కారు కీలక నిర్ణయాలను ప్రకటించడంపై ప్రశంసలజల్లు కురిపించారు. క్యాన్సర్ బాధితుల ప్రాణాలు కాపాడే ఔషధాల ధరలను ప్రజలకు మరింత అందుబాటులోకి తేవడం, 36 ప్రాణాధార ఔషధాలకు కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు, మూడు ప్రాణాధార ఔషధాలపై జీఎస్టీ తగ్గింపు, మూడేళ్లలో జిల్లాకో క్యాన్సర్ డే కేర్ కేంద్రం ఏర్పాటు వంటి నిర్ణయాలను.. ఆ వ్యాధిని తొలిదశలోనే గుర్తించి, బాధితులకు అత్యున్నతస్థాయి వైద్యాన్ని అందుబాటులో ఉంచాల్సిన కీలక అవసరాన్ని కేంద్రం నొక్కిచెప్పిన తీరును కొనియాడారు. క్యాన్సర్‌ను జయించినవారి సంఖ్య (సర్వైవల్ రేటు) పెరగాలంటే.. దాన్ని సకాలంలో గుర్తించడమే ముఖ్యమని ఆయన తేల్చిచెప్పారు. "తొలి దశలోనే గుర్తించగలిగితే గనక.. చాలా క్యాన్సర్లకు ఇప్పుడు మంచి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అయితే, ముందు మనం ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను బలోపేతం చేసుకోవాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. అన్ని సామాజిక, ఆర్థిక నేపథ్యాలకు చెందిన వ్యక్తులకూ క్యాన్సర్ గుర్తింపు, చికిత్స సౌకర్యాలు అందుబాటులో ఉండాలి" అని ఆయన పేర్కొన్నారు. భారత వైద్య పరిశోధన మండలి తదితర సంస్థల విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మన దేశంలో నిత్యం 200 మంది సర్విక్స్ క్యాన్సర్‌తో చనిపోతున్నారని.. అన్ని రకాల క్యాన్స ర్ బాధితులనూ పరిగణనలోకి తీసుకుంటే రోజుకు 1600 మంది దాకా ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. కొవిడ్ మహమ్మారిపై మన దేశం చేసిన పోరాటం నుంచి నేర్చుకున్న విలువైన పాఠాలు క్యాన్సర్‌పై పోరులో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

- సెంట్రల్ డెస్క్

అలా గుర్తించాలి..

అమెరికాలోలాగానే భారతదేశంలోనూ క్యాన్సర్‌ను 'నోటిఫయబుల్ డిసీజ్'గా గుర్తించాలని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు సూచించారు (అలా గుర్తిస్తే.. తమ వద్దకు వచ్చేవారిలో ఎవరైనా క్యాన్సర్ బారిన పడినట్టు వైద్యపరీక్షల ద్వారా తేలితే వైద్యులు వెంటనే ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది). దానివల్ల ఒక ప్రాంతంలో ఎంతమంది క్యాన్సర్ బాధితులున్నారు? ఏయే రకాల క్యాన్సర్లు ఏ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నదీ? తదితర వివరాలతో కూడిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుందని, కేసుల సంఖ్య ఆధారంగా ఆయా ప్రాంతాల్లో వనరుల కేటాయింపు చేయవచ్చని ఆయన చెప్పారు. కానీ, ప్రస్తుతం మన దేశంలో నాలుగు రాష్ట్రాలు మాత్రమే క్యాన్సర్‌ను నోటిఫయబుల్ డిసీజ్‌గా గుర్తించాయని గుర్తుచేశారు. "ప్రస్తుతం భారత జనాభాలోని 10% మందిని మాత్రమే 'జనాభా ఆధారిత క్యాన్సర్ రిజిస్ట్రీ (పీబీసీఆర్)'లు కవర్ చేస్తున్నాయి. అలా గే.. 'నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ (ఎన్సీపీఆర్)' 17% మందిని మాత్రమే కవర్ చేస్తోంది. అన్ని రాష్ట్రాల్లో క్యాన్సర్‌ను నోటిఫయబుల్ వ్యాధిగా గుర్తిస్తే విధానపరమైన నిర్ణయాలను వేగంగా తీసుకునే వీలుంటుంది" అని ఆయన పేర్కొన్నారు.

'బిల్వ మంగళుడు' బీసీ కృష్ణ కన్నుమూత

- రాష్ట్ర స్థాయి కళాకారుడిగా గుర్తింపు
- నాలుగు వేలకు పైగా ప్రదర్శనలు


బిల్వ మంగళ పాత్రలో బీసీ కృష్ణ

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కర్నూలు బిల్వమంగళుడిగా నాటకరంగానికి అపారమైన కీర్తి గడించి పెట్టిన బీసీ కృష్ణ(80) శనివారం రాత్రి కర్నూలు నగరంలో కన్నుమూశారు. ఆదివారం అంత్యక్రియలు పూర్తి అయ్యాయి. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన చికిత్స తీసుకుంటూ, కోలుకోలేక తుదిశ్వాస విడిచారు. కర్నూలు నాటక రంగానికి రాష్ట్రస్థాయిలో ఖ్యాతి తీసుకువచ్చిన ప్రముఖుల్లో ఒకరిగా ఆయన కీర్తి రంగస్థలం మీద శాశ్వతంగా విరాజిల్లుతూనే ఉంటుంది. నాలుగు దశాబ్దాలకు పైగా ఆయన చింతామణి నాటకంలో బిల్వ మంగళుడిగా వేలాది ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారు. వాచకం, నటనా కౌశలం, అభినయ చాతుర్యాలను గుర్తించి కేవలం బీసీ కృష్ణ కోసమే పరమహంస నాట్య కళా సమితిని స్థాపించి, ఆనాటి విఖ్యాత నటులు కేవీ రాఘవరావు, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి వంటి వారిని కర్నూలుకు పిలిపించి, వారికి కర్నూలులో నివాసం కల్పించి బీసీ కృష్ణకు శిక్షణ ఇప్పించారు. అలా పద్య నాటక రంగంలో ఆరంగ్రేటం చేసిన బీసీ కృష్ణ మొదట సత్య హరిశ్చంద్రలో హరిశ్చంద్రునిగా, శ్రీకృష్ణ తులాభారంలో శ్రీకృష్ణునిగా నటించారు. అయితే చింతామణి నాటకంలో బిల్వ మంగళుని పాత్ర ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెట్టింది.

పురస్కారాలు ఎన్నో..

బీసీ కృష్ణ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం నుంచి ఉత్తమ నటుడుగా ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.. టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కందుకూరి పురస్కారం కూడా ఆయనకు లభించింది. అలాగే ఎన్నో కళాపరిషత్తుల పోటీలకు ఆయన న్యాయ నిర్ణేతగా వెళ్లి సత్కారాలు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో గొప్ప కళాకారునిగా గుర్తింపు పొందిన బీసీ కృష్ణ మృతి కళారంగానికి తీరని లోటని కర్నూలు జిల్లా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఒక గొప్ప రంగస్థల కళాకారుడిని కోల్పోయిందన్నారు.

'కథా నిలయం'తో తెలుగు సాహిత్యానికి మేలు

- కాళీపట్నం రామారావు అందించిన బహుమానం
- ఖమ్మంలో ఘనంగా 'కథానిలయం' వార్షికోత్సవం



ఖమ్మం సాంస్కృతికం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): "కథలు చరిత్ర నిర్మితాలు. ఆధునిక చరిత్రకు అద్దం వంటివి. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సాహిత్య సంస్థలు ఉన్నా.. 'కథానిలయం' మాదిరిగా కథలను నిక్షిప్తపరిచే క్రతువు ఎక్కడా లేదు. కాళీపట్నం రామారావు తెలుగు కథకు ఇచ్చిన బహుమానమే కథానిలయం" అని అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి కొనియాడారు. సాధారణ గ్రంథాలయాల మాదిరిగా కాకుండా డిజిటల్ రూపంలో కథలను భద్రపరుస్తుండడం తెలుగు కథా సాహిత్యానికి, భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేకూర్చే అంశమన్నారు. శ్రీకాకుళంలో ఉన్న కథానిలయం.. ప్రపంచ స్థాయి సాహిత్య కేం ద్రంగా విరాజిల్లుతోందన్నారు. ఖమ్మంలోని వేదిక ఫంక్షన్ హాల్‌లో ఈస్థటిక్స్ స్పేస్ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 'కథానిలయం' వార్షికోత్సవం నిర్వహించారు. చక్రపాణి మాట్లాడుతూ.. వేల మంది రచయితలకు చెందిన లక్షకుపైగా కథలు కథా నిలయంలో కొలువు తీరడం అభినందనీయమన్నారు. తెలంగాణ, రాయలసీమ, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన కథలు, కథకుల గురించి విస్తృతంగా తెలుసుకునేందుకు కథానిలయం దోహదపడుతుందన్నారు. కాళోజీ అవా ర్డు గ్రహీత సీతారాం మాట్లాడుతూ తెలుగు కథా ప్రత్యేకత భిన్నత్వం అని తెలిపారు. తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాలకు చెందిన రచయితలు.. ఎవరికి వారు ప్రత్యేకతను పాటిస్తూ సామాజిక ప్రయోజనం దిశగా కథలను మలిచారన్నారు. మహిళా కథా రచయితలు సైతం పురుషులకు దీటుగా కథాప్రకియలో రాణిస్తుండడం గొప్ప విషయమన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ అధ్యక్షతన తెలంగాణ సాహిత్యంపై విస్తృత చర్చ నిర్వహించారు. తెలంగాణ కథ- సమాజ కేంద్రకం- వ్యక్తి కేంద్రకం- పరిణామం అనే అంశాలపై సంగిశెట్టి శ్రీనివాస్, కేపీ.అశోక్‌కుమార్, తిరునగరి దేవకీదేవి మాట్లాడారు.

సిక్కోలులో సందడిగా.. రథసప్తమి ఉత్సవాలు ప్రారంభం



అరసవల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో రథసప్తమి ఉత్సవాలు ఆదివారం సందడిగా ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి మంగళవారం వరకూ మూడు రోజులపాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో 5వేల మందితో సూర్యనమస్కారాలు నిర్వహించి.. ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తోపాటు అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, యోగాసాధన, స్వచ్ఛంద, ధార్మిక సంస్థల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. యోగా గురువు రామారావు ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు చేశారు.

వైభవోపేతంగా ఆదిత్యుని శోభాయాత్ర....

ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆదిత్యుడి శోభాయాత్ర ప్రారంభించారు. శోభాయాత్రలో సుమారు 20వేలమంది పాల్గొన్నారు. సూర్యదేవుని సుందరంగా అలంకరించిన సప్తాశ్వరథంపై ఆశీనులను చేశారు. అనంతరం అన్నవరం సత్యదేవుని రథం, విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర అమ్మవారి రథం, వెనుక టూరిజం శకటం, ఐటీడీఏ శకటం, మత్స్యశాఖ, న్యూక్లియర్ పవర్ ప్లాంట్, ఎయిర్‌పోర్టు, ఆరోగ్యశాఖ, అగ్నిమాపక శకటాలు కూడా యాత్ర లో పాల్గొన్నాయి. కాగా, సోమవారం అర్ధరాత్రి సూర్యనారాయణస్వామికి క్షీరాభిషేకం నిర్వహిస్తారు. 12 గంటల నుంచి నిజరూప దర్శనంలో స్వామిని చూసేందుకు భక్తులను అనుమతిస్తారు.

తిరుమల్లో రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి

తిరుమల, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం జరగనున్న రథసప్తమి వేడుకకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆరోజు వేకువజాము నుంచి రాత్రి వరకు మలయప్పస్వామి ఏడువాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

టీడీపీ స్థలానికి ఎసరు!

(మొదటి పేజీ తరువాయి)

ముప్పా సుబ్బారావు అనే వ్యక్తి టీడీపీ కార్యాలయం కోసం 2000వ సంవత్సరంలో తొమ్మిదిన్నర సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. పైగా దానిని అధినేత చంద్రబాబు పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. విరాళంగా ఇచ్చిన స్థలం బాపట్లలోని శ్రీనివాసనగర్ పరిధిలోని సర్వే నంబరు 969-1లో ఉంది. ఇక్కడ భూముల ధరలు గత పదేళ్ల నుంచి భారీగా పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం ఆ స్థలం ధర దాదాపు రూ.కోటిన్నరగా ఉంది. ధరలు పెరుగుతుండడంతో భూ మాఫియా కన్ను ఖాళీగా ఉన్న ఆ స్థలంపై పడింది. 2010లోనే నకిలీ రిజిస్ట్రేషన్ల బాగోతం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు ఆరు సార్లు నకిలీ డాక్యుమెంట్లతో దానిని అమ్మాలని చూశారు. ఆ పత్రాలతో బాపట్లలోని ఓ బ్యాంకులో రుణం తీసుకోవడానికి తాజాగా యత్నించగా.. వీరి బాగోతం బయటపడింది. ఈ విషయం బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాలతో టీడీపీ శ్రేణులు ఆదివారం బాపట్ల టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బాపట్ల మండలం కొత్తఓడరేవుకు చెందిన నక్కా సత్తార్‌రెడ్డి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఆ స్థలం విషయంలో దొంగ డాక్యుమెంట్లు పుట్టించిన ఇతడికి.. ఈ తరహా మోసాలు వెన్నతో పెట్టిన విద్య అని విచారణలో వెల్లడైనట్లు సమాచారం. కృష్ణా జిల్లా చల్లపల్లికి చెందిన ఓ వ్యక్తి పేరు మీద ఇప్పటికే పలుమార్లు లింక్ డాక్యుమెంట్లు సృష్టించి అమ్మి రూ.కోట్లు కొల్లగొట్టాలనే పన్నాగానికి భూ మాఫియా తెరలేపింది. గతేడాది డిసెంబరులో సదరు వ్యక్తికి విక్రయించి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయడమే కాకుండా ఏకంగా బాపట్ల మున్సిపాలిటీలో ఆ స్థలానికి పన్ను కూడా వేయించుకున్నారు. ఈ భూ మాఫియా ముఠాలో సత్తార్‌రెడ్డితో పాటు చీరాల మండలం పాలిబోయినవారిపాలేనికి చెందిన ఇంకో వ్యక్తి కూడా ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు విచారణలో తేలింది.

వరుసగా వెలుగుచూస్తున్న మోసాలు..

వైసీపీ పాలనలో భూ మాఫియా ఆగడాలకు నేతల దన్ను దొరకడంతో వారు రెచ్చిపోయారు. 2023లో దొంగ పత్రాలు సృష్టించి ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ఆసరాగా నరసరావుపేటలో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించిన ఉదంతం ఇటీవలే వెలుగులోకి వచ్చింది. ఆ కేసులో నరసరావుపేట పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. ప్రస్తుతం టీడీపీ కార్యాలయ స్థలాన్ని కాజేయాలని చేసిన భూమాఫియాకు వారితో సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది.

ఇన్నేళ్లూ ఏం చేశారు?

పార్టీ కార్యాలయం కోసం పాతికేళ్ల కిందట టీడీపీ అభిమాని తొమ్మిదిన్నర సెంట్ల స్థలం విరాళంగా ఇస్తే రెండున్నర దశాబ్దాల్లో అక్కడ ఆఫీసు కట్టలేకపోవడంపై టీడీపీ శ్రేణులే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. గతంలో దొంగ డాక్యుమెంట్లతో ఈ స్థలాన్ని విక్రయించడానికి ప్రయత్నాలు జరిగినప్పుడే జాగ్రత్తపడాల్సి ఉండగా.. నేతలు నిర్లక్ష్యం వహించారు. దానిని కాపాడుకునే ప్రయత్నాలు చేయలేదు. ఇప్పుడు దొంగ రిజిస్ట్రేషన్ అంశం ఆలస్యంగా వెలుగులోకి చూడడంతో ఆగమేఘాల మీద ఆ స్థలంలో బోర్డు ఏర్పాటు చేయడం కొసమెరుపు.



కొలను భారతిలో వసంత పంచమి

ఆత్మకూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చదువులతల్లి సరస్వతి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకుని నంద్యాల జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతి క్షేత్రంలో ఆదివారం వసంత పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. చిన్నారులకు విద్యాబుద్ధులు సిద్ధించాలని సామూహిక అక్షరాభ్యాసం, బీజాక్షర క్రతువులను నిర్వహించారు.

ముగిసిన అరకు చలి ఉత్సవ్



అరకులోయ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అరకు చలి ఉత్సవ్ ఆదివారం ఘనంగా ముగిసింది. కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఢంకా మోగించి ఉత్సవానికి ముగింపు పలికారు. ఉత్సవాల వేదికైన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, అనేక రకాల చేతి వృత్తుల ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లు స్థానికులు, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవ్ ఆఖరి రోజు ఉదయం అరకులోయ మండలం సుంకరమెట్ట కొండలపై ట్రెకింగ్, గిరిజన మ్యూజియం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

రైతాంగ, కార్మిక వ్యతిరేక బడ్జెట్

- నెల్లూరులో ప్రతులు దహనం చేసిన సీపీఎం, సీఐటీయూ

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా ఉందని సీపీఎం, సీఐటీయూ విమర్శించాయి. ఈ మేరకు నెల్లూరులో సీపీఎం, సీఐటీయూ నేతలు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. నెల్లూరు నగరంలో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు (ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో) జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం వారు స్థానిక అన్నమయ్య సర్కిల్ వద్ద బడ్జెట్‌కు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత మాట్లాడుతూ... కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ సంపన్నులకు ఊడిగం చేసేదిలా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ రైతుల ఆర్థికాభివృద్ధికి వ్యతిరేకంగా ఉందని, దీన్ని దేశంలోని రైతులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ... ఈ బడ్జెట్ వల్ల వ్యవసాయ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ పథకానికి అవసరమైన నిధులివ్వలేదని దుయ్యబట్టారు. కాగా, సీపీఎం రాష్ట్ర మహాసభల ముగింపు సందర్భంగా సోమవారం నగరంలోని వీఆర్సీ క్రీడా మైదానంలో భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్ ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు.

ఎస్టీ వర్గీకరణ చేపట్టాలి: యానాదుల సంఘం

అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ తరహాలో ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని యానాదుల పొలిటికల్ ఫోరం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెనుకబడిన యానాదులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించడంతో పాటు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో రాష్ట్ర కన్వీనర్ కేసీ పెంచలయ్య అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్టీ వర్గీకరణ కోసం దశల వారీగా పోరాటం చేపట్టాలని నిర్ణయించారు. వర్గీకరణ చేపట్టాలని కోరుతూ ఈ నెల 8న సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందించాలని, ఏప్రిల్ 14న నెల్లూరులో యానాదుల వర్గీకరణ భేరీ నిర్వహించాలని, ఎస్టీ వర్గీకరణ కోసం యానాది రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేయాలని తీర్మానించారు. రాష్ట్రంలోని గిరిజన తెగల్లో అధిక జనాభా కలిగిన యానాదులు నేటికీ వెనుకబడి ఉన్నారని, సామాజిక న్యాయం దిశగా ముందుకు వెళ్తున్న కూటమి ప్రభుత్వం.. ఎస్టీ వర్గీకరణ చేసి న్యాయం చేయాలని కోరారు. యానాదులకు చట్టసభల్లో అవకాశాలు కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు యానాదులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో యానాది సంఘాల నాయకులు బాపట్ల బ్రహ్మయ్య, చేవూరు సుబ్బారావు, రావూరి రాజు, చలంచర్ల పెదబ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ఎత్తు తగ్గిస్తే ఉత్తరాంధ్ర, సీమకు తీరనినష్టం: బొత్స



విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం వల్ల ఉత్తరాంధ్రతోపాటు రాయలసీమ ప్రాంతానికి తీరని నష్టం జరుగుతుందని శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పోలవరం ఎత్తును 45.72 నుంచి 41.15 మీటర్లకు తగ్గిస్తూ నిధులు కేటాయించడం బాధాకరమన్నారు. పోలవరం ఎత్తు తగ్గిస్తే తలెత్తే ఇబ్బందులపై నీటిపారుదల శాఖ నిపుణులు, మేధావులతో ఒక సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ బడ్జెట్‌లో మహాకవి గురజాడ పేరు ప్రస్తావించడం తప్పితే రాష్ట్రానికి ప్రయోజనమేమీ లేదని ఎద్దేవా చేశారు. బిహార్‌కు చెందిన నితీశ్‌కుమార్ పార్టీకి 12 మంది ఎంపీలు ఉంటేనే ఆ రాష్ట్రానికి భారీగా కేటాయింపులు జరిగాయని, కానీ 16 మంది టీడీపీ ఎంపీల మద్దతు ఉన్న ఏపీని మాత్రం కేంద్రం విస్మరించిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అడ్డుచెప్పడం వల్లే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందని, ఈ విషయాన్ని ఇటీవల విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి చెప్పారని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని చంద్రబాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలన్నారు. విజయసాయిరెడ్డి వైసీపీకి రాజీనామా చేయడం ఆయన వ్యక్తిగతమని.. దీనిపై తాను స్పందించనని బొత్స చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు పాల్గొన్నారు.

పోలవరంపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు

- ఆయన రెండు దశల పాపం.. రాష్ట్రానికి శాపం: నిమ్మల

పాలకొల్లు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టుపై మాట్లాడే అర్హత జగన్‌కు, వైసీపీ నాయకులకు లేదని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. రెండు దశలు.. 41.15 మీటర్లు, 45.72 మీటర్ల ఎత్తున ప్రాజెక్టు నిర్మాణమంటూ కేంద్రానికి పంపి ఆయన చేసిన పాపం ప్రస్తుతం రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. కేంద్రంలో మోదీ.. రాష్ట్రంలో చంద్రబాబు-పవన్ కల్యాణ్ నాయకత్వంలో డబుల్ ఇంజన్ పాలన వల్లే కేంద్ర బడ్జెట్‌లో పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు నిధులు, జలజీవన్ మిషన్ పొడిగింపు వంటి పలు ప్రయోజనాలు లభించాయని తెలిపారు. నిమ్మల ఆదివారమిక్కడ టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలవరం విషయంలో అబద్ధాలు మాట్లాడే జగన్‌ను తెలుగు జాతి ప్రజలు, రైతులు క్షమించరని చెప్పారు.టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తిచేసుకున్న డయాఫ్రం వాల్‌ను ధ్వంసం చేసిన ఆయన చరిత్రహీనుడిగా మిగిలిపోతారని చెప్పారు. 2019 ఎన్నికల్లో నిర్వాసితులకు ఆయనిచ్చిన హామీలు నీటి మూటలేనని.. ఐదేళ్ల పాలనలో వారికి ఒక్క రూపాయి సాయం చేయలేదని.. పునరావాస కాలనీల్లో అరబస్తా సిమెంట్ పని కూడా చేయకుండా దగా చేశారని ధ్వజమెత్తారు.

15 మందిపై పిచ్చికుక్క దాడి

వీరులపాడు (ఎన్టీఆర్ జిల్లా), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జయంతి గ్రామంలో ఓ పిచ్చికుక్క 15 మందిని కరిచింది. పిచ్చికుక్క దాడిలో 8 మందికి తీవ్ర గాయాలు కాగా, మరో ఏడుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. వారంతా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుక్కల బెడద అధికంగా ఉందని ప లుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

కళా ఉద్యమాలను నిర్మిస్తాం: ఏఐపీఎల్‌సీఎఫ్

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాద, ప్రపంచీకరణలకు వ్యతిరేకంగా జాతీయవాద సాహిత్య, సాంస్కృతిక, కళా ఉద్యమాలను నిర్మిస్తామని అఖిలభారత సాహిత్య సాంస్కృతిక కళా రంగ(ఏఐపీఎల్‌సీఎఫ్) సభలో వక్తలు స్పష్టం చేశారు. గుంటూరు లో 3 రోజులుగా జరిగిన అఖిల భారత ప్రజాసాహిత్య సాంస్కృతిక సభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజలను కులం, మతం, ప్రాంతం, భాషల ప్రాతిపదికన చీలుస్తూ అభివృద్ధి నాగరికత పేరుతో విష సంస్కృతిని వ్యాప్తి చేస్తున్న పాలకపార్టీ ల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐపీఎల్‌సీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రవిబాబు, ఉపాధ్యక్షుడు దివి కుమార్, కోశాధికారి భట్టు రమణ ప్రసాద్, జన సాహితీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. అరుణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సభలో ఏఐపీఎల్‌సీఎఫ్ జాతీయ కమిటీ ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా కే. రవిబాబు(ఆంధ్రప్రదేశ్), అధ్యక్షుడుగా గౌతమ్ ముఖర్జీ(పశ్చిమబెంగాల్), ఉపాధ్యక్షుడుగా దివికుమార్(ఏపీ), కోశాధికారిగా రమణప్రసాద్(తెలంగాణ), సభ్యులుగా భట్టు లక్ష్మీనారాయణ, భూపాల్(తెలంగాణ). సియా సరణ్‌శర్మ, సుజయ్‌రాయ్, ప్రజాపతి(జార్ఖండ్), బసుదేవ్‌దాస్, భవాని(ఒరిస్సా) పత్రలేఖ, అజ్మాన్లల్ అన్సారి(బీహార్), షిండే(మహారాష్ట్ర), సుగధన్ పాల్(కేరళ), అరుణ(ఏపి)ను ఎన్నుకున్నారు.

'తొక్కిసలాట'పై కొనసాగిన న్యాయవిచారణ

- రెండో రోజు టీటీడీ ఈవో, పలువురు అధికారుల హాజరు
- నేడు కలెక్టర్, రెవెన్యూ అధికారులు


కమిషన్ ముందు విచారణకు హాజరయ్యేందుకు వస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుపతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం నియమించిన న్యాయ విచారణ కమిషన్ రెండోరోజైన ఆదివారం కూడా విచారణ కొనసాగించింది. టీటీడీ, రుయా, స్విమ్స్, పోలీసు అధికారులను కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి వేర్వేరుగా విచారించా రు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, టీటీడీ ఈవో శ్యామలరావు, రుయా, స్విమ్స్ ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు సమన్లు జారీ చేశారు. ఆదివారం విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. ఉదయం టీటీడీ ఈవో శ్యామలరావు, టీటీడీ లా ఆఫీసర్ వరప్రసాద్, దేవస్థానానికి చెందిన మరో నలుగురు విభాగ అధికారులతో కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా టోకెన్ల జారీ కేంద్రాల వద్ద ఏర్పాట్లకు సంబంధించి ముందస్తుగా నిర్వహించిన సమావేశం మినిట్స్ గురించి, ఏయే శాఖలు, విభాగాల అధికారులతో సమన్వయ సమావేశాలు పెట్టారన్న అం శాలపై ఈవోను జస్టిస్ సత్యనారాయణ మూర్తి ప్రశ్నించారు. టోకెన్ల కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బందికి విధుల కేటాయింపునకు సంబంధించిన వివరాలపై ఆరాతీశారు. బైరాగిపట్టెడ కేంద్రం వద్ద ఏం జరిగింది? పోలీసుశాఖతో సమన్వయం చేసుకున్నారా? వంటి ప్రశ్నలు వేశారు. వాటికి సంబంధించిన రికార్డులను కమిషన్ పరిశీలన నిమిత్తం టీటీడీ అధికారు లు అందజేశారు. సుమారు 2గంట ల పాటు కమిషన్ టీటీడీ అధికారులను విచారించింది. అనంతరం రు యాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, ఫోరెన్సిక్ విభాగం హెడ్ డాక్టర్ శశికాంత్, ఫోరెన్సిక్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రావతి, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కీర్తి, నర్సింగ్ అధికారులను కమిషన్ విచారించింది. రుయాస్పత్రి నుంచీ మెరుగైన చికిత్స కోసం స్విమ్స్ ఆస్పత్రికి ఎంతమందిని తరలించారు? రుయాస్పత్రిలో మృతులు ఎందరు? వారికి నిర్వహించిన పోస్టుమార్టం నివేదికల ప్రతులు అందజేయాలని ఆదేశించారు. అనంతరం స్విమ్స్ వైద్య సంస్థ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ కమిషన్ ఎదుట హాజరు కాగా ఆయన్ను కూడా ప్రశ్నించింది. చివరగా జిల్లా లా అండ్ ఆర్డర్ అదనపు ఎస్పీ రవిమనోహరాచారి విచారణకు హాజరయ్యారు. టోకెన్ల జారీ కేంద్రం వద్ద బందోబస్తు, క్యూలైన్ల ఏర్పా ట్లు, బ్యారికేడ్ల వంటి అంశాలపై ప్రశ్నించి సమాధానా లు రికార్డు చేశారు. టోకెన్ల జారీ కేంద్రం రామానాయుడు స్కూలు ఆవరణలో ఉండగా భక్తులను పద్మావతి పార్కులోకి ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. కాగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, రెవెన్యూ అధికారులు సోమవారం విచారణకు హాజరయ్యే అవకాశముంది.

ఇకపై ప్రతినెలా చివరి మంగళవారం టీటీడీ బోర్డు సమావేశం

శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనులపై చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు టీటీడీ ధర్మకర్తల మండలి ఇకపై ప్రతినెలా చివరి మంగళవారం సమావేశం కానుంది. సాధారణంగా అభివృద్ధి, సౌకర్యాల కల్పన, ఉత్సవాలకు చేపట్టాల్సిన ఏర్పాట్లు వంటి వాటిపై అవసరాన్ని బట్టి బోర్డు సమావేశాలు జరుగుతుంటాయి. అయితే సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు టీటీడీలోని అన్ని విభాగాలు సమర్థంగా పనిచేయడంతో పాటు భక్తులకు చిన్నపాటి ఇబ్బంది కూడా లేకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలు, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం కోసం ప్రతినెలా బోర్డు సమావేశాన్ని నిర్వహించి తీర్మానాలు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఇకపై ప్రతినెలా చివరి మంగళవారం బోర్డు సమావేశాలను నిర్వహించేందుకు ఛైర్మన్ బీఆర్ నాయుడు సిద్ధమయ్యారు. దీనికి తగ్గట్టుగా ప్రతినెలా అజెండాను సిద్ధం చేసి బోర్డు ముందు ఉంచాలని అధికారులను ఛైర్మన్ ఆదేశించారు.




ఆటోలో మహా కుంభమేళాకు..!

- అటునుంచి వారాణసీకి ప్రయాణం
- బంగారుపాళ్యం యువకుల సాహసం
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

చిత్తూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాలో పవిత్ర స్నానాలు చేయడానికి చిత్తూరు జిల్లాకు చెందిన నలుగురు యువకులు ఆటోను ఆశ్రయించారు. బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచి గ్రామానికి చెందిన వీరు జనవరి 27న కాణిపాకంలో దర్శనం చేసుకుని సీఎన్‌జీ ఆటోలో ప్రయాణం ప్రారంభించారు. తిరుపతి, కడప, కర్నూలు, నాగ్‌పూర్, జబల్పూర్, రేవా మీదుగా ప్రయాగ్‌రాజ్ కుంభమేళా ప్రాంగణానికి 29న ఉదయం చేరుకున్నారు. అక్కడినుంచి 30న వారాణాసి కూడా వెళ్లారు. అనంతరం ఫిబ్రవరి 1న తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం రాత్రికి వీరు చిత్తూరుకు చేరుకునే అవకాశం ఉంది. సీఎన్‌జీ ఆటో కావడంతో 40 కిలోమీటర్ల మైలేజ్ ఇచ్చిందని, రూ.20 వేలల్లో యాత్రను ముగించుకున్నామని, ఎక్కడా గదులు తీసుకోలేదని ఆ యువకులు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆటోలో వెనుక సీటును తొలగించి పరుపును ఏర్పాటు చేసుకుని, ముగ్గురు పడుకోవడం, ఒకరు డ్రైవింగ్ చేయడంతో ప్రయాణం సాఫీగా సాగిందని తెలిపారు. వీరిలో సాయి స్వర్ణకుమార్ చిత్తూరు టిడ్కోలో కాంట్రాక్టు ఏఈగా పనిచేస్తుండగా.. నాగరాజు ఆటో ఓనర్, మనోజ్, రెడ్డిప్రసాద్ డిగ్రీ విద్యార్థులు. వీరి ప్రయాణం వీడియో సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయడంతో 12 లక్షల మందికి పైగా వీక్షించారు.

ప్రాణాలు తీసిన ఓవర్ టేకింగ్..!

- చిత్తూరు జిల్లాలో బస్సు, లారీ ఢీ
- నలుగురు మృతి.. 10 మందికి గాయాలు

నగరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా నగరి సమీపంలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో నలుగురు దుర్మరణం చెందారు. మృతుల్లో ఇద్దరు తిరుపతి జిల్లాకు చెందిన వారు కాగా.. మరో ఇద్దరు తమిళనాడు వాసులు. ప్రమాదంలో మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడులోని అరక్కోణం నుంచి తిరుపతికి ఓ ప్రైవేటు బస్సు బయలుదేరింది. నగరి సమీపానికి వచ్చేసరికి ముందు వెళ్తున్న వాహనాన్ని బస్సు ఓవర్ టేక్ చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో బస్సు ఒక వైపు వెనుక సగభాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో తిరుపతి జిల్లా వడమాలపేట మండలం సీతారామాపురం గ్రామానికి చెందిన పార్థసారథి నాయుడు (60) రాజేంద్రనాయుడు(54), తమిళనాడులోని తిరుత్తణికి చెందిన కుమార్(60), తిరువళ్లూరుకు చెందిన ధనుష్కోటి(12) మృతిచెందారు. క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు వెనుక భాగం

గంటా కమలమ్మ పురస్కారం

గంటా కమలమ్మ సాహితీ పురస్కార ప్రదాన సభ ఫిబ్రవరి 8 ఉ.10గంటలకు, చిత్తూరు లోని, విజయం డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో జరుగుతుంది. 'నాలుగు రెక్కల పిట్ట' కవితా సంపుటానికి గాను సాంబమూర్తి లండ, 'చింతల తొవ్వ' కవితా సంపుటికి గాను తుల శ్రీనివాస్ పదివేల రూపాయల నగదు, జ్ఞాపికతో పురస్కారాన్ని స్వీకరిస్తారు.

గంటామోహన్

కథా గౌరవ సభ

మధునాపంతుల వేంకటేశ్వర్లు (మధుశ్రీ) కథా గౌరవ సభ ఫిబ్రవరి 9ఉ.10గంటలకు కాకినాడ జిల్లా కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామంలో జరుగుతుంది. నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, వాడ్రేవు వీరలక్ష్మీ దేవి, కాళ్ళకూరి శైలజ కథా గౌరవ పురస్కారాలను స్వీకరిస్తారు. అధ్యక్షత మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, పురస్కార స్వీకర్తల పరిచయం- టీకేఎస్ రాజా, వసుధా రాణి, కె. రామచంద్రారెడ్డి. వివరాలకు 9704186544.

మధునాపంతుల కిరణ్

బౌద్ధ కథలు కావాలి

తెలుగులో బౌద్ధం నేపథ్యంగా వచ్చిన కథలను 'మహాబోధి' పేరుతో సంకలనంగా తెస్తున్నాము. మీరు రాసిన, లేక మీకు తెలిసి పత్రికలలో ప్రచురితమైన బౌద్ధ కథలను, లేదా వాటి వివరాలను పరిశీలన కోసం పంపవలసిందిగా మనవి. జాతక కథలు కాకుండా, బుద్ధుడు చెప్పిన కథలు కాకుండా- చారిత్రక నేపథ్యం లేదా ఆధునిక జీవితంలో బౌద్ధాన్ని అన్వయించి రాసిన కథలు మాత్రమే కావాలి. వీటిని ఫిబ్రవరి 10లోపు ఈమెయిల్: mahabodhi2025@gmail.com కు పంపాలి.

బోధి ఫౌండేషన్

కథా సంపుటాలకు ఆహ్వానం

తపన సాహిత్య వేదిక మొదలై 34ఏళ్లు కావస్తున్న సందర్భంగా ప్రతి ఏటా ఉత్తమ కథల సంపుటాలకు రు.10వేల బహుమతితో 'సడ్లపల్లె కథా పురస్కారం' ఇవ్వాలని నిర్ణయించారు. జనవరి 2023 నుంచి డిశంబర్ 2024 మధ్యలో ప్రచురితమైన కథా సంపుటాలు నాలుగు ప్రతులను మార్చి 31 లోపు చిరునామా: సడ్లపల్లె చిదంబరరెడ్డి, 21.6.139, టీచర్స్ కాలనీ, హిందూపురం – 515 211, ఫోన్: 94400 73636 కు పంపాలి.

తపన సాహిత్య వేదిక

వస్తువు, శిల్పం, దృక్పథం అవిభాజ్యం!

మానవ జీవితంలో సాహిత్యం నిర్వహించే పాత్రకు **అల్లం రాజయ్య** కథలు, నవలలు అత్యుత్తమ ఉదాహరణ. సృజనాత్మకమైన ప్రజా ఆచరణ నుంచి ఆయన సాహిత్యం రూపుదాల్చి తిరిగి ప్రజా ఆచరణను ప్రభావితం చేస్తుంది. జీవితంలో రద్దయిపోతున్న దాన్ని, నిర్మాణమవుతున్న దాన్ని ఎత్తి చూపడమే ఆయన సాహిత్య శిల్పం. తన రచనలతో తెలుగు సాహిత్యంలో వర్గ సంఘర్షణను బహుముఖాలుగా ఆయన ప్రవేశ పెట్టారు. చరిత్రతో ప్రజలు చేసే సంభాషణే సాహిత్య శిల్పమని ఆయన కథలు, నవలలు నిరూపిస్తాయి. ఇది 'నవలా శిల్పం' శీర్షకన ఆయనతో జరిపిన సంభాషణ.

పాత వ్యవస్థను అధిగమిస్తూ కొత్తను సృజనాత్మకంగా నిర్మించడమే మీ నవలా ఇతివృత్తం కదా. దానికి తగినట్లు మీరు ప్రత్యేకంగా శిల్పాన్ని ఎన్నుకుంటారా?

ఏ వ్యవస్థ అయినా దాని ఉత్పత్తి సంబంధాల వల్ల ఉనికిలో ఉంటుంది. అది ఏ రంగంలోనైనా మౌలిక మార్పులు రాకుండా నిరోధిస్తూ ఉంటుంది. వర్గపోరాటం దాన్ని ఎదుర్కొంటుంది. కొత్త వ్యవస్థను నిర్మిస్తుంది. ఈ లక్ష్యంతో కరడుగట్టిన భూస్వామ్య సమాజంలో మార్పులు తీసుకురావడానికి 1967లో నక్సల్బరీ పోరాటం ఆరంభమైంది. 1977–78 నాటికి ఆదిలాబాద్, కరీంనగర్ రైతాంగ పోరాటాలు రూపుదిద్దుకున్నాయి. వీటి వల్ల పాత ఉత్పత్తి సంబంధాల్లో కదలిక మొదలైంది. ఇక్కడి నుంచి కొత్త సాహిత్య వస్తువు వచ్చింది. సామాజిక సంఘర్షణ లోంచి వచ్చిన ఈ కొత్త కథా, నవలా వస్తువుకు తగిన శిల్పం అవసరమైంది. ప్రజలు అత్యంత సృజనాత్మకంగా వర్గపోరాటంలో పాల్గొంటున్నారు. నేను ఉన్న స్థల కాలాల్లో నా తరం ప్రజలందరిలాగే నేనూ అందులో భాగమయ్యాను. ఆ పోరాటాల్లో పాలుపంచుకుంటున్న ప్రజలందరికీ కొత్త సాహిత్యం అవసరమైంది. దాని కోసం భాషలో, వ్యక్తీకరణలో, కథన పద్ధతిలో వర్గ పోరాటం అందించిన సృజనాత్మకతను నా నవలా శిల్పంలోకి తీసుకొచ్చాను. చలనంలో ఉన్న, దృగ్గోచరం కాని సామాజిక వాస్తవికతను అర్థం చేసుకోడానికి తగిన శిల్పం అది. సోషలిస్టు వాస్తవికతా వాద సాహిత్యానికి అవసరమైన నవలా శిల్పాన్ని విప్లవోద్యమంలోంచి స్వీకరించాను. సృజనాత్మక వర్గపోరాటంలో భాగమైన ప్రజల భావోద్వేగాలను, ఆచరణను రాయడానికి పాత సంప్రదాయక నవలా శిల్పం సరిపోదు. ఉదాహరణకి- రైతుకూలీల సృజనాత్మక నిర్మాణ వ్యక్త రూపం, శిల్పం



రైతుకూలీ సంఘం. దాని భాష, అవగాహన మౌలికంగా నిరంతరం మారుతూ కొత్తగా అభివృద్ధి చెందుతున్నది. నా నవలల ఇతివృత్తమేగాక, శిల్పం కూడా ఆ కొత్తకు సంబంధించింది. 'సృజన' సాహితీ మిత్రుల వల్ల నా మొదటి నవల 'కొలిమంటుకున్నది' గూగీ చెప్పిన 'వొరేచర్' పద్ధతిలో తయారైంది.

వస్తువుకు స్థలకాలాలు ఉన్నట్లే శిల్పానికీ ఉంటాయా?

తప్పక ఉంటాయి. పాత ధ్వంసమైపోయి కొత్త సమాజం నిర్మాణమవుతున్నప్పుడు వస్తువులో ఇది కనిపించినంతగా శిల్పంలో వెంటనే కనిపించదు. సమాజం పరిమాణాత్మక దశ నుంచి గుణాత్మకంగా మారేటప్పుడు శిల్పంలో కూడా మార్పులు వస్తాయి. ఆ రకంగా శిల్పం స్థలకాలబద్ధంగా ఉంటుంది. వర్గపోరాటం మందకొడిగా ఉన్న సమాజాల్లో నవలా శిల్పంలో పెద్దగా మార్పు కనిపించదు. యూరప్ నుంచి వస్తున్న నవలల్లో ఇది చూడవచ్చు.

గత యాభైఏళ్ల విప్లవోద్యమ పోరాట రూపాలకు తగినట్లు మీ నవలా శిల్పాన్ని ఎట్లా మార్చుకుంటూ వస్తున్నారు?

> అన్ని రకాల సంప్రదాయాలను వెనక్కి నెట్టేసిన విప్లవోద్యమం ఇతివృత్తాన్ని, దృక్పథాన్ని, శిల్పాన్ని వేర్వేరుగా ఎంచుకోవడం ఉండదు. కొత్తగా నిర్మాణమవుతున్న ప్రజా జీవితంలో ఇవి కలిసే ఉంటాయి. కాబట్టి నా నవలల్లోకి అవి కలిసే వచ్చాయి.

మధ్యయుగాలనాటి కాన్సంట్రేషన్ క్యాంపుల్లా ఉండిన భూస్వామ్య కుల వర్గ గ్రామ పునాదిని విప్లవోద్యమం కూలగొడుతున్న కాలంలో అదే మా కాలంలో గొప్ప సృజనాత్మక శిల్పం. ఒక పెనుమార్పుగా అది పాట, కవిత్వం, బ్యాలె, కథ, నవల, ప్రసంగం అన్నిటిలోకి వచ్చింది. అప్పుడు నేను నవలా రచన మొదలుపెట్టాను కాబట్టి అది 'కొలిమంటుకున్నది' నవలా శిల్పాన్ని నిర్ణయించింది. ఆ తర్వాత వర్గపోరాటం ఉధృతమై సామాజిక ఆర్థిక సాంస్కృతిక సంబంధాలు కొత్తగా నిర్మాణమయ్యే క్రమంలో దొరలు సాంఘిక బహిష్కారం అయ్యారు. ఉత్పత్తిదాయకమైన ప్రజలు గ్రామంలో కేంద్ర స్థానానికి వచ్చారు. కల్లోలిత ప్రాంత చట్టం వచ్చి గ్రామాల్లో రాజ్య నిర్బంధం పెరిగింది. తీవ్రమైన భావజాల సాంస్కృతిక సంఘర్షణ గ్రామాల స్వరూప స్వభావాన్ని మార్చేశాయి. అన్ని వైపుల నుంచి దాడులను అనేక పోరాట రూపాలతో ప్రజలు ఎదుర్కొని కొత్త సంబంధాలను కాపాడుకున్నారు. ప్రజలు గడించిన ఈ క్షేత్ర అనుభవం 1982లో రాసిన 'ఊరు' నవలలోని శిల్పాన్ని మార్చింది. అట్లాగే 1979 నుంచి విప్లవోద్యమం గెరిల్లా స్థావరాల నిర్మాణాన్ని చేపట్టింది. రైతాంగ ఉద్యమంలో తర్ఫీదైన మహిళలు ఈ ఉన్నత దశలో భాగమయ్యారు. దీని వల్ల పితృస్వామ్య వ్యతిరేక చైతన్యం పెరిగింది. స్త్రీలను విప్లవంలో పూర్తిస్థాయిలో భాగం చేయడం ఎలా? అనే కొత్త చర్చ వెనుక ఉన్న భావజాల, సాంస్కృతిక ఆచరణ అంతా 'అగ్నికణం' నవలా వస్తువునేగాక శిల్పాన్ని కూడా నిర్ణయించింది. ఆటవీ ప్రాంత ఉద్యమం విస్తరించే క్రమంలో ఇంద్రవెల్లి మారణకాండ జరిగింది. ఈ ప్రపంచాన్ని మార్చే పోరాటంలో భాగమైన ఆదివాసులు తమ గత పోరాట వారసత్వాన్ని ముందుకు తీసుకొచ్చారు. సమాజాన్ని ముందుకు తీసికెళ్లే వర్గపోరాటం నిరంతరం చరిత్రలోని గతంతో సంభాషించి వర్తమానాన్ని నిర్మిస్తుంది. ఈ అవగాహనతో 'కుమురం బీం' (1983) నవల సాహుతో కలిసి రాశాను. విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకపోవడంలో పాత నాయకత్వం వెనుకబడితే రైతాంగ, కార్మిక పోరాటాల నుంచి ఎదిగిన కొత్త నాయకత్వం ముందుకు పోవాలనుకుంది. ఈ ఘర్షణ రాజకీయ, సైనిక రంగాల్లో జరిగి ఉద్యమాన్ని కొత్త దశకు తీసికెళ్లింది. ఇదంతా 'వసంతగీతం' (1987) నవలలో కనిపిస్తుంది. 2017లో రాసిన 'టైగర్ జోన్' నవల వస్తు శిల్పాలు ఆదివాసీ ఉద్యమానికి సంబంధించినవైతే, 2021 రాసిన 'సైరన్' కార్మిక ఉద్యమ శిల్పంలో ఉంటుంది.

తెలుగులో సంప్రదాయ నవల శిల్పాన్ని అధిగమించడానికి శిల్పం మీదే కేంద్రీకరించారా? లేక వస్తువు, దృక్పథాల వైపు నుంచి కూడా సాధన చేశారా?

వస్తువు, శిల్పం, దృక్పథం అవిభాజ్యమైనవి. సంప్రదాయక వస్తువు నుంచి, దృక్పథం నుంచి విప్లవోద్యమం తెలుగు సాహిత్యాన్ని బయటపడేసింది. వైయక్తిక అనుభవానికన్నా విప్లవంలోని క్షేత్రస్థాయి అనుభవం వస్తువు అయినప్పుడు విప్లవకరమైన శిల్పం అవసరం అవుతుంది. వస్తువులా దృగ్గోచరం కాని శిల్పాన్ని శాస్త్రీయ దృక్పథం తోనే అర్థం చేసుకోగలం. అన్ని రకాల సంప్రదాయాలను వెనక్కి నెట్టేసిన విప్లవోద్యమం ఇతివృత్తాన్ని, దృక్పథాన్ని, శిల్పాన్ని వేర్వేరుగా ఎంచుకోవడం ఉండదు. కొత్తగా నిర్మాణమవుతున్న ప్రజా జీవితంలో

నవలా శిల్పం

ఇవి కలిసే ఉంటాయి. కాబట్టి నా నవలల్లోకి అవి కలిసే వచ్చాయి. చలనంలో ఉన్న సమాజాన్ని రాయడానికి అధ్యయనం, ఆచరణ దోహదం చేశాయి. ఇది కూడా సమిష్టిగానే సాగింది. నా నవలా శిల్పాన్ని నా సహ విప్లవ రచయితల సృజనాత్మకత ప్రభావితం చేసింది.

ప్రధానంగా వ్యక్తుల జీవితం కేంద్రంగా ఉండిన తెలుగు నవలను ప్రజల జీవితం కేంద్రంగా మార్చే క్రమాన్ని ఎట్లా సాధించారు?

నక్సల్బరీ వ్యక్తికి-సమష్టికి ఉన్న గతితార్కిక సంబంధాన్ని కొత్తగా నిర్వచించింది. ప్రధాన వైరుధ్యం పరిష్కారం కోసం జరిగే పోరాటంలో ప్రజలు వ్యక్తుల దగ్గరి నుంచి సమిష్టిగా మారే ప్రక్రియ అద్భుతంగా జరిగింది. విరసం సభ్యుడిగా నేను ఈ మార్పును క్షేత్రస్థాయిలో ప్రజా జీవితం నుంచి గ్రహించాను. వ్యక్తి కేంద్రంగా ఉన్న సమాజంలో రావాల్సిన మార్పు కోసం విప్లవోద్యమం కృషి చేస్తోంది. అదే నా నవలల్లో కనిపిస్తుంది.

ఇంటర్వ్యూ

■ పాణి



వందేళ్ళ తెలంగాణ జీవన చిత్రం 'మలగని బత్తి'

'మా భూమి' చిత్రానికి 1979లో ప్రతిష్ఠాత్మకమైన నంది అవార్డును పొందిన ఎస్.ఎమ్. ప్రాణ్‌రావ్ ఆ తరువాత నవలా రచననే ప్రధాన ప్రక్రియగా స్థిరపరుచుకుని ఇప్పటికి 20 నవలలు రాసారు. వీటిలో 'రుద్రమదేవి', 'ప్రతాపరుద్రుడు', 'మహామంత్రి మాదన్న', 'ప్రజాజ్యోతి పాపన్న', 'రాణి శంకరమ్మ', 'కొమరంభీం' లాంటి చారిత్రక నవలలు ఉన్నాయి. 'నీలిపాప' పర్యావరణం మీద తొలి తెలుగు నవల. అలాగే, ట్రాన్స్‌జెండర్ కథానాయకుడుగా వచ్చిన మొదటి నవల 'పురి విప్పిన నెమలి'.

అమరుడౌతాడు. ఆనాటి బడుగుల నిస్సహాయ బ్రతుకులలోని ఎడతెగని కడగండ్లను హృదయం కదిలించేలా చిత్రీకరించాడు రచయిత.

నవలా త్రయంలో రెండవ నవల 'నేల జారని ఊడలు'. ఇందులో రంగు మారిన దొరతనం కనిపిస్తుంది. దొరలు గాంధీ టోపీల్లోకి మారి పట్నాలకు పోయి వ్యాపారం, పల్లెల్లో రాజకీయం చేస్తుంటారు. ఈ మార్పు తప్ప పేదవారి జీవితంలో ఏ మార్పూ రాదు. ఈ నవలలో ప్రధాన పాత్ర రాజన్న కొడుకు దుర్గయ్య. తల్లి తండ్రి లేని దుర్గయ్యను కూలి నాలి



> తెలంగాణ జీవితానికి అక్షర సాక్ష్యంగా కలకాలం నిలిచే ప్రయోజనాత్మక నవల ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు నవలా త్రయం 'మలగని బత్తి'. ఈ ట్రిలజీలో మొదటి నవల దొరల, రజాకార్ల దుర్మార్గం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం; రెండవ నవల తొలిదశ తెలంగాణ ఉద్యమం, నక్సలైటు ఉద్యమం, ఎమర్జెన్సీ; మూడవ నవల మలిదశ తెలంగాణ ఉద్యమం, బలిదానాలు, తెలంగాణ ఆవిర్భావం అనంతర పరిస్థితులు హృదయాలను ఆకట్టుకునేలా ఎంతో ఆర్ద్రత నిండిన దృశ్యాలతో ఎక్కడా ఆగకుండా చదివిస్తాయి.

ఇటీవల ప్రాణ్‌రావు వెలువరించిన ట్రిలజీ (Trilogy) 'మలగని బత్తి' కూడా తెలంగాణ ఉద్యమ నేపథ్యానికి సంబంధించిన చారిత్రక నవలే. 'మలగని బత్తి', 'నేల జారని ఊడలు', 'పంచువాటు' అనే మూడు నవలల సమాహారం ఈ నవలాత్రయం. మూడు నాలుగు తరాలకు విస్తరించి వస్తు ఐక్యత సాధించిన ఈ నవలలోని కథాంశం వందేళ్ళ తెలంగాణ జీవన చిత్రం. తెలంగాణ భాషకు ప్రాణప్రదమైన యాసను, నుడికారాన్ని, పలుకుబడిని అద్భుతంగా ప్రతిధ్వనిస్తుంది.

తెలుగులో మహీధర రాంమోహనరావు 'కొల్లాయి గట్టితేనేమి', 'దేశం కోసం', 'జ్వాలాతోరణం' అనే నవలలు ట్రిలజీ కోవలోకి వస్తాయి. దాశరథి రంగాచార్య, అంపశయ్య నవీన్‌లు రాసిన నవలల్లోనూ ట్రిలజీలు ఉన్నాయి. కానీ ఇవన్నీ ఒకే పుస్తకంగా రాలేదు.

ప్రాణ్‌రావు నవలా త్రయంలో మొదటి నవల 'మలగని బత్తి'. కథ మొత్తం దొర నరహరి రావు ఏలుబడిలో ఉన్న ప్రధాన గ్రామం తిమ్మాపురంలో జరుగుతుంది. నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య వ్యవస్థలో దొరల క్రూరత్వం, రజాకార్ల దౌర్జన్యం, సంగం ఏర్పాటు, దళాల నిర్మాణం, దొరలపై తిరుగుబాటు ఈ నవలలోని ప్రధానాంశాలు. 'మలగని బత్తి' కథానాయకుడు రాజన్న. ఇతని తండ్రి సీనయ్య, తాత పోశయ్య దొరల అణచివేతకు గురై బానిస బ్రతుకులు బ్రతికారు. దొర దాష్టీకం వల్ల రాజన్న చదువుకి స్వస్తి చెప్పి దొర దగ్గర వెట్టి చాకిరి చెయ్యవలసి వస్తుంది. పశువులు కాసే రాజన్నకి అడవిలో కామ్రేడ్ జానకి రామయ్య కలుస్తాడు. సంగం గురించి దళ నిర్మాణం గురించి అవగాహన కల్గిస్తాడు. ఆ స్ఫూర్తితో కామ్రేడ్ లింగం దగ్గర శిక్షణ పొందిన రాజన్న, దళం ఏర్పాటు చేసి దొర గడీని ముట్టడిస్తాడు. ముట్టడి పతాక సన్నివేశంలో ఎదురుబొదురు కాల్పులు జరుపుకుంటారు. ఆ కాల్పుల్లో దొర నరహరిరావు రాజన్న చేతిలో మరణిస్తాడు; రాజన్న కూడా

చేస్తూ పెంచుతుంది అతని నాయనమ్మ చంద్రమ్మ. దుర్గయ్య ఏడవ తరగతిలో ఉండగా చంద్రమ్మ ఆరోగ్యం పాడవటం వలన దుర్గయ్య చదువు మాని పిచ్చయ్య బట్టల కొట్టులో పనికి కుదురుతాడు. తను చెయ్యని దొంగతనం ఎదుర్కొనే సందర్భంలో, గ్రామ పెద్దలను ధిక్కరించి పట్నం పారిపోతాడు. అక్కడ ఒక హోటల్‌లో పని దొరుకుతుంది. 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొంటాడు. ఒక ఊరేగింపులో అరెస్టు అయి చంచల్‌గూడ జైలుకు వెడతాడు. జైలులో దుర్గాప్రసాద్ అనే మార్క్సిస్టు మేధావితో పరిచయం కలుగుతుంది. ఆ సహచర్యం వల్ల వర్గ రహిత సమాజం పట్ల శాస్త్రీయ దృక్పథం అలవడుతుంది. నక్సలైట్లలో కలిసిపోతాడు. భార్య ప్రమీలని, కూతురు గాయత్రిని వదిలేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోతాడు. ఎమర్జెన్సీ కాలంలో అడవిలో పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కనిపించకుండా పోతాడు. ఈ నవలా త్రయంలో- రాజన్న అతని కొడుకు దుర్గయ్యలు ప్రజల మనుషులు. అన్యాయాన్ని ఎదిరించి ప్రాణత్యాగం చేస్తాడు రాజన్న. నమ్మిన సిద్ధాంత కోసం ప్రాణాల్ని పణంగా పెట్టాడు దుర్గయ్య.



నవలా త్రయంలోని మూడవ నవల 'పంచువాటు'. దుర్గయ్య అజ్ఞాతంలోకి పోవడంతో ఏ దిక్కూ లేని ప్రమీల కూతురు గాయత్రిని పోషించడానికి భవన నిర్మాణ కూలిగా మారుతుంది. అక్కడే తోటి కూలీగావున్న అనాథ బాలుడు రవి ఆమెకి చేరువవుతాడు. మేస్త్రీ ఆగడాలు తట్టుకోలేక ప్రమీల తన భర్త గ్రామం తిమ్మాపురం వెడుతుంది. అక్కడే గాయత్రిని రవికి ఇచ్చి వివాహం చేస్తుంది. వారసత్వంగా దక్కిన రెండెకరాలలో వ్యవసాయం చేసుకుంటూ జీవితం వెళ్ళదీస్తుంది. ఎమర్జెన్సీ ఆగడాలు తట్టుకోలేక కూతురు అల్లుడుతో పట్నం వస్తుంది. మళ్ళీ కూలి బ్రతుకే ఆధారమవుతుంది. ఊరిలో ఆమెకున్న రెండెకరాల పొలం గ్రామ పెద్ద బాలపీరు కబ్జా చేసుకుంటాడు. హైదరాబాద్‌లో జరిగిన మత కల్లోలాల్లో కత్తిపోట్లకు గురైన ప్రమీల ఉస్మానియా మార్చురీలో శవంగా మిగులుతుంది. పెద్ద దిక్కులేని రవి, గాయత్రి నానా అగచాట్లు పడుతూ ముగ్గురు పిల్లలను చదివిస్తారు. తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఉబుకుతుంది. రవి పెద్ద కొడుకు రాజు ఒంటి మీద పెట్రోలు పోసుకొని తెలంగాణ సాధన కోసం ఆత్మాహుతి చేసుకుంటాడు. తెలంగాణ కల సాకారమవుతుంది. రవి రెండవ కొడుకు కిరణ్ ఎం.ఏ. పాసయి ఐదేళ్ళయినా ఉద్యోగం రాదు. పొట్ట చేతబట్టుకుని బొంబాయి వలసపోతాడు. తెలంగాణ రావడం వల్ల ఊళ్ళో కబ్జాకి గురైన తమ భూమి తమకు వస్తుందనే ఆశతో ఊరికి వెడతారు రవి, గాయత్రిలు. 40 లక్షలు విలువ చేసే ఆ భూమిని తను ఆరు లక్షల కమీషన్ తీసుకుని, కంటి తుడుపుగా రెండు లక్షలు రవి చేతిలో పెట్టి ఆ భూమి సెటిల్‌మెంట్ చేస్తాడు దళారి శంకరయ్య. ఆ డబ్బుతో పిల్లల పెళ్ళిళ్లు చేస్తారు. కన్న పిలల్లు దూరమై వృద్ధాప్యంలో ఒంటరిగా మిగిలిపోయిన రవి, గాయత్రిలు హైదరాబాద్‌లో కురిసిన కుంభవృష్టిలో చెరువు శిఖంలో వేసుకున్న తమ గుడిసె కొట్టుకుపోగా రెక్కలు విరిగిన పక్షుల్లా మిగిలిపోతారు.

ఈ నవలా త్రయం నాలుగు తరాల గాథ. సీనయ్య, రాజన్న, దుర్గయ్య, రాజు ఆ తరాల ప్రతినిధులు. సీనయ్య పాత తరానికి ప్రతినిధి అయితే తక్కిన వారు కొత్త తరానికి ప్రతినిధులు. వీరిలో రాజన్న, దుర్గయ్యలు పోరాట బాట పట్టారు. రాజు తెలంగాణ కోసం ఆత్మార్పణ చేసుకుంటాడు. ఈ ట్రిలజీ ఒక శతాబ్దం పైన విస్తరించి 1908 నుండి 2018 వరకు సాగుతుంది. మొదటి నవల దొరల, రజాకార్ల దుర్మార్గం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం; రెండవ నవల తొలిదశ తెలంగాణ ఉద్యమం, నక్సలైటు ఉద్యమం, ఎమర్జెన్సీ; మూడవ నవల మలిదశ తెలంగాణ ఉద్యమం, బలిదానాలు, తెలంగాణ ఆవిర్భావం అనంతర పరిస్థితులు హృదయాలను ఆకట్టుకునేలా ఎంతో ఆర్ద్రత నిండిన దృశ్యాలతో ఎక్కడా ఆగకుండా చదివిస్తాయి. ఒక విధంగా మలగని బత్తి తెలంగాణ సాంఘిక చరిత్ర (1908–2018)గా భావించవచ్చు.

తెలంగాణ జీవితానికి అక్షర సాక్ష్యంగా కలకాలం నిలిచే ప్రయోజనాత్మక నవల ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు నవలా త్రయం 'మలగని బత్తి'. నవల ముగింపులో "అంకుల్, మీ లాంటి లక్షలాది కుటుంబాలు స్వేచ్ఛగా, హుందాగా, భవిష్యత్తు మీద భరోసాతో, నిర్భయంగా బతకగలిగినప్పుడే మేం చేసిన ఉద్యమం ఫలిస్తుంది. రాజు లాంటి అమరవీరుల త్యాగాలకి ప్రయోజనం సిద్ధిస్తుంది. అంతదాకా మా పోరాటం ఆగదు. మా పోరాటం నిరంతరం సాగుతుంది అది మలగని బత్తి" అన్న రాజు స్నేహితుడు శ్రీధర్ మాటలు యువతకు స్ఫూర్తిని, రాజకీయ నాయకులకు హెచ్చరికను సందేశంగా ఇస్తాయి.

■ చింతపట్ల సుదర్శన్

✆ 92998 09212


నా మొదటి పుస్తకం

అమ్మ ఫొటో వేయడం సినారెకు నచ్చింది

యాకూబ్

1983 నుంచి రాసిన కవితలు కొన్ని తీసేసి, కొన్ని ఉంచి ఎంపిక చేసుకున్న నలభై మూడు కవితల సంపుటి 'ప్రవహించే జ్ఞాపకం' 1992 ఏప్రిల్ నెలలో అచ్చయింది. ఎనభై రెండు పేజీలు. వెల పది రూపాయలు. వెయ్యి కాపీలు అచ్చు వేశాను. కాళ్ళ గారు ముఖచిత్రం వేశారు. తెలుపు బ్యాక్ గ్రౌండ్ మీద ముళ్ళ చివరన గులాబీలోంచి మొదలై కన్నులోంచి ప్రవహిస్తూపోయే ప్రవాహంలా సింబాలిక్‌గా ఉంటుంది ఆ బొమ్మ. కాళ్ళ వేసిన బొమ్మ కదా, అదొక అపురూపం. కవర్ పేజీ స్క్రీన్ ప్రింటింగ్ ఆయనే చేసిచ్చాడు.

ఆ రోజుల్లో త్రిపుర కథల గురించి ఎం.ఫిల్ పరిశోధనచేస్తూ మా వెంట ఉండే ఖమ్మం మిత్రుడు రమణమూర్తి 'రెండు చందమామలు' పేరిట ముందుమాట లాంటి వెనుకమాట రాసాడు. అప్పటికే ఆంధ్రజ్యోతి 'చేరాతలు'లో చేకూరి రామారావు 'ప్రవహించే జ్ఞాపకం' కవితను గురించి రాసి ఉన్నాడు. ఆ కవిత శీర్షిక అందరిలో బాగా పాపులరై ఉంది. అదొక కారణంతో సంపుటికి అదే పేరు ఖాయం చేసాను- అఫ్సర్, ప్రసేన్, సీతారాంలతో సంప్రదించి. యూనివర్సిటీలో గురువు, ఆ తర్వాత నాకు అండదండగా ఉన్న ఎన్. గోపి గారికి తొలి కవితాసంపుటి అంకితం ఇద్దామని నిర్ణయించుకుని, 'తంగెడుపూల విషాద పరిమళాలు తెలిసిన మా సార్ డా.ఎన్. గోపి గారికి' అని అంకిత వాక్యాలు రాసాను. వెనుక అట్టమీద కవి ఫోటో వేయడం అందరూ చేసేవారు. దానికి భిన్నంగా మా అమ్మ ఫోటో వేసి, అమ్మ గురించిన 'అందరి అమ్మల్లాగే మా అమ్మ కూడా నన్ను కన్నది' అనే కవిత అచ్చేసాను. అది ఆవిష్కరణ సభకు వచ్చిన సి.నారాయణరెడ్డి గారికి ఎంతో నచ్చింది. అలా వేయడం గురించి, ఆ కవిత గురించి ప్రత్యేకంగా ప్రశంసించడమే కాదు, అనేక సందర్భాల్లో ఆ కవితను



ప్రస్తావించేవారు. ఆవిష్కరణ సభ మే 14, 1992న జరిగింది. దేవిప్రియ అధ్యక్షతన జరిగిన ఈ సభలో చేరా, కె. శివారెడ్డి, భమిడిపాటి జగన్నాథరావుగార్లు వక్తలు. పుస్తకం విడుదలైన తర్వాత కాకినాడలో చొక్కర తాతారావు, అద్దేపల్లి గారు, రాజమండ్రి గౌతమీ గ్రంథాలయంలో సన్నిధానం గారు, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ గారు ఈ సంపుటి గురించి చర్చలు నిర్వహించారు. శేషేంద్ర, ఇస్మాయిల్ ప్రత్యేకంగా ఉత్తరాలు రాసారు. బోలెడు ఉత్సాహం.

పుస్తకం అచ్చువేయడం విషయంలో ఓ ప్రత్యేకత ఉంది. అప్పట్లో కంప్యూటర్ ప్రింటింగ్ ఇంకా పూర్తి స్థాయిలో హైదరాబాద్‌లో రాలేదు. తొంభై తొమ్మిది శాతం పుస్తకాలు పాత అచ్చుపద్ధతి లోనే గాంధీనగర్ పద్మావతీ, చిక్కడపల్లి బాలాజీ వంటి లెటర్ ప్రెస్సుల్లోనే ప్రింట్ అయ్యేవి. నేనేమో కంప్యూటర్ కంపోజింగ్, వాటిని బ్రోమైడ్‌ల్లోకి తీసుకుని, వాటిని అవసరమైన పద్ధతిలో కత్తెరతో కట్ చేసి, వాటిని ప్లేట్లుగా మార్చి పుస్తకాలు ప్రింట్ చేసే పద్ధతిలో ప్రింటింగ్ చేయించాను. అప్పట్లో అది సరికొత్త పద్ధతి. అబిడ్స్ చిరాగలీలేన్‌లో 'చరిత' సుబ్బయ్య గారు, మరో మిత్రుడితో కలిసి ప్లానోగ్రాఫర్స్ అనే ప్రెస్ నడిపేవాడు. సుబ్బయ్యగారి సాయంతో పుస్తకం అచ్చువేయించాను.

'మనుషులకు లాగానే పుస్తకాలకీ అదృష్టం ఉంటుంది' అంటాడు ఎ. కుప్రీన్ రచన 'రాళ్లవంకీ'కి రాసిన ముందుమాటలో అంద్రెయ్ చెర్నషోవ్. ఈ పుస్తకం విషయంలో అదే జరిగింది. కె.వి. రమణారెడ్డి, వేగుంట మోహన ప్రసాద్, అద్దేపల్లి రామమోహనరావు, ప్రొ. బేతవోలు రామబ్రహ్మం, యం. కె. సుగంబాబు, నారాయణమూర్తి రాజు, తెలకపల్లి రవి, మొక్కపాటి సుమతి, ఎ.ఎ.వి. ప్రసాద్‌లు పత్రికల్లో సమీక్షలు చేశారు. హిందీలోకి ప్రొ. భీంసేన్ నిర్మల్, దండమూడి మహీధర్ గార్లు, ఉర్దూలోకి డా. యూసుఫ్ ఆజ్మీ, ఇంగ్లీష్ లోకి ప్రొ. దామోదరరావు, మోహనప్రసాద్ గారు కొన్ని కవితలను అనువదించి ఆయా భాషల పత్రికల్లో అచ్చేశారు. సంకలనాల్లో చేర్చారు. యలమంచిలి 'ఎస్.వి.టి.దీక్షితులు అవార్డు' నేను అందుకున్న తొలి అవార్డు. ఎన్నో ఉత్తరాలు ఈ సంపుటి సందర్భంగా అందుకున్నాను. కొత్తగా పెళ్లయి, పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్న కాలం. ప్రతిరోజూ పోస్టుమాన్ కనీసం రెండు మూడు మనియార్డర్లు తెచ్చి ఇచ్చేవాడు. నెలాఖరు కష్టాల్లో అవి ఆదుకునేవి. శిలాలోలిత శ్రద్ధగా లిస్టులో పేర్లు రాసి పెట్టుకునేది. అచ్చు అయిన కొన్ని నెలల్లోనే సంపుటి ప్రతులు చెల్లిపోయాయి.




అదనపు కణజాలం

ఆయుధం కావలసిన అక్షరం
ఆముదం రాసుకొని తిరుగుతుంది
పట్టుకుంటే జారిపోతుంది
ముట్టుకుంటే కారిపోతుంది
ఆకుకు అందకుండా
పోకకు పొందకుండా
కాన్పు నొప్పులు తీస్తుంది
కదిలించినా... కదిలించకున్నా...
సాలు ఇరువాలు దున్నుతుంది
పరివ్యాప్తమైన ప్రపంచాన్ని
కన్నెత్తి చూడక
ఇసుకలో మూతి కుచ్చిన
ఉష్ట్ర పక్షి అయింది
ఇవతలి గట్టు నుండి
అవతలి గట్టుకు
అవతలి గట్టు నుండి
ఇవతలి గట్టుకు ఇరాం లేకుండా
ఆసుపోస్తుంది
కాంతి పాదాలు
కదన నాదాలు కావలసిన చోట
కాసుల పేరు కోసమో!
కీర్తి కిరీటం కోసమో!
కంటికి కునుకును కరువు చేసిన
అదనపు కణజాలమై పెరుగుతుంది.

■ కందుకూరి అంజయ్య

✆ 94902 22201

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు
సోమవారం 3 ఫిబ్రవరి 2025



రూ. 2.50 కోట్ల స్థలం హాంఫట్

కూటమి ప్రభుత్వం వచ్చినా వైసీపీ నేతల భూ ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. అజిత్‌సింగ్‌నగర్ సన్‌సిటీ కాలనీలో కోట్ల రూపాయలు విలువ చేసే ఇరిగేషన్ స్థలాన్ని వైసీపీ ఎమ్మెల్సీ అనుచరుడు ఒకరు ఆక్రమించాడు. సర్వే నంబర్లు మార్చి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించాడు. గుట్టుగా కొడుకుల పేర నూజివీడులో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశాడు. ఇప్పుడు కొలతలు వేసి సదరు స్థలంలో నిర్మాణాలకు పూనుకున్నాడు.

సన్‌సిటీ కాలనీలో ఇరిగేషన్ స్థలం వైసీపీ నేత ఆక్రమణ

సర్వే నంబర్ మార్చి కొడుకులకు వీలునామా

- గుట్టుచప్పుడు కాకుండా నూజివీడులో రిజిస్ట్రేషన్
- పొజిషన్‌లోకి వచ్చేందుకు ప్రయత్నాలు
- గత వైసీపీ పాలనలోనే కబ్జా యత్నం
- అప్పట్లో వరుస కథనాలతో అడ్డుకున్న ఆంధ్రజ్యోతి

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అజిత్‌సింగ్‌నగర్ సన్‌సిటీ కాలనీలోని ఇరిగేషన్ స్థలాలు భూ రాబందుల చెరలోకి వెళ్లిపోతున్నాయి. స్థానికంగా ప్రభుత్వ భూములపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కబ్జా దారులకు వరంలా మారింది. గత వైసీపీ పాలనలో ఇదే కాలనీలో ఇరిగేషన్ భూముల కబ్జాకు ప్రయత్నించి విఫలమైన ఓ వైసీపీ నేత మరోసారి కాలనీపై వాలిపోయాడు. ఈ సారి ఏకంగా ఇరిగేషన్ భూమిని తన ఇద్దరు కొడుకులకు గిఫ్ట్ కింద ఇచ్చేసినట్టు రిజిస్ట్రేషన్ చేయించేసి పొజిషన్‌లోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు.

పాత డాక్యుమెంట్లు పుట్టించి..

స్థానిక సన్‌సిటీ కాలనీలోని సర్వే నంబరు 32లో 1.20 ఎకరాలు ఇరిగేషన్ స్థలం ఉంది. అందులో రూ.2.50 కోట్లు విలువ చేసే 550 గజాలు భూమికి నకిలీ పత్రాలు సృష్టించిన వైసీపీ నేత, ఎమ్మెల్సీ అనుచరుడు భూమి తనదంటూ రంగంలోకి దిగిపోయాడు. తన తండ్రి తనకు వీలునామా రాశాడంటూ ఏకంగా ఇరిగేషన్ స్థలానికి పాత డాక్యుమెంట్లు పుట్టించాడు.

గుట్టు చప్పుడు కాకుండా నూజివీడులో రిజిస్ట్రేషన్

నగరంలో సదరు స్థలాలు రిజిస్ట్రేషన్ చేస్తే కబ్జా వ్యవహారం బయట పడుతుందని భయపడ్డ వైసీపీ నేత గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్ విధానం ఉపయోగించుకుని నూజివీడులో రిజిస్ట్రేషన్ చేయించేశాడు. తన ఇద్దరు కుమారులకు ఒక్కొక్కరికి 225 గజాల చప్పున ఇద్దరికి 550 గజాలు రిజిస్ట్రేషన్ చేయించి ఇప్పుడు ఆ భూములు తనవని కలరింగ్ ఇస్తున్నాడు. రెండు రోజుల కిందట కబ్జా స్థలాల్లోకి వెళ్లి కొలతలు కూడా వేయించినట్లు స్థానికులు చెబుతున్నారు. రేపో మాపో నిర్మాణాలు చేపట్టేందుకు కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.



దర్గాగా కబ్జా

అజిత్‌సింగ్‌నగర్‌లో రూ.3 కోట్ల విలువైన ఇరిగేషన్ స్థలం స్వాహాకు యత్నం

గత వైసీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ స్థలాల కబ్జాపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

నాడే కబ్జాకు యత్నం.. అడ్డుకున్న 'ఆంధ్రజ్యోతి'

అయితే ఈ కబ్జాకు ప్రణాళికంతా గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగింది. భూముల కబ్జాలో తిమింగళంగా పేరున్న వైసీపీ నేత అప్పట్లోనే నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి ప్రభుత్వ స్థలంలో ఆక్రమణకు దిగాడు. ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' 2023 జూలై 16, 17, 18వ తేదీల్లో వరుస కథనాలు ప్రచురించింది. దీంతో అధికారులు అక్కడికి చేరుకుని బోర్డులు ఏర్పాటు చేయడంతో వైసీపీ నేత అక్కడి నుంచి పలాయనం చిత్తగించాడు. అనంతరం తిరిగి ఇప్పుడు ఈ స్థలంలోకి వచ్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు.



ఇరిగేషన్ భూముల్లో ప్రస్తుతం పాగా వేసేందుకు వైసీపీ నేత వేయిస్తున్న కొలతలు

రిజిస్ట్రేషన్ చేయించింది ఇలా..

సన్‌సిటీ కాలనీలోని ఇరిగేషన్ భూములను తన కొడుకుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకుని అన్ని రకాల అడ్డదారులను తొక్కాడు. ఇరిగేషన్ స్థలం 32వ సర్వే నంబరులో ఉండగా, ప్రస్తుతం సదరు సర్వేలోని భూములు రిజిస్ట్రేషన్ అవకపోవడంతో అదే స్థలానికి పక్కనే ఉన్న రిజిస్టర్ భూముల్లోని సర్వే నంబరు 31/1ఏ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలుస్తోంది. 31/1ఏ రిజిస్ట్రేషన్‌తో 32వ నంబరు సర్వే భూముల్లో ఉన్న 550 గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

విజయవాడ టు దుబాయ్!

విమాన సర్వీసు నడిపేందుకు ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ ఆసక్తి

- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం
- ఎయిర్‌పోర్టు అధికారులతో భేటీ
- సర్వే తర్వాతే నిర్ణయం ప్రకటించే అవకాశం
- విజయవాడ నుంచి దుబాయ్‌కు ఉన్న ట్రాఫిక్ వనరులపై సమగ్ర పరిశీలన

బెజవాడ కేంద్రంగా విదేశీయానానికి మరో అడుగు ముందుకు పడింది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్‌కు విమాన సర్వీసు నడిపేందుకు వీలుగా అరబ్ ఎమిరేట్స్ సంస్థ విజయవాడ విమానాశ్రయంపై అధ్యయనం చేస్తోంది. ఇటీవలే అరబ్ ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బృందం విజయవాడ వచ్చి విమానాశ్రయం డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డిని సంప్రదించింది. విజయవాడ నుంచి దుబాయ్‌కు ట్రాఫిక్ ఎలా ఉందన్నదానిపై ఎమిరేట్స్ బృందం సొంతగా సర్వే కూడా నిర్వహిస్తోంది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ నుంచి దుబాయ్‌కు విమాన సర్వీసు నడపటానికి ఉన్న అన్ని అవకాశాలపైనా ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ అధ్యయనం చేస్తోంది. విమానాశ్రయంలోని ప్రస్తుత ఇంటీరియం టెర్మినల్ బిల్డింగ్‌ను ఎమిరేట్స్ బృందం పరిశీలించింది. ఈ టెర్మినల్‌ను ప్రస్తుతం దేశీయ విమాన సర్వీసులకు ఉపయోగిస్తున్నారు. అంతర్జాతీయ విమాన సర్వీసులకు పాత టెర్మినల్‌ను ఉపయోగిస్తున్న విషయం తెలుసుకుని దానిని కూడా ఈ బృందం పరిశీలించింది. విమానాశ్రయంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులను గమనించింది. ఈ టెర్మినల్ దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నిర్మిస్తున్నట్టు ఎయిర్‌పోర్టు అధికారులు ఎమిరేట్స్ బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఈ టెర్మినల్ మరో ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఇలాంటి టెర్మినల్స్ నుంచి ఆపరేషన్స్ అనువుగా ఉంటాయని ఎమిరేట్స్ బృందం, విజయవాడ విమానాశ్రయ అధికారులకు చెప్పడం గమనార్హం. విమాన సర్వీసులు నడిపే విషయాన్ని అధికారికంగా ఇంకా ప్రకటించనప్పటికీ, ఆసక్తిని అయితే ఎమిరేట్స్ బృందం అధికారుల దగ్గర వ్యక్తం చేసింది. సర్వే పూర్తయిన తర్వాత మాత్రమే ఎమిరేట్స్ బృందం విజయవాడ - దుబాయి సర్వీసుపై స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

డిమాండ్ ఎలా ఉంటుందని ఆరా

విజయవాడ విమానాశ్రయం నుంచి దుబాయ్‌కు విమాన సర్వీసుకు డిమాండ్ ఎలా ఉంటుందన్న దానిపై ఎమిరేట్స్ బృందం సమగ్రంగా అధ్యయనం చేస్తోంది. విజయవాడ విమానాశ్రయాన్ని రాష్ట్రంలో ఏయే ప్రాంతాల వారు ఉపయోగించుకుంటారన్న అంశాన్ని విమానాశ్రయ అధికారులను అడిగి తెలుసుకుంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా ప్రజలు కూడా విజయవాడ మిగతా 6లో..

దోచుకున్న సొమ్ముతో గోవాలో జల్సాలు

15 ఏళ్లకే చోరీల బాట పట్టిన బత్తుల ప్రభాకర్

- తల్లిదండ్రులకు నివారణలేని రోగం
- అన్నింటిలో 'ఒంటరి'తనం
- ఇంజనీరింగ్ కళాశాలలు, స్కూల్స్, ఆస్పత్రులే టార్గెట్
- పీటీ వారెంట్‌పై తీసుకురానున్న బెజవాడ కాప్స్



బత్తుల ప్రభాకర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఇంజనీరింగ్ కళాశాలలను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్న బత్తుల ప్రభాకర్‌ను సైబరాబాద్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. అతడిని ప్రిజనర్ ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తీసుకురావడానికి ఒక బృందం హైదరాబాద్‌కు వెళ్లింది. ప్రభాకర్‌ను విచారిస్తున్న కొద్దీ కొత్తకొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పేద కుటుంబంలో జన్మించిన ప్రభాకర్ తల్లిదండ్రుల పరిస్థితిని చూసి వారికి దూరంగా ఉండడం మొదలుపెట్టాడు. ఒంటరి జీవితానికి అలవాటు పడ్డ అతను ఇక్కడ దోచుకున్న సొమ్ముతో గోవాలో జల్సాలు చేసేవాడు.

విద్యార్థులతో స్నేహం

ఎనిమిదో తరగతి వరకు చదువుకున్న ప్రభాకర్ 15 ఏళ్లకు నేరాల బాట పట్టాడు. తొలుత కొంతమంది స్నేహితులతో కలిసి ఇళ్లలో చోరీలు చేశాడు. ఈ నేరాల్లో ప్రభాకర్ దొరక్కపోయినా అతడి స్నేహితులు దొరికిపోయేవారు. దీనితో నేరాలకు వెళ్లినప్పుడు తోడుగా స్నేహితులను తీసుకెళ్లడం మానేశాడు. ఇలా ఇళ్లలో చోరీలు చేసిన ప్రభాకర్ ఏడెనిమిది ఏళ్లుగా విద్యాసంస్థలు, కార్పొరేట్ ఆస్పత్రులను లక్ష్యంగా చేసుకుని నేరాలు చేయడం మొదలుపెట్టాడు. ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రైవేటు పాఠశాలలు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చోరీలు చేశాడు. ఎక్కడ చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడో అందులో ఉండే వారితో స్నేహం చేస్తాడు. ఇంజనీరింగ్ కళాశాలల్లో అడ్మిషన్ ఎప్పుడు జరుగుతాయి, విద్యార్థులు ఎప్పుడు టర్మ్ ఫీజులు చెల్లిస్తారన్న విషయాలపై ప్రభాకర్‌కు పూర్తి అవగాహన ఉంది. దీని ప్రకారం కళాశాలలను ఎంపిక చేసుకుంటాడు. ముందుగా కళాశాలలోకి ఓ విద్యార్థిగా ప్రవేశిస్తాడు. అందులో విద్యాభ్యాసం చేసే వారిని పరిచయం చేసుకుంటాడు. ప్రిన్సిపాల్ చాంబర్ ఎక్కడ ఉంటుంది, ఫీజులు ఎక్కడ చెల్లిస్తారు, ఎవరెవరు ఫీజులను కట్టించుకుంటారు, విద్యార్థులు చెల్లించిన ఫీజులను ఎక్కడ భద్రంగా ఉంచుతారు అన్న వివరాలను విద్యార్థుల నుంచి రాబడతాడు. ఇందుకోసం విద్యార్థులకు రకరకాల తాయిలాలు ఇస్తాడు. కొంతమందికి డబ్బులు ఇస్తాడు. మరికొంతమందికి ల్యాప్‌టాప్‌లను కొనిస్తాడు. ఈవిధంగా విద్యార్థుల అవసరాలను తీర్చి తనకు కావాల్సిన మొత్తం సమాచారాన్ని తెలుసుకుంటాడు. ఇలా నెల రోజులపాటు కళాశాల్లో రెక్కీ చేస్తాడు. తర్వాత కారులో చోరీకి బయలుదేరతాడు. చోరీకి వెళ్లేటప్పుడు కీప్యాడ్ ఫోన్‌ను మాత్రమే ఉపయోగిస్తాడు. అందులో మిగతా 6లో..

నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికపై

ఉత్కంఠ

నేడు చైర్‌పర్సన్ ఎన్నిక.. ఏర్పాట్లు చేసిన అధికారులు

- కుర్చీ కోసం నలుగురు ఆశావహుల ప్రయత్నాలు
- పెదవి విప్పని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సౌమ్య



నందిగామ మునిసిపల్ కార్యాలయం

నందిగామ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నలుగురు ఆశావహులు, నలభై వేల మంది ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సోమవారం నందిగామ చైర్‌పర్సన్ ఎంపికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్నికల అధికారిగా నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణను నియమించారు. ఈ మేరకు ఆయన ఎన్నికల ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఎన్నికల్లో మునిసిపల్ పీఠాన్ని గెలుచుకున్న వైసీపీ చైర్‌పర్సన్ స్థానంలో మండవ వరలక్ష్మిని కూర్చోబెట్టారు. ఆమె అకాల మరణం చెందారు. దీంతో ఇన్‌చార్జిగా ఓర్సు లక్ష్మి కొనసాగుతున్నారు.

హైకోర్టు తీరుపై ఎలా ఉండబోతుంది?

నందిగామ మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికపై కోర్టు తీర్పు ఎలా ఉండబోతుందోననే ఉత్కంఠ అందరిలో నెలకొంది. చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ మాడుగుల నాగరత్నంతో 7, 11వ వార్డులు ఖాళీగా ఉన్నాయి. ఆ వార్డులకు ఎప్పుడో ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఇంత వరకూ నిర్వహించలేదు. దీంతో పట్టణానికి చెందిన వైసీపీ నాయకురాలు నాదెండ్ల హారిక హైకోర్టును ఆశ్రయించారు. తాను ఖాళీగా ఉన్న 11వ వార్డు నుంచి పోటీ చేసి గెలిచి చైర్‌పర్సన్ పదవికి పోటీ చేయాలని భావిస్తున్నట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. చైర్‌పర్సన్ పదవి చేపట్టేందుకు రాజ్యాంగం తనకు కల్పించిన పౌరహక్కులను కాపాడాలని ఆమె కోరారు. వార్డుల ఎన్నికలు పూర్తయ్యే వరకూ చైర్‌పర్సన్ ఎన్నిక నిలిపివేయాలని అభ్యర్థించారు. విచారణ జరిపిన న్యాయస్థానం కేసును సోమవారానికి వాయిదా వేసింది. దీంతో ఉత్కంఠతకు తెరలేచింది. ఎన్నిక, కోర్టులో కేసు విచారణ రెండూ ఒక సమయంలో ఉన్నందున అటు అధికారులు, ఇటు అధికార ప్రతిపక్ష నాయకులు టెన్షన్‌కు గురవుతున్నారు. అధికారం వచ్చిన నాటి నుంచి చైర్‌పర్సన్ పీఠంపై కన్నేసి వైసీపీ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకొని ఎన్నికలకు సిద్ధంగా కూటమి నేతలు ఉండగా, రాజ్యాంగ దుర్వినియోగం పేరుతో వైసీపీ హైకోర్టు ద్వారా ఆఖరి పోరాటం చేస్తుంది. ఇరువురిలో ఎవరు పైచేయి సాధిస్తారో వేచి చూడాల్సి ఉంది.

కౌన్సిల్‌లో బలాబలాలు

నందిగామ మునిసిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా, గత ఎన్నికల్లో వైసీపీ 13 స్థానాలు గెలిచింది. టీడీపీ ఆరు, జనసేన ఒక స్థానం దక్కించుకున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు, తర్వాత వైసీపీకి చెందిన కౌన్సిలర్లు పెద్దయెత్తున టీడీపీలో చేరారు. తాజాగా 19వ వార్డు కౌన్సిలర్ మందా మరియమ్మ కూడా ఆ పార్టీకి రాజీనామా చేశారు. తాను ఏ పార్టీలో చేరుతానన్న అంశాన్ని త్వరలో ప్రకటిస్తానన్నారు. ప్రస్తుతం వైసీపీకి చైర్‌పర్సన్‌తో సహా మొత్తం ముగ్గురు సభ్యులు మాత్రమే కౌన్సిల్‌లో ఉన్నారు. 7, 11వ వార్డుల సభ్యులు మరణించడంతో ఆ రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. వలస కౌన్సిలర్లతో కలిపి టీడీపీకి 14 మంది సభ్యుల బలం ఉంది. వైసీపీకి రాజీనామా చేసిన మందా మరియమ్మ కూడా టీడీపీలో చేరే అకాశం ఉండడంతో బలం మరింత పెరిగే అవకాశం ఉంది. దీన్నిబట్టి చైర్‌పర్సన్ ఎంపిక లాంఛనం కానుంది.

కుర్చీపై ఆశావహుల ఆశలు

మునిసిపల్ చైర్‌పర్సన్ పీఠం కోసం నలుగురు కౌన్సిలర్లు ఆశాలు పెట్టుకున్నారు. తమ శక్తి వంచన లేకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో చైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలో ఉన్న 8వ వార్డు కౌన్సిలర్ శాఖమూరి స్వర్ణలత నందిగామ సర్పంచ్‌గా పనిచేశారు. రెండు పర్యాయాలు 8వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందారు. ప్రజలతో మంచి సంబంధాలు, పాలనలో అనుభవం ఉన్న ఆమె చైర్‌పర్సన్ పదవి కోసం పోటీపడుతున్నారు. 5వ వార్డు కౌన్సిలర్ ఏచూరి రత్నకుమారి భర్త ఏచూరి రామకృష్ణ టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. తన భార్యకు చైర్‌పర్సన్ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. ఈయనకు కూటమి ప్రభుత్వం ఇటీవల ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇచ్చింది. 14వ వార్డు కౌన్సిలర్, టీడీపీ సీనియర్ నాయకురాలు కామసాని సత్యవతి చైర్‌పర్సన్ పీఠంపై ఆశలు పెట్టుకున్నారు. పార్టీ మిగతా 6లో..

నల్లవాగులో పడి ఇద్దరు వృద్ధులు మృతి

నందిగామ రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నల్లవాగులో పడి ఇద్దరు వృద్ధులు మృతి చెందిన ఘటన నందిగామ మండలం చందాపురంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని చందాపురం గ్రామానికి చెందిన కనకపూడి సత్యం (61) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య కోటిరత్నం, కుమారుడు నాగరాజు ఉన్నారు. జగ్గయ్యపేట మండలం చిల్లకల్లుకు చెందిన మాతంగి జయరాజు (74) ఈయనకు ముగ్గురు కుమార్తెలున్నారు. రెండవ కుమార్తె ఉషను చందాపురంలోని ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్న కనకపూడి శంకర్‌రావుతో గత 24 ఏళ్ల కిందట వివాహం చేశాడు. కరోనా సమయంలో ఉష మృతి చెందటంతో అల్లుడి వద్దనే ఉంటూ పిల్లల ఆలనా పాలనా చూసుకుంటున్నాడు. శనివారం రాత్రి సత్యం, జయరాజు మద్యం తాగి నల్లవాగు అంచున కూర్చుని మాట్లాడుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలుజారి వాగులో పడ్డారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అక్కడకు చేరుకుని గాలించి బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అట్టహాసంగా ఈత పోటీలు

- వివిధ రాష్ట్రాల నుంచి 600 మంది హాజరు
- ఏడు కేటగిరీల్లో పోటీల నిర్వహణ

6లో



దుర్గమ్మ సేవలో డీజీపీ



డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దుర్గగుడి అధికారులు

విజయవాడ (వన్‌టౌన్), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీష్ కుమార్‌గుప్తా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం పలికారు. అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.



పెండ్లి కుమారుడు, కుమార్తెగా అలంకరించి స్వామి, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చక బృందం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మోపిదేవి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు స్వామిని పెండ్లి కుమారుడిని చేశాక ఆలయ ఈవో డి.శ్రీరామ వరప్రసాదరావు ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ప్రధాన అర్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి పెండ్లి కుమారుడిని చేశారు. దేవాదాయశాఖ ఆలయ అనువంశిక ధర్మకర్తలైన చల్లపల్లి రాజా వంశీయుల తరఫున ఈవో శ్రీరామవరప్రసాదరావు స్వామి, అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చక బృందం నూతన వస్త్రాలతో స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి, వేదమంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా పెండ్లి కుమారుడిని చేశారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆదివారం కావడంతో భక్తులు స్వామి దర్శనం కోసం బారులు తీరారు.

148 మందితో 108 సార్లు సూర్య నమస్కారాలు

● ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం



సూర్య నమస్కారాలు చేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, యోగా సాధకులు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యోగ సభ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 148 మంది యోగసాధకులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు 108 పర్యాయాలు సూర్య నమస్కారాలు చేశారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కూడా 108 సార్లు సూర్య నమస్కారాలు చేయడం విశేషం. ఈ కార్యక్రమం ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించింది. కార్యక్రమంలో యోగ గురువులు ఘంటసాల గురు నాథబాబు, మహాలక్ష్మి, మద్దాల చింతయ్య, ఆర్డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఆనందప్రసాద్

చేనేత కార్మికుల సత్తా చాటుదాం

గన్నవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పది మందికి పైగా చేనేత వర్గ ఎమ్మెల్యేలు ఉంటే, రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపితే ఒక్కరే ఉన్నారు. అదీ ఏపీలోనే, తెలంగాణాలో ఒక్కరూ లేరు. అనైక్యత వల్లే చేనేత కార్మికులు వెనకబడుతున్నారు. సంఘటితంగా ఉంటేనే అభివృద్ధిని సాధిస్తాం. కేంద్రం బడ్జెట్‌లో చేనేతలకు తక్కువ నిధులు కేటాయించింది. అడిగేందుకు కేంద్రంలో చేనేత వర్గానికి చెందిన ఎంపీ, రాజ్యసభ సభ్యులు లేరు. అన్ని రకాలుగా అన్యాయం జరుగుతోంది. ఐక్యతతో ముందుకు వెళదాం. ప్రభుత్వాల కళ్లు తెరిపించేలా ఏప్రిల్ 27న చేనేత ఆత్మ గౌరవ సభను మంగళగిరి ప్రాంతంలో నిర్వహిద్దాం. చేనేతల సత్తా చాటుదాం.' అని వీవర్స్ ఫెడరేషన్, చేనేత వర్గ ప్రముఖులు పిలుపునిచ్చారు. గన్నవరంలోని శ్రీ మల్లికార్జున విద్యాసంస్థల ప్రాంగణంలో ఆదివారం మంగళగిరిలో నిర్వహించబోయే చేనేత బహిరంగసభ సన్నాహక సమావేశం ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇనమాల శివరామ్‌ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఆనంద ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమదం మహేష్, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్‌పర్సన్ డాక్టర్ సత్య హేమలత, మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, కాండ్రు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణయ్య మాట్లాడారు. 18 చేనేత కులాలను ఏకంచేసి ఏప్రిల్ 27న చేనేత ఆత్మగౌరవ సభ మంగళగిరి ప్రాంతంలో నిర్వహించాలని తీర్మానించారు.

దుర్గగుడి ఘాట్‌రోడ్డు మొదటి మలుపులో

చెత్తకు మంటలు

● అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది



మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వన్‌టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): దుర్గగుడి ఘాట్‌రోడ్డులో దిగువ నుంచి పైకి వెళుతున్న మార్గంలో మొదటి మలుపు వద్ద ఆదివారం చెత్తకు నిప్పంటుకుని భారీగా మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగసి పడుతుండడంతో భక్తులు, ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు ఆందోళన చెం దారు. మంటలు ఎగసిప డుతున్నాయని అక్కడున్న సెక్యూరిటీ గార్డు దేవస్థానం అధికారుల దృష్టికి తెచ్చాడు. అధికారులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఇంజి న్‌తో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది. మంటలను అదుపులోకి తెచ్చారు. వన్‌టౌన్ సీఐ గురు ప్రకాష్ తన సిబ్బందితో ఘటనా ప్రాంతానికి వచ్చి పరిస్థితిని సమీక్షించారు. మంటలను అదుపులోకి తెచ్చేంత వరకు పర్యవేక్షించారు. అకతాయిలు ఎవరో మంటలు అంటించారని అనుకుంటున్నారు. ఖాళీ ప్రదేశం కావడంతో మంటల వల్ల ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి

ధర్నాచౌక్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శివారెడ్డి పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో సంఘం మహిళా ఉద్యోగుల విభాగం కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. సంఘం మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. వారు విధులు నిర్వహించే ప్రదేశాల్లో పూర్తి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ చెప్పారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులు అనుభవించిన మానసిక వేదన, ఆర్థిక ఇబ్బందులను ఒక్కొక్కటిగా అధిగమిస్తున్నామన్నారు. నూతన ప్రభుత్వంలో ఒకటో తేదీన జీతాలు అందుకుంటున్నామని చెప్పారు. మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. కన్వీనర్ మాధవి, రాష్ట్ర కార్యదర్శి తులసీరత్న ం, ప్రచార విభాగం కార్యదర్శి జానకి, ఆల్ ఇండియా ఉమెన్ సబ్ కమిటీ కన్వీనర్ రాజ్యలక్ష్మి, ఆల్ ఇండియా ఎన్ఈసీ సభ్యురాలు శాం తిశ్రీ పాల్గొన్నారు.

నాక్ లంచాల కేసులో నిందితులకు రిమాండ్

విజయవాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నాక్ ఏ+++ గుర్తింపు కోసం లంచాలు ఇచ్చిన కేసులో నిందితులకు సీబీఐ కోర్టు రిమాండ్ విధించింది. నాక్ గుర్తింపు పరిశీలనార్థం ఢిల్లీ నుంచి వచ్చిన సభ్యులకు గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ రూ.34 లక్షలు లంచంగా ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ సమాచారంతో సీబీఐ పోలీసులు కేఎల్ యూనివర్సిటీకి చెందిన సారథివర్మ, కోనేరు రాజా, రామకృష్ణ, హనీష్‌తో పాటు నాక్ కమిటీ చైర్మన్ సమరేంద్రనాథ్ సాహాతో కలిపి 10 మందిని అరెస్టు చేశారు. వారిని విజయవాడలోని సీబీఐ న్యాయమూర్తి ముందు ఆదివారం హాజరుపరచగా, 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. అనంతరం వారిని హనుమాన్‌పేటలోని జిల్లా కారాగారానికి పంపారు.

దోచుకున్న సొమ్ముతో గోవాలో జల్సాలు

(5వ పేజీ తరువాయి)

ఉన్న సిమ్‌ను ఆఫ్ చేస్తాడు. నేరం చేసేటప్పుడు కాంతి కోసం సెల్‌ఫోన్ టార్చ్‌లైట్‌ను ఉపయోగిస్తాడు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్ఆర్కే ఇంజనీరింగ్ కళాశాలలో ఈవిధంగానే చోరీ చేశాడు. కారులో వచ్చి ఇంజనీరింగ్ కళాశాలకు కిలోమీటరు దూరంలో దాన్ని నిలుపుదల చేశాడు. కళాశాలలో రూ.82లక్షలను రెండు బ్యాగుల్లో సర్దుకుని కారులో పెట్టుకున్నాడు. ఎన్నికల సమయంలో పోలీసులు రేయింబవళ్లు వాహనాల తనిఖీలు చేపట్టినా ప్రభాకర్ వారికి చిక్కలేదు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు తనిఖీలు నిర్వహించిన పోలీసులు అలసిపోయి చెక్‌పోస్టుల్లో కూర్చున్న సమయాన్ని చూసుకుని నగరాన్ని దాటేశాడు. ఇంజనీరింగ్ కళాశాలలతోపాటు కార్పొరేట్ స్కూల్స్, ఆస్పత్రుల్లో భారీగా నగదును దొంగిలించినట్టు పోలీసులు చెబుతున్నారు.

చినగొల్లపాలెంలో ఉద్రిక్తత

మంత్రి అనుచరులమంటూ వివాదాస్పద భూమిలోకి మచిలీపట్నానికి చెందిన వ్యక్తుల చొరబాటు

● వందల సంఖ్యలో కూలీలతో సరుగుడు తోటలు నరకడానికి యత్నం
● చెట్లను నరకడంపై మూడు రోజులుగా వివాదం
● గ్రామస్థుల ఆందోళన..మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు
● భారీగా మోహరించిన పోలీసులు



మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మహిళలు

కృత్తివెన్ను, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చినగొల్లపాలెం దీవిలో కౌలు రైతులు పెంచుకున్న సరుగుడు తోటలను కొందరు దౌర్జన్యంగా నరికివేయడంతో దీవిలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీవిలో సర్వే నెంబరు 213, 217, 572-1లో 53.76 ఎకరాల భూమిని ఎండూరి రవీంద్రమూర్తి అనే రైతు 2011లో చినగొల్లపాలేనికి చెందిన పెద్ది సత్యనారాయణ, చందు సత్యనారాయణ అనే ఇద్దరు రైతులకు లీజుకు ఇచ్చాడు. వారు ఆ భూమిలో సరుగుడు తోటను వేసి, పెంచారు. అవి ఎదిగి కోతకు వచ్చాయి. అయితే ఆ భూమి నాదంటే నాదంటూ కొందరు ప్రైవేటు వ్యక్తుల మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. దీనిపై ఇరు పార్టీలు కోర్టును ఆశ్రయించాయి. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. దీంతో ఆ భూమిలోని చెట్లను నరికేందుకు కౌలు రైతులకు అవకాశం లేకపోయింది. దీంతో ఆ చెట్లను అలానే ఉంచారు. ఈ పంట, భూమిపై కన్నేసిన కొందరు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఒక పార్టీతో ఒప్పందం కుదుర్చుకుని గత ప్రభుత్వంలో భూమిని ఆక్రమించి, చెట్లను తొలగించేందుకు ప్రయత్నించారు. గ్రామస్థులు అడ్డుకోవటంతో వారి ప్రయత్నం బెడిసికొట్టింది. తాజాగా మూడు రోజులుగా మచిలీపట్నానికి చెందిన కొందరు వ్యక్తులు ఓ మంత్రి గారి అనుచరులమంటూ వివాదస్పద భూమిలోకి చొరబడ్డారు. వందల సంఖ్యలో ప్రైవేటు బలగాలతో వచ్చిన కూలీలు భూమిలోని లక్షల రూపాయల విలువైన సరుగుడు తోటలను నరకటం ప్రారంభించారు. దీనిపై స్థానికులకు, ప్రైవేటు వ్యక్తులకు మధ్య మూడు రోజులపాటు చిన్న చిన్న వివాదాలు తలెత్తాయి. సరుగుడు తోట అక్రమ నరికివేతపై ఆంధ్రజ్యోతి ఆదివారం ప్రత్యేక కథనంతో విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. దీనిపై పోలీసులు, రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి విషయంపై ఆరా తీశారు. అయితే అప్పటికే వివాదాలు తారస్థాయికి చేరాయి.

రూ.60 లక్షల విలువైన కలప నరికేశారని ఫిర్యాదు

ఇరు వర్గాలు ఆదివారం ఉదయం వందల సంఖ్యలో భూమి వద్దకు చేరడంతో వివాదం తీవ్ర రూపం దాల్చింది. పక్కా సమాచారంతో బందరు డీఎస్పీ రాజా, సీఐ నాగేంద్రబాబు, ఆర్డీవో స్వాతిలు వందల సంఖ్యలో ప్రత్యేక బలగాలతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. సరుగుడు తోటను నరికే కూలీలను గ్రామస్థులు అడ్డుకున్నారు. తరలించే లారీలను ఆపేశారు. మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రికి పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. అధికారులకు, పోలీసులకు ముడుపులు అందబట్టే వివాదాస్పద, కోర్టు వ్యవహారాల్లో ఉన్న భూమిలో దొంగచాటుగా లక్షల రూపాయల విలువైన చెట్లను నరకటం వారికి సాధ్యమైందంటూ గ్రామస్థులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పి, అక్కడ నుంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కౌలు రైతులు పెద్ది సత్యనారాయణ, చందు సత్యనారాయణలు తమ 53.75 ఎకరాల కౌలు భూమిలోకి దౌర్జన్యంగా వచ్చి ఇప్పటికే రూ.60 లక్షల విలువైన 4 ఎకరాల కౌలు భూమిలోని సరుగుడు తోటను నరికిన మచిలీపట్నానికి చెందిన కొందరు వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారణ జరుగుతున్నట్లు స్థానిక ఎస్సై పైడిబాబు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు

తాత్కాలిక విరామం

కృష్ణలంక, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లాలో ఈనెల 3వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు నిర్వహించబోమని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా తాత్కాలిక విరామం ఇచ్చామన్నారు.

సీపీ కార్యాలయంలోనూ..

గుణదల: ప్రతి సోమవారం తమ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈ నెల 3వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు వాయిదా వేస్తున్నామని నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు తెలిపారు.

నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికపై ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

ఆవిర్భావం నుంచి టీడీపీలోనే కొనసాగుతున్నామని, ఏడుపదుల వయస్సుకు దగ్గర పడుతున్న తనకు చివరి అవకాశంగా ఈ పదవి ఇవ్వాలని ఆమె కోరుతున్నారు. 10వ వార్డు కౌన్సిలర్ మండవ కృష్ణకుమారి కూడా ఈ పదవికి పోటీపడుతున్నారు. గత ప్రభుత్వంలో అమరావతి పరిరక్షణకు ఉద్యమాలు జరుగుతున్న సమయంలో ఆమె భర్త శ్రీనివాసరావుపై వైసీపీ పాలకులు అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారు. పార్టీ కోసం, అమరావతి కోసం తాము ఇబ్బందులను ఎదుర్కొన్నామని చైర్‌పర్సన్ పదవి తమకు ఇవ్వాలని ఆమె కోరుతున్నారు. మృతి చెందిన చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి కృష్ణకుమారికి తోటి కోడలు. ఎన్నికల సమయంలో వరలక్ష్మి భర్త మండవ పిచ్చయ్య కూడా టీడీపీలో చేరి పార్టీ విజయం కోసం కృషి చేశారు. ఈ కారణాల రీత్యా పదవి తమకు ఇవ్వాలని కృష్ణకుమారి కోరుతున్నారు. అయితే చైర్‌పర్సన్ పీఠం కోసం పోటీ పడుతున్న నలుగురు ముఖ్యమైన వారే కావడంతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సౌమ్య తన నిర్ణయాన్ని తొందర పడి వ్యక్తం చేయకుండా మౌనం వహిస్తున్నారు. ప్రజల మనోభావాలను, పార్టీ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సముచిత న్యాయం తీసుకుంటారని పార్టీ వర్గాలు చెప్పుకొస్తున్నాయి.

ఉత్సాహంగా రివర్ క్రాస్ పోటీలు



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

వన్‌టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ దుర్గాఘాట్ వద్ద ఆదివారం 25వ రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. 600 మంది స్విమ్మర్లు పాల్గొన్నారు. దుర్గాఘాట్ నుంచి దక్షిణం వైపు లోటస్ పాండ్ వరకు ఒకటిన్నర కిలోమీటర్ల నిడివిలో ఈ పోటీలు జరిగాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా అమరావతి ఫెస్టివల్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, బీజేపీ నాయకుడు పాతూరి నాగభూషణం విచ్చేశారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ దాసరి యుగంధర్, ప్రెసిడెంట్ వెలగపూడి వెంకటేశ్వరరావు, సెక్రటరీ మండపాటి నరసారాజు, వైస్ ప్రెసిడెంట్ లింగిపల్లి రామకృష్ణ, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. పోటీల అనంతరం ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణంలో విజేతలకు 50గ్రా, 30గ్రా వెండి నాణేలు, సర్టిఫికెట్లను అందజేశారు.

పురుషుల విభాగంలో విజేతలు వీరే...

10-15 ఏళ్ల కేటగిరీలో యశస్వి(ప్రథమ), సాగి రిషికేష్ వర్మ(ద్వితీయ), షణ్ముఖ రాఘవ (తృతీయ), 16-20 ఏళ్ల కేటగిరీలో సాయి నిహాల్(ప్రథమ), రిత్విక్(ద్వితీయ), కింగ్ జార్జ్(తృతీయ), 21-30 ఏళ్ల కేటగిరీలో పి.వి.సత్యనారాయణ(ప్రథమ), ఎల్.పి.సి.డి.ఆర్ సౌరత్తోర్(ద్వితీయ), కె.గౌతమ్(తృతీయ), 31-40 ఏళ్ల కేటగిరీలో తులసి చైతన్య(ప్రథమ), నాగార్జున రెడ్డి (ద్వితీయ), 41-50 ఏళ్ల కేటగిరీలో ప్రదీప్‌కుమార్(ప్రథమ), శివగణేష్(ద్వితీయ), శ్రీనివాసరెడ్డి (తృతీయ), 51-60 ఏళ్ల కేటగిరీలో బి.ప్రకాష్‌రావు(ప్రథమ), తులసి నాగరాజు(ద్వితీయ), జొన్నలగడ్డ రామకృష్ణ(తృతీయ), 60 ఏళ్లు పైబడిన విభాగంలో కులశేఖర్(ప్రథమ), మోహనరావు (ద్వితీయ), కాట్రగడ్డ అజయ్(తృతీయ) స్థా నాల్లో నిలిచారు.

మహిళా విభాగంలో..

10-15 ఏళ్ల కేటగిరీలో వెన్నశ్రీ(ప్రథమ), రమ్యశ్రీ(ద్వితీయ), నిషా అగర్వాల్(తృతీయ), 16-20 ఏళ్ల కేటగిరీలో కర్ణికగుప్తా(ప్రథమ), శాంతి(ద్వితీయ), రామలక్ష్మి(తృతీయ), 21-30 ఏళ్ల కేటగిరీలో మానస(ప్రథమ), ప్రమోదోత్తమ (ద్వితీయ), కీర్తన(తృతీయ), 31-40 ఏళ్ల కేటగిరీలో కిరణ్‌మౌనిక(ప్రథమ), డింపుల్ కృష్ణ(ద్వితీయ), శకుంతలదేవి(తృతీయ), 41-50 ఏళ్ల కేటగిరీలో సునీత(ప్రథమ), శృతి ప్రసాద్(ద్వితీయ), లక్ష్మీసౌజన్య(తృతీయ), 51-60 ఏళ్ల కేటగిరీలో ఇంద్రాణి(ప్రథమ), పద్మప్రియ(ద్వితీయ), సీహెచ్‌రజని(తృతీయ), 60 ఏళ్ల పైన విభాగంలో పద్మప్రియ(ప్రథమ), సూర్యకాంతం(ద్వితీయ), విజయశ్రీ గుప్తా (తృతీయ)స్థానాల్లో నిలిచారు.



కృష్ణా, ఐఎస్‌బీఎం యూనివర్సిటీల పేరుతో నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు

నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ల దందా!

కృష్ణా యూనివర్సిటీ డిగ్రీ సర్టిఫికెట్లకు నకిలీ మకిలి

● యువకులను మభ్యపెట్టి నకిలీ ధ్రువీకరణ పత్రాలు అంటకట్టిన ముఠా .. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు
● కొత్తపేటలోని ఓ నెట్ సెంటర్‌లో తయారీ?
● ప్రశ్నించిన యువకులకు బెదిరింపులు

బెజవాడ పాతబస్తీలో నకిలీ డిగ్రీ సర్టిఫికెట్ల దందా వెలుగులోకి వచ్చింది. యూనివర్సిటీలో చదువుకోకపోయినా ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇప్పిస్తామంటూ నమ్మబలికి రూ.లక్షలు గుంజుతున్న ముఠా దందా బహిర్గతమైంది. సర్టిఫికెట్లు తీసుకున్న వారిలో కొందరు వన్‌టౌన్‌లోని కేబీఎన్ కాలేజీలోను, కృష్ణా యూనివర్సిటీలోనూ పరిశీలించడంతో అవి నకిలీవని తేలింది. దీంతో నకిలీ సర్టిఫికెట్ల బాగోతం వెలుగులోకి వచ్చింది. బాధిత యువకులు కొంత మంది పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటూ ధైర్యంగా ముందుకు రావటంతో ముఠా దందా వెలుగులోకి వస్తోంది.

(ఆంధ్రజ్యోతి-వన్‌టౌన్): జగ్గుపిళ్ల ఈశ్వర్ సాయి గణేష్ అనే విద్యార్థికి కృష్ణా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న కాకరపర్తి భావన్నారాయణ కాలేజీ(కేబీఎన్) పేరుతో డిగ్రీ సర్టిఫికెట్‌ను ముఠా అంటకట్టింది. గణేష్ ఒక్కరే కాకుండా అనేక మంది నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లు పొందినట్టు తెలుస్తోంది. ఇందులో తమ తప్పేమీ లేదని, తమను మభ్యపెట్టడం వల్లనే డబ్బులు చెల్లించామని, పోలీసులకు అన్ని వాస్తవాలు చెబుతామని బాధితులు అంటున్నారు. కృష్ణా యూనివర్సిటీనే కాకుండా ఐఎస్‌బీఎం యూనివర్సిటీ పేరుతోనూ యువకులకు డిగ్రీ సర్టిఫికెట్లు ఇచ్చినట్టుగా వెలుగుచూసింది. ఇంకా అనేక యూనివర్సిటీలకు చెందిన నకిలీ సర్టిఫికెట్లను పొందినట్టుగా విద్యార్థులు చెబుతున్నారు.

ముఠా సూత్రధారి ఉపాధ్యాయుడు..

కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్‌లోని ఓ నెట్ సెంటర్ కేంద్రంగా ఈ బాగోతం నిర్వహిస్తున్నట్టు విద్యార్థులు చెబుతున్నారు. నకిలీ సర్టిఫికెట్ల ముఠా సూత్రధారుడు గతంలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసినట్టు తెలుస్తోంది. గతంలో వన్‌టౌన్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో ఏడో తరగతి కామన్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాల లీక్‌లో కూడా ఇతను సూత్రధారి అని తెలుస్తోంది. ఏ డిగ్రీ కావాలన్నా ఇట్టే తయారు చేసి ఇచ్చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. తమకు మాత్రం ఒరిజినల్ యూనివర్సిటీ సర్టిఫికెట్ అని చెప్పి డబ్బులు తీసుకున్నారని బాధితులు చెబుతున్నారు. ఇందుకుగాను ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.60 వేల నుంచి లక్ష రూపాయల వరకు వసూలు చేశారని చెబుతున్నారు. తమ చేతికి వచ్చిన సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో మోసపోయిన విషయం అర్థమైందని అంటున్నారు. తమను మభ్యపెట్టి నకిలీ ధ్రువీకరణ పత్రాలు అంటకట్టారని వాపోతున్నారు.

పంజా సెంటర్‌కు చెందిన వ్యక్తి ప్రధాన సూత్రధారి

నకిలీ సర్టిఫికెట్ల ప్రధాన సూత్రధారి పంజా సెంటర్‌లో ఉంటున్నట్లు సమాచారం. ఇతను పలు సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఐడీ కార్డు తగిలించుకుని హవా సాగిస్తున్నాడని సమాచారం. ఇతని సోదరుడు ఒకరు పోలీసు శాఖలో పనిచేస్తుండడంతో అతని పేరు చెప్పి తనను నకిలీ సర్టిఫికెట్ల గురించి అడిగిన వారిపై బెదిరింపులకు దిగుతున్నాడని విద్యార్థులు చెబుతున్నారు.

నకిలీవి అని తేల్చిన కేబీఎన్ యాజమాన్యం, కృష్ణా యూనివర్సిటీ

జగ్గుపిళ్ల ఈశ్వర్ సాయి గణేష్‌కు కేబీఎన్ కాలేజీ పేరిట జారీ అయిన డిగ్రీ సర్టిఫికెట్‌పై కాలేజీ యాజమాన్యాన్ని వివరణ కోరగా నకిలీవని తెలిపింది. దీనిపై కృష్ణా యూనివర్సిటీ అధికారులను వివరణ కోరగా నకిలీ సర్టిఫికెట్ అని వారు కూడా తేల్చి చెప్పారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల కిటకిట



అంతరాలయంలో..

వన్‌టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సందర్భంగా దూరప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. క్యూలలో బారులు తీరారు. గుణదల ప్రాంతానికి చెందిన చింతలపాటి మల్లికార్జునరావు, ఆయన కుటుంబ సభ్యులు దుర్గమ్మకు 120 గ్రాముల బంగారు చైన్, రెండు మంగళసూత్రాలు దుర్గమ్మకు కానుకగా డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజుకు అందజేశారు.

సూర్యోపాసన ఆర్జిత సేవ

ఆలయ వైదిక కమిటీ సూచనల మేరకు లోక కల్యాణార్థం, భక్తజన శ్రేయస్సు కోసం సూర్యోపాసన ఆర్జిత సేవను అదనంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. తొమ్మిది రోజుల పాటు జరగనున్న ఈ సేవల్లో పాల్గొనే భక్తులు (దంపతులకు) రూ.1,000 చెల్లించాలి. మహామండపం ఏడో అంతస్థు కళావేదిక ప్రాంగణంలో రోజూ ఉదయం 8 గంటలకు ఈ ఆర్జిత సేవ నిర్వహిస్తారు.

రిజర్వ్ మద్యం షాపులకు ఉపకులం ధ్రువీకరణ తప్పనిసరి

● జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

విజయవాడ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కులాలకు ప్రభుత్వం రిజర్వు చేసిన మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకునే వారు కచ్చితంగా ఉపకులానికి సంబంధించిన ధ్రువీకరణపత్రాన్ని రెవెన్యూ అధికారుల వద్ద నుంచి తీసుకుని సమర్పించాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. గీత కులాల్లో గౌడ్, గౌడ, శెట్టిబలిజ ఉపకులాలు ఉన్నట్టు స్పష్టమవుతోందన్నారు. ఈ మూడే కాకుండా ఇందులో అనేక ఉపకులాలు ఉన్నాయన్నారు. వాళ్లంతా గౌడ్, గౌడ, శెట్టిబలిజతోపాటు ఆ ఉపకులాలకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలను దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. ఉపకులాల ధ్రువీకరణపత్రాలు లేని దరఖాస్తులను తిరస్కరిస్తామని వెల్లడించారు.

విజయవాడ టు దుబాయ్!

(5వ పేజీ తరువాయి)

విమానాశ్రయాన్ని ఉపయోగించుకుంటారన్న విషయాన్ని ఎయిర్‌పోర్టు అధికారులు ఎమిరేట్స్ బృందం దృష్టికి తీసుకువచ్చారు. విజయవాడ విమానాశ్రయ పాసెంజర్ క్యాచ్‌మెంట్ పరిధిలో ఎంతమంది ఎన్ఆర్ఐలు ఉన్నారు? టూరిస్టులు ఎంత మంది ఉన్నారు? వారి కదలికలు ఎలా ఉంటాయి? ఈ ప్రాంతాల ప్రజలు ఏయే విమానాశ్రయాల నుంచి విదేశాలకు వెళుతున్నారు? విదేశీ విద్య కోసం ఎవరెవరు వెళుతున్నారు? బిజినెస్ పీపుల్ సంఖ్య ఎంత ఉంటుంది? వారి అవసరాలు ఏమిటి? అన్న అంశాలపై ఎమిరేట్స్ చాలా లోతుగా అధ్యయనం చేస్తోంది. ఈ ప్రాంతాల నుంచి విదేశాలకు వెళుతున్న వారి వివరాలను కూడా ఆయా విమానాశ్రయాల నుంచి డేటా సేకరిస్తున్నట్టు తెలుస్తోంది.

వీజీఎఫ్ విధానంలో నడిపేందుకు గతంలో నిర్ణయం

విజయవాడ నుంచి దుబాయ్‌కు విమాన సర్వీసును వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానంలో నడిపించేందు గత టీడీపీ ప్రభుత్వం హయాంలో నిర్ణయం తీసుకోవటం జరిగింది. అప్పట్లో ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. ప్రజాభిప్రాయ సేకరణలో దుబాయ్‌కు విమాన సర్వీసు నడపాలని వేలాది సంఖ్యలో ప్రజలు డిమాండ్ చేశారు. అంతకు ముందు విజయవాడ నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసు నడిపే విషయంలోనూ గత టీడీపీ ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ జరిపింది. సింగపూర్ సర్వీసుకు కూడా వేలాది సంఖ్యలో ప్రజలు సానుకూలతను తెలిపారు. దీంతో అప్పట్లో విజయవాడ - సింగపూర్‌కు వీజీఎఫ్ పద్ధతిలో విమానం నడిపారు. ఆ విమానం నూరుశాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడిచింది. అలాగే దుబాయ్ సర్వీసును కూడా ప్రారంభించే సమయానికి ఎన్నికలు వచ్చాయి. దీంతో అప్పట్లో విమాన సర్వీసు ప్రారంభించటానికి వీలు పడలేదు. దుబాయ్ అంటే ప్రపంచంలోనే డెస్టినేషన్ ఎయిర్‌పోర్టులలో ప్రధానమైన వాటిలో ఒకటి. డెస్టినేషన్ ఎయిర్‌పోర్టు అంటే అక్కడి నుంచి ప్రపంచంలోని ఏ దేశానికైనా చేరుకోవటానికి అవకాశం ఉంటుంది. ఆ తర్వాత క్రమంలో విజయవాడ నుంచి షార్జాకు రెండు విమాన సర్వీసులు నడుస్తున్నాయి. విజయవాడ నుంచి దుబాయ్‌కు అవకాశం ఉన్నప్పటికీ విమాన సర్వీసు కల నెరవేరటం లేదు. దుబాయ్‌కు విమాన సర్వీసు కోసం ఎదురు చూస్తున్న దశలో అరబ్ ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ విజయవాడ నుంచి దుబాయ్‌కు సాధ్యాసాధ్యాలను పరిశీలించటంతో పాటు సర్వే నిర్వహించటంతో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(కి.లో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

దర్శిపేట అమ్మవారి రజతోత్సవాలు ప్రారంభం

పటమట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పటమట దర్శిపేటలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ప్రతిష్ఠ జరిగి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 25వ కల్యాణ మహోత్సవాలు ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు జరపనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ గౌరవాధ్యక్షుడు బొప్పన భవకుమార్, ఆవుల నాసరయ్య, పోతంశెట్టి నాగేశ్వరరావు, రాజరాజేశ్వరి మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

సీసీ ఫుటేజ్ ఆధారంగా బ్యాగ్ గుర్తింపు

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పోయిన బంగారు ఆభరణాలను ఆదివారం బాధితురాలికి అప్పగించారు సత్యనారాయణపురం సీఐ లక్ష్మీనారాయణ. చోల్లంగి సాధన అమలాపురం నుంచి నగరానికి ఆదివారం బస్‌లో వచ్చింది. అక్కడి నుంచి రైల్లో ఊరెళ్లేందుకు రైల్వేపార్శిల్ ఆఫీసు వద్దకు ఆటోలో వచ్చింది. రైలు వెళ్లిపోవడంతో గుంటూరు వెళ్లేందుకు కారు మాట్లాడుకొని వెళుతుండగా ఆభరణాలున్న బ్యాగ్ కనిపించలేదు. దీంతో సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఆమె బస్ దిగిన దగ్గర నుంచి సీసీ ఫుటేజ్ పరిశీలించగా ఆటో దిగి కారు ఎక్కే క్రమంలో గాంధీనగర్‌లో హోటల్ సమీపంలో బ్యాగ్‌ను చెప్పుల దుకాణం ముందు మర్చిపోయినట్టు గుర్తించారు. షాపు వారిని విచారణ చేయగా బ్యాగ్‌ను ఎవరో మర్చిపోయారని దాచిపెట్టామని బ్యాగ్‌ను అప్పగించారు. సీఐ లక్ష్మీనారాయణ బాధితులకు 100 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను అందజేశారు. పోలీసులకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది.



గ్రీనరీలో పెరిగిన పుట్టలు, చెట్టు చుట్టూ కూర్చోడానికి ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మలు, పక్కన పడవేసిన మద్యం ఖాళీ సీసాలు, గ్రీనరీలో పడవేసిన చెత్త, విస్తరాకులు, గ్రీనరీ పేరుకుపోతున్న చెత్త, సర్వీస్ రోడ్లో పేరుకుపోయిన చెత్త

పచ్చదనంపై పాలకుల నిర్లక్ష్యం

భారతీనగర్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన గ్రీనరీలో ఆహ్లాదకరం కరువై కళాహీనంగా మారింది. సెంటిని హాస్పిటల్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు అధికారులు నగర సుందరీకరణలో భాగంగా సర్వీసు రోడ్డుకు, జాతీయ రహదారికి మధ్యలో ఉన్న స్థలంలో వివిధ రకాలమొక్కలు, అందమైన పచ్చగడ్డి, ఆహ్లాదాన్ని కలిగించే వాతావరణం, మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో పాటు చిన్నారులను సైతం ఆకటుకునేలా చెట్లపై అందమైన బొమ్మలు వేశారు. పెద్దలు వాకింగ్ చేయడం కోసం వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. పాదచారుల కోసం గ్రీనరీ మధ్యలో పలుచోట్ల పెద్దవృక్షాలకు సిమెంట్ దిమ్మలు ఏర్పాటు చేసి ఎంతో ఆహ్లాదకరంగా మార్చారు. ఈ గ్రీనరీ చుట్టూ ఇనుపతీగలతో రక్షణ గోడలు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ప్రైవేట్ ఆసుపత్రి ఉన్నాయి. వీటికోసం రోజూ వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఈ గ్రీనరీలోనే వారు సేదతీరుతుంటారు. ప్రస్తుతం దీన్ని పట్టించుకొనేవారు లేక సెంటిని హాస్పిటల్ సెంటర్ నుంచి రామవరప్పాడు వరకు ఉన్న గ్రీనరీల్లో పలుచోట్ల చెత్తకుప్పలు పేరుకుపోయాయి, పచ్చగా కళకళాడాల్సిన గ్రీనరీ ఎండిపోయి కళాహీనంగా మారింది. అక్కడక్కడ కొన్ని చెట్లు ప్రమాదకరంగా మారాయి. దీన్ని ఆసరాగా తీసుకొన్న కొందరు ఆకతాయిలు రాత్రి సమయంలో గ్రీనరీలో మద్యం సేవిస్తున్నారు. చిన్నారులు, పెద్దలు కాసేపు కూర్చోవడానికి చెట్లచుట్టూ ఏర్పాటు చేసిన సిమ్మెంట్ దిమ్మలను ధ్వంసం చేస్తే మరికొన్నిచోట్ల పుట్టలు ఏర్పడ్డాయి. ప్రభుత్వసుపత్రి సమీపంలోని చిరువ్యాపారుల వలన ఆ ప్రాంతంలో చెత్త పేరుకుపోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేసున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వెటర్నరీ కాలనీలో పేరుకుపోయిన చెత్త

కాలనీ ప్రధానరోడ్లలో పేరుకుపోయిన చెత్తతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 4వ డివిజన్‌లోని వెటర్నరీ కాలనీ సర్వీస్ రోడ్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్ నిండిపోయింది. ఈ చెత్త రోడ్డుపైకరి రావడంతో రోడ్డంతా దుర్వాసన వస్తోందని పెద్దలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొండప్రాంత సమస్యలపై ప్రత్యేక దృష్టి : గద్దె

గుణదల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కొండ ప్రాంతవాసుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు తెలిపారు. స్థానిక 5వ డివిజన్ పరిధిలోని పెద బావి సెంటర్ వద్ద కొండప్రాంతంలో ఆదివారం ఆయన పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొండ ప్రాంతంలో రోడ్లు, రెయిలింగ్, మెట్లు నిర్మాణం చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ ప్రాంతంలో నివాసాలుండే వారికి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. మంచినీటి సమస్య లేకుండా చేయాలన్న ఆలోచనతో నాలుగు వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. 2014-19లో టీడీపీ హయాంలో ఈ ట్యాంక్ నిర్మాణానికి నిధులు కేటాయించి శంకుస్థాపన చేశామని, తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ట్యాంక్ నిర్మాణం చేయనీయకుండా అడ్డుకుందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు తిరిగి ప్రారంభించామన్నారు. డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, పాస్టర్ విజయ్ ప్రసాద్, నాగూరి సురేష్ బాబు, గద్దె రమేష్, తలారి విజయ్, దారా గోవిందు, ఇశ్రాయేలు, కె.మరియమ్మ పాల్గొన్నారు.



3వ రోజుకు నవదిన ప్రార్థనలు

గుణదల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): దేవుడికి తల్లి అయిన మరియమాత ఆధ్యాత్మిక తల్లిగా విరాజిల్లుతూ భక్తులచేత నీరాజనాలు అందుకుంటోందని అవనిగడ్డ విచారణకర్త ఫాదర్ గొట్రు సురేష్ మెరో అన్నారు. గుణదల లూర్దుమాత మహోత్సవాల నవదిన ప్రార్థనల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రార్థనలకు గొట్లు సరేష్ మరో ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన భక్తులను ఉద్దేశించి సందేశమిస్తూ భక్తులకు వరాలిచ్చే తల్లిగా ఘనతకెక్కిందన్నారు. మరియమాత ప్రార్థన సహాయం ద్వారా ఎన్నో అద్భుతాలు జరిగాయని భక్తులకు వివరించారు. 3వ రోజు నవదిన ప్రార్థన ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో పుణ్యక్షేత్ర ప్రాంగణం కిటకిటలాడింది. గురువులు గొట్రు సురేష్ మెరో, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, ఎస్ఎస్‌సీ డైరెక్టర్ తోట సునీల్ కుమార్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ కొలకాని మరియప్ప తదితర గురువులు సమష్టిదివ్యపూజాబలి సమర్పించారు. సెయింట్ పీటర్స్ కథెడ్రల్, గొల్లపూడి, రాణీగారి తోట తదితర విచారణల నుంచి భక్తులు తరలివచ్చారు.



యువకుడు ఆత్మహత్యాయత్నం

- పోలీసులకు అప్పగించిన దుర్గగుడి ఉద్యోగులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన పొట్నూరి బాలరాజు (32) కుటుంబ సభ్యులతో ఉంటూ జీడిపప్పు వ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో నష్టం వచ్చింది. తల్లిదండ్రులు ఈనెల 20న వివాహం చేయటానికి నిశ్చయించారు. అప్పుల్లో ఉన్న బాలరాజు ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని 3 రోజుల క్రితం నగరానికి వచ్చాడు. ఆదివారం ఉదయం దుర్గమ్మను దర్శించుకున్నాడు. ఇక ఆత్మహత్య చేసుకోవాలని మల్లేశ్వరస్వామి ఆలయం వద్దకు రాగా ఉద్యోగులు, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది గమనించి అవుట్‌పోస్టు పోలీసులకు అప్పగించగా, వారు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. సుమారు రూ.3కోట్లు అప్పులున్నాయని, వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టు చెప్పాడు. దీంతో పోలీసులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన గోకులం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 'ఏరువాక సాగాలో సినీ జానపద గీతాల సంగీత విభావరి' గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు.

నలందలో ఫేర్‌వెల్ వేడుకలు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఉన్న సమాజానికి, దేశానికి సేవలందించడం ద్వారా విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని నలంద విద్యాసంస్థల చైర్మన్ ఏ విజయబాబు అన్నారు. నలంద విద్యానికేతన్ సెకండరీ విభాగంలో ఆదివారం 10, 12 తరగతుల విద్యార్థులకు హ్యాపీ రిసార్ట్స్‌లో వీడ్కోలు సభ నిర్వహించారు. విద్యాభ్యాసాన్ని ముగించుకుని వెళుతున్న సీనియర్లు తమ భావోద్వేగాలను, అనుభవాలను జూనియర్లతో పంచుకున్నారు. తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ మంచి వ్యక్తిగా ఎదగడం, మంచి పౌరునిగా ఉండటం, దేశాన్ని మేల్కొవడం మన కర్తవ్యమని విద్యార్థులకు తెలిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎన్నో అద్భుత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

జిల్లా బొందిలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ధర్నాచౌక్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం నగర సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం సాయంత్రం జరిగింది. బొందిలి సామాజికవర్గ ప్రజల సమస్యల పరిష్కారం, అభివృద్ధిపై చర్చించారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. నందేటి లక్ష్మీనారాయణ సింగ్, భవానీ భాయ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా. ఉదయ్‌సింగ్ గౌతం, బొందిలి నారాయణసింగ్, ఉపాధ్యాక్షుడిగా తిలక్రాం సింగ్, కోశాధికారిగా బొందిలి మధుకిరణ్ సింగ్‌ను సంఘం ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర బొందిలి సాధికార సమితి కన్వీనర్ నందేటి చంద్రభాను సింగ్ పాల్గొన్నారు.

బాబాయిని పొడిచిన అబ్బాయి

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సోదరుల మధ్య జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారి తీసింది. సీతన్నపేట గేటు ప్రాంతంలో నివసించే నాగులపల్లి భాస్కరరావు, పవన్‌నారాయణ, రాము ముగ్గురు అన్నదమ్ములు. రాము ఇంట్లో వీరంతా ఆదివారం సాయంత్రం మద్యం సేవిస్తుండగా ఘర్షణ జరిగింది. అనంతరం ఎవరింటికి వారు వెళ్లిపోయారు. ఇంటికి వెళ్లిన నారాయణ భార్యకు చెప్పాడు. ఆమె కుమారుడైన సాయికుమార్‌కు చెప్పింది. దీంతో సాయికుమార్ అతడి స్నేహితులు భాస్కరరావు ఇంటికి వెళ్లి గొడవ పడి ఆవేశంతో బాబాయిని సాయికుమార్ కత్తితో పొడవడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భాస్కరావు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బుద్ధుడంటే జ్ఞాన సంపన్నుడు



పరదేశీబాబును సన్మానిస్తున్న సమభావన మిత్ర మండలి సభ్యులు

పటమట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బుద్ధుడంటే జ్ఞాన సంపన్నుడని అర్థమని డాక్టర్ జంద్యాల పరదేశీబాబు అన్నారు. సమభావన మిత్ర మండలి 104వ సమావేశంలో సంస్థ అధ్యక్షుడు కోనేరు నేరేంద్రబాబు అధ్యక్షతన ఆదివారం బెంజ్‌సర్కిల్ వద్ద వాసవ్య సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుడి జీవితం, బోధనల గురించి పలువురు కవులు రచించారని కానీ తెలుగులో కరుణశ్రీ జంధ్యాల పాపాయ్య శాస్త్రి రచించిన కరుణశ్రీ కావ్యం మహోన్నతమైందన్నారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. టి.శోభనాద్రి, యార్లగడ్డ రంగారావు, గుమ్మా సాంబశివరావు, డాక్టర్ జంధ్యాల శంకర్, డాక్టర్ ఎంవీ రావ్, డాక్టర్ పీ ఆర్‌కే ప్రసాద్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో భార్యభర్తలపై కేసు

విద్యాధరపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గొల్లపాలెం గట్టు, బావి ప్రాంతం వద్ద నివాసముంటున్న కనిశెట్టి లక్ష్మణరావుకు మరుపిళ్ల రవికుమార్‌తో పరిచయం ఉంది. దీంతో తాను దాచుకున్న డబ్బులతో స్థలం కొనాలని ఉన్నట్టు చెప్పాడు. దీంతో రవి కుమార్ తన భార్య పేరున మైలవరం మండలం, గణపవరం గ్రామంలో స్థలం ఉందని రూ.5లక్షలకు అమ్ముతానని చెప్పాడు. లక్ష్మణరావు అంగీకరించి 2022 జూలై 4న తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.5లక్షలను రవి భార్య విజయలక్ష్మి బ్యాంక్ ఖాతాకు బదిలీ చేశాడు. తరువాత భార్యాభర్తలిద్దరూ స్థలం రిజిస్ట్రేషన్ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారు. గట్టిగా ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారు. అంతేకాక గత ఏడాది డిసెంబరు 21న తన మోటార్ సైకిల్‌పై చిట్టినగర్ నుంచి గొల్లపూడి సాయిపురం కాలనీకి వెళుతుండగా రవికుమార్ స్నేహితులు దాడి చేసి పరారయ్యారు. ఈ సంఘటన జరిగినప్పుడు విజయలక్ష్మి సమీప దూరంలో ఉందని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 నుంచి ఏకాత్మ సభలు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11, 12, 13 తేదీల్లో తిరువూరు మండలం గోపాలపురం కమిలీబాబా ఆశ్రమంలో 764వ ఏకాత్మ తత్వ జ్ఞాన సర్వమానవ సమ్మేళన మహాయజ్ఞ సభల్లో కులమతాలకు అతీతంగా పాల్గొనాలని ఏకాత్మ విజ్ఞన సమితి అధ్యక్షుడు చిట్టూరి వెంకటేశ్వరరావు చెప్పారు. మొగల్రాజపురం ఏడో డివిజన్‌లోని కమిలీ బాబా ఆశ్రమంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ అందరికీ దేవుడు ఒక్కడే అనే నినాదంతో సర్వమానవులను ఏకం చేస్తూ వారికి జ్ఞానబోధ కలిగించాలనే లక్ష్యంతో ఏకాత్మ సిద్ధాంత స్థాపకుడు కమిలీ బాబా బోధనలు చేశారన్నారు.

ఈ సభల్లో పవిత్ర భావంతో జీవన్ముక్తిని ఆవరించేలా ప్రాణాయామం, ప్రణవ ధారణ, వ్యాయామ క్రమపార్థన, మనోమస్తిష్క వ్యాయామం, ఉపవాసం, మౌనం అనే ఆరు సూత్రాలతో సంస్కరించుకునే కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నిర్లక్ష్యపు నీడలో 9వ శతాబ్దపు రాష్ట్రకూట శిల్పాలు

- పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కర్నూల్ నగరానికి దక్షిణంగా 25 కిలోమీటర్ల దూరంలో కల్లూరు మండలం, నాయకల్లు గ్రామంలో రాష్ట్రకూటుల కాలపు (9వ శతాబ్దపు) అపురూప శిల్పాలు ఆలనాపాలన లేక ముళ్లకంచెల్లో నిర్లక్ష్యంగా పడి ఉన్నాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యానికి గురైన వారసత్వ స్థలాలు, కట్టడాలు, శాసనాలు, శిల్పాలను గుర్తించి, వాటి చారిత్రక ప్రాధాన్యత, కాపాడుకోవాల్సిన ఆవశ్యకత గురించి అవగాహన కల్పించే 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టెరిటీ' కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం నాడు నాయకల్లు గ్రామాన్ని సందర్శించి పొలాల్లో ఉన్న శిథిల శివాలయాలు, విగ్రహాలను గుర్తించారు. గ్రామానికి ఉత్తరంగా కల్లాల వద్ద ముళ్లకంచెల్లో ఉన్న రాష్ట్ర కూటుల కాలపు నిలువెత్తు ఎర్ర ఇసుకరాతి శివ ద్వారపాలుడు, నల్ల శాసనపు రాతితో చెక్కిన రెండు మహిషాసురమర్దిని శిల్పాలు, ఒక వీరగల్లు శిల్పం, ఇంకా పొలాల్లో ఉన్న శిథిల శివాలయాల పక్కన ముళ్లపొదల్లో చిక్కుకున్న అందమైన నందివిగ్రహం, 1100 ఏళ్ల నాటి చరిత్ర, సంస్కృతికి అద్దం పడుతున్నాయన్నారు. రెండు మహిషాసుర మర్దిని శిల్పాలు అలనాటి శక్తి ఆరాధనను, శత్రువులతో వీరోచితంగా పోరాడి ప్రాణాలు కోల్పోయిన వీరుడు విజయ స్వర్గాన్ని చేరుకోగా, అతడికి అప్సరసలు పరిచర్యలు చేస్తున్నట్లు తెలిపే నిలువెత్తు వీరగల్లు శిల్పం, అలనాటి వీరరాధనను తెలియజేస్తున్నాయని, చారిత్రక ప్రాధాన్యతగల ఈ కళా ఖండాలను గ్రామానికి తరలించి పీఠాలపై నిలబెట్టి కాపాడుకొని భవిష్యత్‌తరాలకు అందించాలని శివనాగిరెడ్డి గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు.



9వ శతాబ్దపు అపురూప శిల్పాలు

ఐఐటీల్లో చదివి, కెరీర్‌లో ఉన్నతంగా స్థిరపడాలని దేశంలోని చాలా మంది విద్యార్థుల కల. ర్యాంకు రాకపోయినప్పటికీ షార్ట్ టర్మ్ కోర్సులు ఆన్‌లైన్‌లో చేయడానికి అవకాశాన్ని కల్పిస్తోంది 'స్వయం' పోర్టల్. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నడిచే 'స్వయం' (https://swayam.gov.in/)లో విద్యార్థులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉపయోగపడే పలు కోర్సులు ఉన్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ వంటి ప్రతిష్ఠాత్మకమైన సంస్థలు పలు ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. డిజైన్, ఇంజనీరింగ్, సీఎస్, ఏఐ, మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల వివరాలు 'స్వయం' పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఐఐటీలు ఉచితంగా అందించే ఈ కోర్సులు తెలుసా!





గ్రాఫిక్ డిజైన్ (ఐఐటీ హైదరాబాద్): ఇది ఎనిమిది వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 17 వరకు ఇందులో ఎన్‌రోల్ చేసుకోవడానికి అవకాశం ఉంది. ఫిబ్రవరి17 నుంచి ఏప్రిల్ 11 వరకు క్లాసులు నిర్వహిస్తారు. ఎవరైనా ఇందులో ఎన్‌రోల్ చేసుకోవచ్చు.



ఇంటీరియర్ డిజైన్ (ఐఐటీ రూర్కీ): ఇంటీరియర్ డిజైన్‌కు సంబంధించిన థియరీ, ప్రాక్టీస్ అంశాలను బోధిస్తారు. ఇది ఎనిమిది వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 17 వరకు ఇందులో ఎన్‌రోల్ చేసుకోవడానికి అవకాశం ఉంది. ఫిబ్రవరి17 నుంచి ఏప్రిల్ 11 వరకు క్లాసులు నిర్వహిస్తారు. ఎవరైనా ఇందులో ఎన్‌రోల్ చేసుకోవచ్చు.



క్లౌడ్ కంప్యూటింగ్ (ఐఐటీ ఖరగ్‌పూర్): యూజీ, పీజీ స్థాయి విద్యార్థులకు ఉపయోగకరమైన కోర్సు. ఇది పన్నెండు వారాల కోర్సు. 2025 ఫిబ్రవర 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.



జావా(ఐఐటీ ఖరగ్‌పూర్): ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపయోగకరమైన కోర్సు. పన్నెండు వారాల కోర్సు ఇది. 2025 ఫిబ్రవరి 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.



పోటీపరీక్షల ఇంగ్లీష్ (ఐఐటీ మద్రాస్): ఇది పన్నెండు వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.



స్ట్రెస్, హెల్త్, వెల్ బీయింగ్ (ఐఐటీ మద్రాస్): హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, సైన్స్, ఇంజనీరింగ్ చదువుతున్న యూజీ, పీజీ విద్యార్థులకు ఇది ఉపయోగపడుతుంది.



మార్కెటింగ్‌లో ఏఐ (ఐఐటీ రూర్కీ): ఇది పన్నెండు వారాల కోర్సు. ఫిబ్రవరి 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు. మార్కెటింగ్ మేనేజ్‌మెంట్‌లో సంప్రదాయ పద్ధతులు కాకుండా ఏఐ అప్లికేషన్ ఎలా చేయాలో నేర్పిస్తారు. అండర్‌గ్రాడ్యుయేట్‌కి ఇది చాలా ఉపయోగం.



కంప్యూటర్ నెట్‌వర్క్స్, ఇంటర్‌నెట్ ప్రోటోకాల్ (ఐఐటీ ఖరగ్‌పూర్): ప్రస్తుత కంప్యూటర్ నెట్‌వర్క్ ప్రిన్స్‌పుల్స్, ఆర్కిటెక్చర్‌పై క్లాసులు ఉంటాయి. పన్నెండు వారాల కోర్సు ఇది. ఫిబ్రవరి 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.




బ్లాక్‌చైన్, దాని అప్లికేషన్స్ (ఐఐటీ ఖరగ్‌పూర్): యూజీ, పీజీ చేసేవారితో పాటు, ఇండస్ట్రీతో సంబంధం ఉన్న వారు ఫిబ్రవరి 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 11 నుంచి 12 వారాల పాటు క్లాసులు నిర్వహిస్తారు.



ఈ బిజినెస్(ఐఐటీ ఖరగ్‌పూర్): ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. 2025 ఫిబ్రవరి 3 వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు. ఏప్రిల్ 11 నుంచి 12 వారాల పాటు క్లాసులు నిర్వహిస్తారు.

దిక్సూచి
DIKSUCHI



ఇంటర్ ప్రిపరేషన్ ఇలా ప్లాన్ చేసుకోండి

పరీక్షల సమయం వచ్చేసింది. తెలంగాణలో ఇంటర్మీడియేట్ పరీక్షలకు ముప్పైరోజులు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో సరిగ్గా ఇరవై అయిదు రోజులు మాత్రమే ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి దాదాపుగా ఇరవై లక్షలమంది ఈ పరీక్షలకు హాజరుకాబోతున్నారు. జేఈఈ అనో, మరో ఎంట్రెన్స్ అనో చాలామంది విద్యార్థులు ఇప్పటి వరకు సరిగ్గా వీటిపై దృష్టిపెట్టి ఉండకపోవచ్చు. ఉన్న ఈ కొద్ది సమయాన్ని ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకుంటే పూర్తిస్థాయి మార్కులు సాధించడం కష్టం కాదు అని చెబుతున్నారు సీనియర్ అధ్యాపకులు. ప్రిపరేషన్‌ను ఎలా ప్లాన్ చేసుకుంటే బాగుంటుందో సూచిస్తున్నారు.

తెలంగాణలో ఇంటర్ పరీక్షలు 2025 మార్చి 5న మొదలు అవుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 1న ప్రారంభం అవుతున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి. ఇప్పటి వరకు జేఈఈ సిలబస్‌కు అనుగుణంగానే ముందుకు సాగి ఉంటారు. అయితే గత సంవత్సరమే ఎన్‌సీఈఆర్‌టీ కరిక్యులమ్ అనుగుణంగా జేఈఈ ఎంట్రెన్స్‌లో మార్పు చేర్పులు జరిగాయి. అంటే కొన్ని చాప్టర్లు ఎంట్రెన్స్‌లో డిలీట్ అయ్యాయి. ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు ఎంట్రెన్స్ భాగంగా వదిలేసిన ముఖ్యమైన లేదా వెయిటేజీ ఎక్కువ ఉన్న ఆ చాప్టర్లను త్వరితగతిన పూర్తి చేయాలి. వెయిటేజీకి అనుగుణంగా దానిపై శ్రద్ధ పెట్టి, ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.

1. **పూర్తి సిలబస్ అవగాహన:** పరీక్షకుముందు మొత్తం సిలబస్‌ను ఒకసారి సమీక్షించండి. ముఖ్యమైన టాపిక్స్ హైలైట్ చేసుకొని, సులభంగా గుర్తు పెట్టుకునేలా మైన్డ్ మ్యాప్స్, షార్ట్ నోట్స్ తయారు చేసుకోండి. కేవలం బ్లూప్రింట్ ఆధారంగా కాకుండా, గత మూడు సంవత్సరాల్లో అడిగిన ప్రశ్నలపై కూడా ఒకసారి దృష్టిసారించండి.
2. **క్రమబద్ధమైన టైమ్‌టేబుల్:** పరీక్షలకు సరిగ్గా ఇరవై అయిదు రోజుల నుంచి ముప్పై రోజులు ఉన్నాయి. అందుకే ప్రతిరోజూ చదివే సమయాన్ని నియంత్రించుకుని, అందులోనూ ముఖ్యమైన వాటికి ఎక్కువ సమయం కేటాయించండి. ఉదయం, సాయంత్రం సమయాలను రివిజన్‌కు స్మార్ట్‌గా ఉపయోగించుకోండి.
3. **Mock Tests & టైమ్ మేనేజ్‌మెంట్:** టైమ్ మేనేజ్‌మెంట్ మెరుగుపర్చడానికి గత సంవత్సరం ప్రశ్నాపత్రాలు, మాక్ టెస్టులు రాయడం అలవాటు చేసుకోండి. పరీక్ష సమయానికి తగినట్లుగా సమాధానాలు రాయడంలో నైపుణ్యాన్ని పెంచుకోండి.
4. **స్వీయ-అవలోకనం & తప్పులను సరిదిద్దుకోవడం:** ఏయే విషయాల్లో మీరు బలహీనంగా ఉన్నారో గుర్తించండి, వాటిపై ప్రత్యేకంగా పని చేయండి. సాధించిన పురోగతిని ప్రతి వారం సమీక్షించండి.
5. **శారీరక & మానసిక ఆరోగ్యం:** అధిక ఒత్తిడికి గురి కాకుండా మధ్యలో విరామం తీసుకోండి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, రోజూ కొంచెం అయినా వ్యాయామం చేయడం మంచిది.
6. **పరీక్షకు ముందు & పరీక్ష రోజు వ్యూహం:** చివరి రోజుల్లో కొత్త టాపిక్స్ చదవడం మానేసి, ఉన్నవి రివైజ్ చేయండి. పరీక్ష రోజు ప్రశాంతంగా ఉండండి, ప్రశ్నలను అర్థం చేసుకొని సమయపాలనతో రాయండి.

స్మార్ట్ ప్రిపరేషన్ చేసుకుంటే మీరు ఉత్తమ ఫలితాలు సాధించగలరు!

గుడ్‌లక్



డాక్టర్ పవన్‌కుమార్ కాసు
డైరెక్టర్, సంజీవని జూనియర్ కాలేజీ, హైదరాబాద్

సీబీఎస్సీ గర్ల్‌చైల్డ్ స్కాలర్‌షిప్

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 'సీబీఎస్సీ సింగిల్ గర్ల్‌చైల్డ్ స్కాలర్‌షిప్' ఫ్రెష్ అప్లికేషన్, రెన్యూవల్ అప్లికేషన్ల గడువును 2025 ఫిబ్రవరి 8 వరకు పొడిగించింది. సంస్థ వెబ్‌సైట్ నోటిఫికేషన్ ప్రకారం ఆన్‌లైన్ దరఖాస్తులను 8వ తేదీ దాకా దాఖలు చేయవచ్చు. స్కూల్ వెరిఫికేషన్‌ను ఫిబ్రవరి 15 తేదీలోగా పూర్తి చేయాలి. ఆసక్తి గల అభ్యర్థులు cbse.gov.in వెబ్‌సైట్‌కి వెళ్లి స్కాలర్‌షిప్ లింక్‌ను క్లిక్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

- 70 శాతం మార్కులతో సీబీఎస్సీ అనుబంధ పాఠశాలల్లో పదో తరగతి పూర్తిచేసి, క్లాస్ 11, 12 చదువుతున్న సింగిల్ గర్ల్ స్టూడెంట్స్ దరఖాస్తుకు అర్హులు. ఎంపికైన విద్యార్థినిలకు నెలకు వేయి చొప్పున రెండు సంవత్సరాలు ఈ ఉపకార వేతనాన్ని అందిస్తారు.

ఇగ్నోలో కొత్త కోర్సులు

అగ్రికల్చరల్ కాస్ట్ మేనేజ్‌మెంట్

ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో), ఐసీఎమ్ఏఐలు ఉమ్మడిగా 'డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ కాస్ట్ మేనేజ్‌మెంట్' కోర్సును దూరవిద్య ద్వారా అందిస్తున్నాయి. అభ్యర్థులకు స్కిల్స్‌తోపాటు ఎంటర్‌ప్రెన్యూర్ కేపబిలిటీస్ పెంచడం, కాస్ట్ మేనేజ్‌మెంట్, సప్లైచైన్ మేనేజ్‌మెంట్ తదితరాలను పెంచడం కోర్సు ఉద్దేశం. కోర్సు కాల పరిమితి సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల వరకు ఉంటుంది. పూర్తి వివరాల కోసం ఇగ్నో వెబ్‌సైట్ చూడవచ్చు.



జియో ఇన్ఫర్మేటిక్స్‌లో పీజీ డిప్లొమా

జియో ఇన్ఫర్మేటిక్స్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమాలో అడ్మిషన్స్ కోసం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ దరఖాస్తులు కోరుతోంది. లా ఎన్‌ఫోర్స్‌మెంట్, డిఫెన్స్ రంగంలో ఉన్న వారికీ ఉపయోగపడుతుంది. అలాగే ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్‌లో బోధనకు ఉపయోగపడుతుంది.
కాల పరిమితి: ఒక సంవత్సరం నుంచి మూడు సంవత్సరాలు
వయసు: ఏ వయస్సు వారైనా ఈ కోర్సులో చేరవచ్చు. **ఫీజు:** 15,700/-
అర్హత: ఏ సబ్జెక్టులతోనైనా గ్రాడ్యుయేషన్.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ప్యారడైజ్‌లోకి స్వాగతం



హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నిర్మాత చెరుకూరి సుధాకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' చిత్రం ఘన విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. మరోసారి ఇదే కలయికలో తెరకెక్కుతోన్న చిత్రం 'ది ప్యారడైజ్'. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. నాని సరికొత్త ఆహార్యంతో సిద్ధమవుతున్నారు. తాజాగా చిత్రబృందం ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రం నాకు చాలా స్పెషల్ అని అనిరుధ్ స్పందించారు. హ్యాట్రిక్ విజయాన్ని అందుకుందాం అంటూ నాని అనిరుధ్‌కు స్వాగతం పలికారు. గతంలో నాని నటించిన 'జెర్సీ', 'గ్యాంగ్‌లీడర్' చిత్రాలకు అనిరుధ్ సంగీతం అందించారు. 'ది ప్యారడైజ్' చిత్రం నాని కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. నాని మాస్ పాత్రలో అలరించనున్నారు.



థియేటర్లకు రండి... దుల్లగొట్టేద్దాం

అల్లు అరవింద్

"తండేల్ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమానికి బన్నీ రావాల్సి ఉంది. దీనికోసం విదేశాల నుంచి వచ్చాడు. కానీ సివియర్ గ్యాస్ట్రయిటీస్‌తో ఈ కార్యక్రమానికి రాలేకపోయాడు. ఇది తన మాటగా చెప్పమన్నాడు. 'తండేల్ సినిమా చాలా గొప్పగా ఉంటుంది. ఏడో తారీఖున అందరూ థియేటర్లకు రండి. దుల్లగొట్టేద్దాం. సినిమా గురించి చాలా మాట్లాడనుకున్నాను. సక్సెస్ మీట్‌లో మాట్లాడతాను' అని అల్లు అరవింద్ తెలిపారు. ఆయన సమర్పణలో బన్నీవాస్ నిర్మాతగా అక్కినేని నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకుడు. ఈ నెల 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ఆదివారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ 'నా మనసులో గీతా ఆర్ట్స్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఈసినిమా పూర్తయ్యే సమయానికి వాసు, అరవింద్ గారు లేకుండా మరో సినిమా ఎలా చేయాలా అనే భయం నాలో మొదలైంది. వారు అంతలా సపోర్ట్ చేశారు. నా మంచి కోరే వ్యక్తి చందు. సినిమాలో శ్రీకాకుళం యాసలో మాట్లాడడం సవాల్‌గా అనిపించింది. సాయిపల్లవి వ్యక్తిత్వం గొప్పది. తండేల్ సినిమా కోసం మత్స్యకార గ్రామాలకు వెళ్లి అధ్యయనం చేశాను. వాళ్లు లేకుండా 'తండేల్' సినిమా లేదు. థియేటర్స్‌లో దుల్లగొట్టేద్దాం' అన్నారు. సాయిపల్లవి మాట్లాడుతూ 'నా తోటి నటులు, సాంకేతిక నిపుణుల కష్టం వల్లే సినిమా అద్భుతంగా వచ్చింది. బన్నీ వాస్ గారు అవసరం అనుకున్నప్పుడు ఖర్చు పెట్టేందుకు వెనుకాడలేదు. నాపైన చందు పెట్టిన నమ్మకానికి ధన్యవాదాలు. చైతన్య చాలా కష్టపడ్డాడు. ఆయన బాడీలో రిథమ్ ఉంది. అద్భుతంగా డాన్స్ చేస్తారు. 'తండేల్ సినిమా ఆయన కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుంది. మా కష్టం మీ అందరికి నచ్చుతుందని ఆశిస్తున్నాను' అన్నారు. చందు మొండేటి మాట్లాడుతూ "తండేల్ రిలీజ్ తర్వాత సినిమా గురించి మాట్లాడతాను. ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

బన్నీవాస్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రమిది. చందు 'కార్తికేయ 2' తర్వాత హిందీలో అవకాశం వచ్చినా 'తండేల్' కోసం చేయలేదు. నాగచైతన్య బాగా ప్రోత్సహించారు. తండేల్‌తో ఆయన స్థాయి పెరుగుతుంది' అని చెప్పారు. దిల్ రాజు మాట్లాడుతూ 'జనవరిలో మేం హిట్ కొట్టాం, ఫిబ్రవరిలో 'తండేల్'తో మీరు హిట్ కొట్టబోతున్నారు' అన్నారు. 'మంచి ఎమోషన్స్ ఉన్న కథ ఇది. సినిమా ఘన విజయం అందుకోవాలి' అని దర్శకుడు సందీప్ రెడ్డి ఆకాంక్షించారు.

సంధ్య థియేటర్ ఘటన తర్వాత తొలిసారి బన్నీ 'తండేల్ ఈవెంట్‌కు వస్తారని అంతా భావించారు. అక్కడ ఆయన ఏం మాట్లాడతారు అనేవిషయంపై ఇండస్ట్రీ, అభిమాన వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రం గీతా ఆర్ట్స్ బేనర్‌లో తెరకెక్కడంతో ఆయన తప్పకుండా పాల్గొంటారని అంతా భావించారు. చివరకు అనారోగ్యం వల్ల బన్నీ ఈ కార్యక్రమానికి హాజరవడం లేదని అల్లు అరవింద్ ప్రకటించారు.



ఉప్పల్ స్టేడియంలో సీసీఎల్ మ్యాచ్‌లు

సీసీఎల్ (సెలబ్రిటీ క్రికెట్ లీగ్) 11వ సీజన్ ఈ నెల 8 నుంచి బెంగళూరులో ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఆదివారం తెలుగు వారియర్స్ జట్టు జెర్సీ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా తెలుగు వారియర్స్ కెప్టెన్ అఖిల్ అక్కినేని మాట్లాడుతూ 'ఇప్పటికి మేము నాలుగు సార్లు టైటిల్ గెలిచాం. ఈసారి కూడా టైటిల్ కొడతామనే నమ్మకం ఉంది. ఈనెల 14, 15 తేదీల్లో ఉప్పల్ స్టేడియంలో మా మ్యాచ్‌లు జరుగుతాయి. అందరూ వచ్చి మమ్మల్ని సపోర్ట్ చేయాలి' అని కోరారు. మూడు నెలలుగా ప్రాక్టీస్ చేస్తున్నాం, ఈ సారి కూడా కప్ కొడతాం అని సంగీత దర్శకుడు ఎస్.తమన్ చెప్పారు. సీసీఎల్ వ్యవస్థాపకుడు విష్ణువర్ధన్ ఇందూరి మాట్లాడుతూ 'సీసీఎల్ 11వ సీజన్‌కు చేరుకున్నందుకు సంతోషంగా ఉంది. ఈ టోర్నమెంట్ ప్రత్యేకమైనది' అని చెప్పారు. ఈ నెల 8న బెంగళూరులో జరిగే ఆరంభ మ్యాచ్‌లో తెలుగు వారియర్స్ జట్టు కర్ణాటక బుల్డోజర్స్‌తో పోటీపడనుంది. ఫిబ్రవరి 14న హైదరాబాద్‌లో భోజ్‌పురి దబ్బాంగ్స్‌తో, 15న చెన్నై రైనోస్‌తో తలపడనుంది. 23న సూరత్‌లో బెంగాల్ టైగర్స్‌తో ఆడుతుంది.



దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాదినేని దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'ఆకాశంలో ఒక తార'. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ పాన్ ఇండియా ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా షూటింగ్‌ను పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, అశ్వనీదత్ కెమెరా స్విచ్చాన్ చేశారు. గుణ్ణం గంగరాజు గౌరవ దర్శకత్వం వహించారు.

బాక్సర్‌గా అరుణ్ విజయ్



ధనుష్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఇడ్లీ కొట్టు'. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ సినిమా నుంచి అరుణ్ విజయ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం సోషల్‌మీడియా ద్వారా విడుదల చేసింది. అరుణ్ విజయ్ ఇందులో బాక్సర్‌గా కనిపిస్తున్నారు. ఏప్రిల్ 10న సినిమా విడుదలవుతోంది. నిత్యామీనన్ కథానాయికగా నటిస్తున్నారు. 'తిరుచిత్రంబలం' సినిమా తర్వాత ధనుష్, నిత్య కలసి నటిస్తున్న చిత్రమిది. ప్రకాశ్ రాజ్, షాలినీ పాండే కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా, 2017లో విడుదలైన 'పా పాండి' సినిమాతో దర్శకుడిగా మారారు ధనుష్. ఇటీవలే ధనుష్ నటించిన 50వ చిత్రం 'రాయన్' కూడా ఆయన దర్శకత్వంలోనే తెరకెక్కి ఘన విజయం సాధించింది. అలాగే 'జాబిలమ్మ నీకు అంత కోపమా' అనే చిత్రానికి కూడా ధనుష్ దర్శకత్వం వహిస్తున్నారు.

నాతో మీకేంటి ప్రాబ్లమ్



షాహిద్ కపూర్, పూజా హెగ్డే జంటగా నటించిన బాలీవుడ్ చిత్రం 'దేవా' ఇటీవలె విడుదలై పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఇందులో పూజాకు ఇబ్బందికర ప్రశ్నలు ఎదురయ్యాయి. 'మీరు స్టార్ హీరోల సినిమాలను మాత్రమే ఎంచుకుంటున్నారు, మిగతా సౌత్ హీరోయిన్లకు అవకాశం దక్కడం లేదు' అని పాత్రికేయులు ప్రశ్నించగా 'స్టార్ హీరోలతో నటించే అర్హత నాకుంది. వాళ్ల సినిమాల్లో ఎంపిక చేసుకుంటున్నారంటే... అందుకు నేను అర్హురాలినే కదా... కష్టపడితేనే అదృష్టం వస్తుందంటారు. నా విషయంలోనూ అదే జరిగిందని అనుకుంటా' అని బదులిచ్చారు. 'మీరు బాలీవుడ్‌లో అడుగుపెట్టి చాలా కాలమే అయ్యింది. ఎందరో స్టార్ హీరోలతో నటించారు. కానీ అందులో ఒక్క మూవీ కూడా హిట్ కాలేదు. అయినా స్టార్ హీరోల సరసన నటించే అవకాశం ఎలా వస్తోంది' అని అడిగిన ప్రశ్నకు 'నాతో మీకేంటీ ప్రాబ్లమ్' అంటూ మీడియాపై పూజా హెగ్డే ఆగ్రహం వ్యక్తం చేశారు.

మా కాలేజీని సందర్శించండి



విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలను సందర్శించాలని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాను టీడీపీకి చెందిన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆహ్వానించారు. ఆదివారం చెన్నైలోని ఇళయరాజా నివాసానికి వెళ్లిన అప్పలనాయుడు... మహారాజా సంగీత, నృత్య కాలేజీ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఇళయరాజాను సత్కరించి, 'ది లాస్ట్ మహారాజా ఆఫ్ విజయనగరం' పేరుతో ముద్రించిన పీవీజీ రాజు జీవిత చరిత్రను వివరించే పుస్తకాన్ని బహూకరించారు.


చెన్నై (ఆంధ్రజ్యోతి)

కన్నీళ్లు పెట్టుకున్న సోనమ్



బాలీవుడ్ నటి సోనమ్ కపూర్ ఓ ఫ్యాషన్ షోలో ర్యాంప్ వాక్ చేస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ రోహిత్ బాల్‌కు నివాళిగా ముంబైలో ఫ్యాషన్ షో ఏర్పాటు చేశారు. షోలో ర్యాంప్ వాక్ చేసిన అనంతరం రోహిత్ బాల్‌ను గుర్తు చేసుకుంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. రోహిత్ బాల్‌తో సోనమ్ కపూర్‌కి మంచి అనుబంధం ఉంది. ఆయన డిజైన్ చేసిన దుస్తులను సోనమ్ ఎక్కువగా ఇష్టపడేవారు. వీటిని ధరించే ఆమె అనేక షోల్లో ర్యాంప్ వాక్ చేశారు. ఏ ఫంక్షన్‌కి వెళ్లినా సోనమ్ ఎక్కువగా రోహిత్ బాల్ డిజైన్ చేసిన దుస్తులనే ధరించేవారు. కాగా, ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ముందు సోషల్ మీడియాలో ఆమె ఓ పోస్టు పెట్టారు. భారతీయ ఫ్యాషన్ డిజైన్ రంగాన్ని రోహిత్ బాల్ ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారని, ఆయన్ని గుర్తు చేసుకుంటూ ర్యాంప్ వాక్‌పై అడుగు పెట్టడం భావోద్వేగంగా ఉందంటూ సోనమ్ పేర్కొన్నారు.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
కిండా ప్రెగ్నెంట్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 04
సెలబ్రిటీ బేర్ హంట్	రియాలిటీ సిరీస్	ఫిబ్రవరి 05
ప్రిజన్ సెల్ 211	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 05
ఆపిల్ సైడర్ వెనిగర్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 06
కస్సాండ్రా	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 06
ది గ్రేటెస్ట్ రైవల్రీ	డాక్యు సిరీస్	ఫిబ్రవరి 07
అమెజాన్ ప్రైమ్		
ఇన్‌విన్సిబుల్	యానిమేషన్ సిరీస్	ఫిబ్రవరి 06
ది మెహతా బాయ్స్	హిందీ చిత్రం	ఫిబ్రవరి 07
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
కోబలి	తెలుగు సిరీస్	ఫిబ్రవరి 04
జీ 5		
మిసెస్	హిందీ చిత్రం	ఫిబ్రవరి 07
ఆపిల్ టీవీ ప్లస్		
లవ్ యూ టూ డెత్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 05
సోనీ లివ్		
బడా నామ్ కరేంగే	హిందీ చిత్రం	ఫిబ్రవరి 06
ఆహా...		
మద్రాస్‌కారన్	తమిళ చిత్రం	ఫిబ్రవరి 07

పైథానీకి పూర్వ వైభవం

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సవ్యసాచి ముఖర్జీ ఇటీవల నిర్వహించిన వేడుకల్లో... బరోడా రాణి రాధిక రాజే గైక్వాడ్ తళుక్కుమన్నారు. ఈ వేడుకల్లో ఆమె కట్టుకున్న నలుపు రంగు పైథానీ చీర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెడలో వేసుకున్న పొడవైన హారాల సెట్ చీర అందాన్ని ద్విగుణీకృతం చేసింది. దీనికి హుందాతనం తోడై రాజరికదర్పంతో వేడుకల్లో వెలిగిపోయారు రాధిక రాజే.



ఏమిటీ చీర గొప్పదనం?

రాధిక రాజే కట్టుకున్నది వందేళ్లనాటి కాటన్ పైథానీ నౌవరీ చీర. అంతేకాదు మహారాష్ట్ర రాజకుటుంబీకుల సంప్రదాయ వస్త్రం. తొమ్మిది గజాల ఈ చీర కొంగు, అంచులని స్వచ్ఛమైన బంగారంతో తయారు చేశారు. చీర మొత్తాన్ని నూలు దారాలు ఉపయోగించి మగ్గంపై నేశారు. మహారాష్ట్ర ఔరంగాబాద్‌లోని పైథానీ పట్టణంలోని చేనేత కళాకారులు వీటిని రూపొందిస్తారు. ఆ ప్రాంతం పేరుతోనే పైథానీ చీరలుగా ఇవి ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. వీటిల్లో పట్టు చీరలది ప్రత్యేక స్థానం. ఈ పైథానీ నేత కళ శతాబ్దాల నాటిది. నాణ్యమైన రంగురంగుల దారాలను బంగారు లేదా వెండి పోగులతో కలిపి చీరను నేస్తారు. ఏ రెండు పైథానీ చీరలు కూడా ఒకే రకంగా ఉండవు. వేటికవే వైవిధ్యంగా ఆకట్టుకొంటాయి. అందుకే ఇవి దేశంలోనే అత్యంత ఖరీదైన చీరలుగా పేరు పొందాయి.

ఆమె ఖాతా... చీరల నిధి

రాధిక రాజేకి భారతీయ వారసత్వ చీరలంటే ఎంతో ఇష్టం. ఆమె వద్ద చారిత్రక నేపథ్యంతో ముడిపడిన పురాతన కాలం చీరలు చాలా ఉన్నాయి. వాటి గురించి తెలుసుకోవాలంటే ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరిస్తే చాలు... అక్కడ అపురూపమైన చీరల నిధిని చూడవచ్చు. ఆమె ప్రత్యేకమైన చీర ధరించినప్పుడల్లా ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు షేర్ చేయడమే కాదు... ఆ చీర ప్రత్యేకత, ఎవరు బహూకరించారు తదితర అంశాలన్నీ వివరిస్తారు. సవ్యసాచి ముఖర్జీ ఫ్యాషన్ రంగంలోకి అడుగుపెట్టి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఉత్సవంలో రాధిక పాల్గొన్నారు. ఆ ఫొటోలతోపాటు మరొక ఫొటో కూడా ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఇందులో ఆమె అందమైన గులాబీ రంగు చీరతోపాటు ఆకుపచ్చని జాకెట్ ధరించారు. ఈ సందర్భంగా తన మనసులోని భావాన్ని ఇలా రాసుకున్నారు... "ఇది తొమ్మిది గజాల జరీ కాటన్ పైథానీ చీర. ఈ అందమైన తొమ్మిది గజాల చీర మొత్తం జరీ పువ్వులతో నిండి ఉంది. చీరకు జతగా యాంటిక్ ఫ్రెంచ్ బ్రోకేడ్ బ్లౌజ్ వేసుకున్నా! ఈ చీర భారతదేశ వస్త్ర వారసత్వానికి ప్రతీక. ఇండోర్ మహారాణి సంయోగిత రాజే ఇలాంటి చీరలు కట్టుకునేవారు. ఈ చేనేత సంప్రదాయ కళ ఇకపై కూడా కొనసాగాలని కోరుకుంటున్నా! నాజూగ్గా ఉంటూ అందమైన పువ్వులు, జరీ మోటిఫ్‌లతో నిండిన టిష్యూ, షిఫాన్, కాటన్, చందేరీ సిల్క్ చీరలను మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం నౌవరీ (తొమ్మిది గజాలు) చీరలను ఎవరూ కొనడం లేదు. వీటిని ఎక్కువగా అమ్మమ్మలు, బామ్మలు లేదంటే పనివాళ్లు, మత్స్యకారులు కట్టుకుంటున్నారు. వీటికి పూర్వ వైభవం తెచ్చేందుకే ఈ ప్రయత్నం."

గతంలో కూడా...

రాధిక రాజే ఈ నలుపు రంగు కాటన్ పైథానీ చీరని గతంలో కూడా ఓసారి ధరించారు. అప్పట్లో ఓ మ్యాగజైన్ కవర్ షూట్ నిమిత్తం ఆమె ఈ చీర కట్టుకుని దిగిన ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేశారు. ఈ చీర గురించి చెబుతూ ఇది అత్యంత అరుదైన చీర అనీ, తనకు చాలా ప్రీతిపాత్రమైనదనీ, ఇలాంటి చీరలు ప్రస్తుతం లభ్యం కావట్లేదనీ వివరించారు.

పారేయక్కర్లేదు మళ్లీ వాడుకోవచ్చు!

మహిళలు తరచూ తేలికపాటి మేకప్ వేసుకుంటూ ఉంటారు. ఒక్కోసారి లిప్‌స్టిక్ విరిగిపోతుంటుంది. నెయిల్ పాలిష్ లాంటివి పాడారిపోతుంటాయి. కొన్ని చిట్కాలతో వీటిని సరిచేసి చక్కగా ఉపయోగించుకోవచ్చు. ఆ వివరాలు...

మస్కారా



- కళ్లకు మస్కారా వేసుకునేటప్పుడు బాటిల్‌ను తెరచి ఉంచాల్సి వస్తుంది. ఆ కారణంగా మస్కారా తేమను కోల్పోయి గట్టిపడుతుంది. అలాంటప్పుడు మస్కారా బాటిల్‌లో మూడు చుక్కల బాదం నూనె వేసి కలపాలి. రెండు గంటల తరవాత చిక్కని ద్రవంలా మారి మస్కారా వేసుకోవడానికి అనువుగా ఉంటుంది.

నెయిల్ పాలిష్



- సీసా మూత ఎంత గట్టిగా బిగించినప్పటికీ నెయిల్ పాలిష్ తడారిపోయి గట్టిపడుతుంటుంది. అలాంటప్పుడు సీసాలో నాలుగు చుక్కల నెయిల్ పాలిష్ రిమూవర్ వేసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత నెయిల్ పాలిష్ ద్రవరూపంలోకి వచ్చి కొత్తదానిలా మెరుస్తుంది.

కాంపాక్ట్ పౌడర్



- కాంపాక్ట్ పౌడర్‌ను కొంతకాలం వాడిన తరవాత పొడిబారి బాక్స్‌లోనే ముక్కలుగా విరిగిపోతుంటుంది. వీటి మీద కొద్దిగా రబ్బింగ్ ఆల్కహాల్ రాసి దగ్గరగా చేరిస్తే చాలు. అయిదు నిమిషాల్లో ముక్కలన్నీ చక్కగా అతుక్కుంటాయి. కాంపాక్ట్ మృదువుగా మారి పఫ్‌తో అద్దడానికి వీలుగా తయారవుతుంది.

పాలలో కల్తీని ఇలా గుర్తించండి!

పాలు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. కానీ పాలలో కల్తీ కారణంగా అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముంది. కొన్ని చిట్కాల ద్వారా పాలలో కల్తీని గుర్తించవచ్చని నిపుణులు చెబుతున్నారు.



- పాలను బాగా కాచిన తరవాత తాగితే నాలుక మీద తీయని రుచి నిలిచినట్లయితే అవి స్వచ్ఛమైనవని చెప్పవచ్చు. ఏ రకంగా కల్తీ చేసినా పాలు నామమాత్రపు చేదు రుచిలో ఉంటాయి.
- పాలలో నీరు కలిపిందీ లేనిదీ సులభంగా గుర్తించవచ్చు. ఏటవాలుగా ఉన్న ప్రదేశంపై పాల చుక్క వేయాలి. అది మెల్లగా కదులుతూ తెల్లని గీతని వదిలితే అవి స్వచ్ఛమైన పాలని చెప్పవచ్చు. అదే పాల చుక్క వేగంగా కిందికి జారితే నీళ్లు కలిపినట్లే!
- అరగ్లాసు పాలలో అరగ్లాసు నీళ్లు పోసి వేగంగా కలపాలి. ఇలా కలుపుతున్నప్పుడు దట్టంగా నురుగు కనిపిస్తే పాలలో వాషింగ్ పౌడర్ లేదా డిటర్జెంట్ పౌండర్ కలిపినట్లు గుర్తించవచ్చు.
- అరగ్లాసు పాలలో రెండు చెంచాల అయోడైజ్డ్ ఉప్పు వేసి బాగా కలపాలి. పాలు నీలం రంగులోకి మారితే అందులో మైదా లేదంటే వేరే ఏదైనా పిండిని కలిపినట్లు తెలుసుకోవచ్చు.
- పావు గ్లాసు నీళ్లను బాగా వేడి చేసి అందులో అయిదు చుక్కల టించర్ అయోడిన్ కలపాలి. ఈ నీళ్లను పావు గ్లాసు పాలలో కలపాలి. వెంటనే పాలు నీలం రంగులోకి మారినట్లయితే గంజి పొడి కలిపినట్లు తెలుసుకోవచ్చు.
- పావు గ్లాసు పాలలో ఒక చెంచా సోయాబీన్ పొడిని కలపాలి. దీనిలో ఎరుపు రంగు లిట్మస్ పేపర్‌ను ఉంచి పరీక్షించాలి. అది నీలం రంగులోకి మారినట్లయితే పాలలో యూరియా కలిపినట్లు గుర్తించవచ్చు.
- బజార్లో దొరికే పీహెచ్ పట్టీని తీసుకు వచ్చి దానిపై ఒక పాల చుక్క వేయాలి. పీహెచ్ నిష్పత్తి 6.4 నుంచి 6.6 మధ్య ఉంటే ఆ పాలు స్వచ్ఛమైనవని చెప్పవచ్చు. అంతకన్నా ఎక్కువ లేదా తక్కువ ఉన్నట్లయితే పాలలో కల్తీ జరిగిందని గుర్తించాలి.

బిజినెస్

23,800 పైన బుల్లిష్

(ఫిబ్రవరి 3-7 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ స్ట్రాటజీ

గత వారం నిఫ్టీ : 23,482 (+390)

నిఫ్టీ గత వారం 23,623-22,977 పాయింట్ల మధ్యన కదలాడి 390 పాయింట్ల లాభంతో 23,842 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,800 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,405, 23,194, 23,205, 23,441 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,800 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,200

నిరోధ స్థాయిలు: 23,700, 23,800, 23,900 (23,600 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23,300, 23,200, 23,100 (23,400 దిగువన బేరిష్)

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	119
వరంగల్	103	గుంటూరు	112
కరీంనగర్	103	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	87
కర్నూలు	103	నెల్లూరు	92
విశాఖపట్నం	111	అనంతపురం	92
గోదావరి	119		

చెల్లింపులకు కొత్త యూపీఐ వ్యవస్థ: సెబీ

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ చెల్లింపుల్లో జరిగే మోసాలు, అక్రమాలకు చెక్ పెట్టేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సిద్ధమవుతోంది. ముఖ్యంగా మదుపరులు మార్కెట్ ఇంటర్మీడియరీలకు చేసే చెల్లింపులను మరింత సురక్షితం చేయాలని భావిస్తోంది. ఇందుకోసం ఆయా సంస్థల ప్రత్యేక గుర్తింపుతో కూడిన యూపీఐ చెల్లింపుల వ్యవస్థను తీసుకురావాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఒక చర్చా పత్రాన్ని విడుదల చేసింది. మార్కెట్ వర్గాలు ఈ నెల 21లోగా ఈ చర్చా పత్రంపై తమ అభిప్రాయాలు తెలియజేయాలని సెబీ కోరింది. ఈ విధానం అమల్లోకి వస్తే తాము నిజమైన క్యాపిటల్ మార్కెట్ మధ్యవర్తి సంస్థకు చెల్లిస్తున్నామా? లేక నకిలీ సంస్థకు చెల్లిస్తున్నామా? అనే విషయాన్ని మదుపరులు ఎవరికి వారు స్వయంగా తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. కొత్త విధానంలో యూపీఐ రోజువారీ చెల్లింపుల పరిమితి ప్రస్తుత రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెరుగుతుంది. ఎన్‌పీసీఐతో చర్చించి ఎప్పటికప్పుడు ఈ పరిమితిని అవసరాన్ని బట్టి పెంచుతారు.

ఇక జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ !




న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్లనీ హేతుబద్ధీకరించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఇందుకోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభమైనట్లు అధికార వర్గాలు చెప్పాయి. రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన మంత్రుల బృందం (జీఓఎం) దీనిపై ఇప్పటికే కసరత్తు చేస్తోంది. తాజా కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ.12 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉండే వ్యక్తులకు పూర్తి పన్ను మినహాయింపు ప్రకటించారు. దాంతో పాటు వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుల భారం తగ్గేలా పన్నుల శ్లాబులనీ సవరించారు. జీఎస్‌టీ రేట్ల హేతుబద్ధీకరణ విషయంలోనూ ఇదే పద్ధతి అనుసరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. అయితే ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలను కూడా కలుపుకోవాలని యోచిస్తున్నట్టు భావిస్తున్నారు. త్వరలో జరిగే జీఎస్‌టీ మండలి సమావేశం ఇందుకు వేదిక అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల జీఎస్‌టీ ఆదాయాలకు గండి పడకుండా, మధ్య తరగతి ప్రజలపై పన్ను పోటు తగ్గేలా ఈ హేతుబద్ధీకరణ ఉండాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

ఎయిరిండియా 'నమస్తే వరల్డ్' ఆఫర్

రూ.1,499కే విమాన టికెట్

న్యూఢిల్లీ: ఎయిరిండియా "నమస్తే వరల్డ్" పేరిట ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రకటించింది. అన్ని రకాల క్లాస్‌లకు ఇది వర్తిస్తుంది. శనివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన ఈ టికెట్ల విక్రయం గురువారం అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉంటుంది. ఈ టికెట్లపై కస్టమర్లు ఫిబ్రవరి 12వ తేదీ నుంచి అక్టోబరు 31వ తేదీ మధ్యలో తమకు అనుకూలమైన ఏ తేదీల్లో అయినా ప్రయాణించవచ్చు. విదేశీ గమ్యాలను ఎంచుకునే వారు విదేశీ కరెన్సీలో కూడా చెల్లింపులు చేయవచ్చు. దేశీయంగా ఎకానమీ క్లాస్ ధర రూ.1,499, ప్రీమియం ఎకానమీ ధర రూ.3,749, బిజినెస్ క్లాస్ ధర రూ.9,999గా నిర్ణయించారు. అలాగే అంతర్జాతీయ గమ్యాలకు ఎకానమీ క్లాస్ రూ.12,577, ప్రీమియం ఎకానమీ క్లాస్ రూ.16,213, బిజినెస్ క్లాస్ ధర రూ.20,870గా ప్రకటించింది.

నిస్సాన్ ఎగుమతుల కేంద్రంగా భారత్


ఫ్రాంక్ టోరెస్

న్యూఢిల్లీ: జపాన్ ఆటో దిగ్గజం నిస్సాన్‌కు ప్రపంచంలో ప్రధాన ఎగుమతి కేంద్రాల్లో ఒకటిగా బ్రిటన్ సరసన భారత్ చేరుతోంది. కాంపాక్ట్ ఎస్‌యూవీ మాగ్నైట్ లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ (ఎల్‌హెచ్‌డీ) కార్లను భారత్ నుంచి కొత్త దేశాలకు ఎగుమతి చేయడం కంపెనీ ప్రారంభించింది. ప్రస్తుతం 20 దేశాలకు కార్లు ఎగుమతి చేస్తున్న నిస్సాన్ ఇండియా తాజాగా ఆ దేశాల సంఖ్యను 45కి విస్తరించింది. తాము అనుసరిస్తున్న "ఒక కారు, ఒక ప్రపంచం" వ్యూహంలో భాగంగానే మాగ్నైట్ ఎల్‌హెచ్‌డీ ఎగుమతులకు భారత్‌ను కేంద్రంగా చేసుకున్నామని నిస్సాన్ ఇండియా ఆపరేషన్స్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ టోరెస్ అన్నారు.

భారత్‌కు గల సామర్థ్యాలకు కూడా ఇది నిదర్శనమని చెప్పారు. ఈ నెలలో పశ్చిమాసియా, ఉత్తర అమెరికా, ఆసియా పసిఫిక్ దేశాలకు 2,000 యూనిట్లు ఎగుమతి చేయడంతో పాటు మెక్సికో సహా లాటిన్ అమెరికా మార్కెట్లకు 5,100 ఎల్‌హెచ్‌డీ మాగ్నైట్ కార్లు ఎగుమతి చేయాలని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. నిస్సాన్, హోండా కంపెనీలు విలీనం అయినంత మాత్రాన భారత మార్కెట్ కోసం తాము ప్రకటించిన కొత్త ఉత్పత్తుల ప్రణాళికల్లో ఎలాంటి మార్పు ఉండబోదని టోరెస్ స్పష్టం చేశారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	500
వరంగల్	462	గోదావరి	465
చిత్తూరు	533	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 72	

బడ్జెట్‌తో తగ్గిన నిబంధనల భారం

ఊపిరి పీల్చుకుంటున్న కంపెనీలు

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ మధ్యతరగతితో పాటు కార్పొరేట్ రంగాన్నీ మెప్పిస్తోంది. ఈ బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అనేక పన్ను సంస్కరణలు ప్రవేశ పెట్టారు. టీడీఎస్‌తో పాటు టీసీఎస్ చెల్లింపులను సులభతరం చేశారు. స్టార్టప్ కంపెనీలకూ పన్ను విరామాలు ప్రకటించారు. ఈ చర్యలతో సులభతర వాణిజ్యం మరింత ఊపందుకుంటుందని కార్పొరేట్ రంగం అంచనా. కార్పొరేట్ రంగానికి సంబంధించి తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం చేసిన మార్పులు ఏమిటంటే..

- స్టార్టప్ కంపెనీలకు తొలి 10 ఏళ్లలో మూడేళ్ల పాటు ట్యాక్స్ బ్రేకప్‌లు లభిస్తాయి.
- విలీనాలతో ఏర్పడే కొత్త కంపెనీలకు మాత్రమే మిగతా కాలానికి.. గత నష్టాలను క్యారీ ఫార్వర్డ్ సదుపాయం లభిస్తుంది.
- అద్దెలు, టెక్నికల్ సర్వీసులపై చెల్లించే టీడీఎస్/టీసీఎస్ కనీస పరిమితులు పెంచారు. దీంతో కంపెనీలకు చిన్న చిన్న లావాదేవీలపై కంప్లయన్స్ భారం తగ్గింది.
- వస్తువుల అమ్మకాల విలువ రూ.50 లక్షలు మించినప్పుడు చెల్లించే టీడీఎస్, టీసీఎస్ మొత్తాన్ని 0.1 శాతానికి పరిమితం చేశారు.
- జీఎస్‌టీ రిటర్న్‌లు ఫైల్ చేయని వారిపై విధించే అదనపు 20 శాతం టీడీఎస్/టీడీఎస్‌ను రద్దు చేశారు.
- టీసీఎస్ చెల్లింపులు ఆలస్యమైనా రిటర్న్‌లు సకాలంలో ఫైల్ చేసే కంపెనీలు, వ్యాపార సంస్థలపై ఇక కేసులు నమోదు చేయరు.
- అప్‌డేటెడ్ ట్యాక్స్ రిటర్న్‌లు ఫైల్ చేసే గడువు. రెండేళ్ల నుంచి నాలుగేళ్లకు పెంపు. కాకపోతే మూడో సంవత్సరంలో ఫైల్ చేస్తే 60 శాతం, నాలుగో ఏడాది ఫైల్ చేస్తే 70 శాతం అదనంగా చెల్లించాలి.
- కంపెనీలు ఒకే ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ విధానాన్ని మూడేళ్ల వరకు కొనసాగించవచ్చు. దీంతో రిలేటెడ్ పార్టీ లావాదేవీలతో ఏర్పడే వివాదాలు తగ్గుముఖం పడతాయని భావించవచ్చు.
- కేసు ప్రొసీడింగ్స్ ప్రారంభమైన ఆరు నెలల లోపు పన్ను వసూలు అధికారులు పెనాల్టీ ఆర్డర్లు పాస్ చేయాలి.
- భారత ఎలక్ట్రానిక్ కంపెనీలకు సాంకేతిక సేవలు అందించే విదేశీ సంస్థలు, వ్యక్తులు ఇక తమ మొత్తం ఆదాయంలో 25 శాతం పన్నుగా చెల్లిస్తే సరిపోతుంది.

అనిశ్చితికి తెర!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం రేంజ్ బౌండ్ నుంచి లాభాల్లో చలించే అవకాశం ఉంది. యూఎస్ ఫెడ్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్ వడ్డీ రేట్ల అంశం ముగిసింది. తాజాగా మోదీ సర్కార్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. దీంతో మార్కెట్లలో అనిశ్చితికి తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇకపై జియో పొలిటికల్ పరిస్థితులు, ట్రంప్ టారిఫ్‌సు బట్టి మార్కెట్లు కదలాడొచ్చు. బడ్జెట్ నేపథ్యంలో ఫైనాన్స్, డిఫెన్స్, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇన్‌ఫ్రా, అగ్రి షేర్లు పుంజుకునే అవకాశం ఉంది. ఫియర్ ఇండెక్స్ విక్స్ మళ్లీ 15 శాతం దిగువకు చేరింది.

స్టాక్ రికమండేషన్స్

ఫీనిక్స్ మిల్స్: ఈ షేరు ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తోంది. మంచి రివార్డు రేషియోతో దొరుకుతున్నాయి. తాజా ఆర్థిక ఫలితాలు బాగానే ఉన్నాయి. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. చివరి ఆరు సెషన్లలో ఈ షేరు 21 శాతం మేర లాభపడటం గమనార్హం. గత శనివారం రూ.1,764 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,950/2,000 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,650 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కావేరీ సీడ్స్: జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ కౌంటర్‌లో 32 శాతం మేర దిద్దుబాటు జరిగింది. కొన్ని నెలల సుదీర్ఘ కన్సాలిడేషన్ తర్వాత చక్కని మూమెంటమ్ ప్రదర్శిస్తోంది. నిఫ్టీతో పోలిస్తే జోరు కనబరుస్తోంది. ప్రస్తుతం ఆకర్షణీయమైన జోన్‌లో లభిస్తోంది. గత శనివారం రూ.965 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.940 శ్రేణిలో ప్రవేశించి రూ.1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.910 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కార్ ట్రేడ్: నష్టాల మార్కెట్లు ఈ షేరు పటిష్ఠతను ప్రదర్శించింది. డిసెంబరు త్రైమాసిక ఫలితాల తర్వాత మెరుగైన వాల్యూమ్‌తో పుంజుకుంది. ఐపీఓ గరిష్ఠ స్థాయిని బ్రేక్ చేసి నిలదొక్కుకుంది. ఈపీఎస్, నికర లాభం పెరగటం సానుకూల అంశాలు. గత శనివారం ఈ షేరు రూ.1,766 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇమామీ లిమిటెడ్: తృతీయ త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉండటంతో ఈ షేరు టర్న్ అరౌండ్ అయ్యింది. జీవిత కాల గరిష్ఠం నుంచి 40 శాతం పతనమైన ఈ షేరు చివరి ఏడు సెషన్లలో 17 శాతం మేర పెరిగింది. గత శనివారం రూ.625 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.610 వద్ద పొజిషన్ తీసుకుని రూ.740 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.575 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హీరో మోటో: జీవితకాల గరిష్ఠం నుంచి 35 శాతం మేర పతనమైన ఈ షేరు ప్రస్తుతం ఆకర్షణీయమైన జోన్‌లో దొరుకుతున్నాయి. కీలకమైన రూ.4,000 స్థాయిలో మద్దతు లభించటంతో టర్న్ అరౌండ్ అయ్యింది. ఆర్థిక ఫలితాల విడుదల సమీపిస్తుండటంతో చివరి ఐదు సెషన్ల నుంచి లాభాల్లోనే ముగుస్తున్నాయి. గత శనివారం రూ.4,402 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.4,375 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.4,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,325 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ — కన్సాలిడేషన్ అవకాశం


వి. సుందర్ రాజా

గత నాలుగు నెలలుగా నిరంతర డౌన్‌ట్రెండ్‌లో ఉన్న నిఫ్టీ 23,500 వద్ద మద్దతు తీసుకుంది. టెక్నికల్‌గా ఈ రికవరీతో తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పు నుంచి బయటపడింది. అయితే శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో అప్రమత్త ట్రెండ్ కారణంగా ఈ వారంలో అప్రమత్తంగా ప్రారంభం కావచ్చు. 23,600 వద్ద నిఫ్టీ నిరోధం ఎదుర్కొంటోంది.

బుల్లిష్ స్థాయిలు: ప్రస్తుత స్థాయిలో కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. పాజిటివ్ ట్రెండ్ ప్రదర్శించినట్టయితే రాబోయే కొద్ది రోజుల్లో ప్రధాన నిరోధం 23,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మరో ప్రధాన నిరోధం, టార్గెట్ 24,000.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 23,300 వద్ద విఫలమైతే మైనర్ బలహీనత ఎదుర్కొంటుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,000. ఈ స్థాయి ప్రస్తుతం కొంత దూరంగా ఉన్నందు వల్ల సాధారణ పరిస్థితుల్లో ఎలాంటి తక్షణ ప్రమాదం లేదు.

బ్యాంక్ నిఫ్టీ: మరింత రికవరీ బాట పడితే స్వల్పకాలిక పాజిటివ్ ధోరణి కోసం ఈ సూచీ ప్రధాన నిరోధం 50,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 49,000. ఈ స్థాయిలో నిలదొక్కుకోలేకపోతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 10 వారాల చలన సగటు స్థాయి, 50 డీఎంఏ వద్ద నిలిచి ఉంది. ఇక్కడ నిలదొక్కుకోవాలి. అలాగే సానుకూల ట్రెండ్ ప్రదర్శించాలంటే 23,600 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,530, 23,600
మద్దతు	22,370, 22,300

స్ఫూర్తిదాయకం..

'మన నారీశక్తికిది గర్వకారణం. ప్రపంచకప్ సాధించిన భారత జట్టుకు అభినందనలు. మనోళ్ల సమష్టి కృషి, పట్టుదల, అంకితభావానికి ఫలితమే ఈ అద్భుత విజయం. ఇలాంటి ప్రదర్శనలు వర్తమాన అథ్లెట్లకు స్ఫూర్తిదాయకం. మన జట్టు ఇదే జోరును భవిష్యత్‌లోనూ కొనసాగించాలని కోరుకుంటున్నా'
- ప్రధాని నరేంద్ర మోదీ

'ప్రపంచ చాంపియన్లకు హృదయపూర్వక అభినందనలు. మీ కృషి, పట్టుదలను చూసి దేశం గర్విస్తోంది'
- కేంద్ర క్రీడా మంత్రి మాండవ్య

'టోర్నీ తొలి మ్యాచ్ నుంచి ఫైనల్ దాకా మనోళ్లు నిజమైన చాంపియన్లుగా ఆడారు. విజయం ప్రత్యేకమే, కానీ టైటిల్ నిలబెట్టుకోవడం అసాధారణం. మరోసారి ప్రపంచ కప్ నెగ్గిన మన జట్టుకు అభినందనలు. ఈ టీమ్ భవిష్యత్‌లో మరిన్ని అద్భుతాలు సృష్టించగలదు'
- సచిన్ టెండూల్కర్

'ప్రపంచకప్ విజయం యావత్ దేశానికి గర్వకారణం. ఈ ప్రదర్శనలో తెలుగమ్మాయి గొంగడి త్రిష కీలకపాత్ర పోషించడం మరింత ప్రత్యేకతను తెలియజేస్తుంది'
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

'వరుసగా రెండోసారి ప్రపంచకప్ నెగ్గడం భారత ప్రతిభను చాటి చెబుతోంది.'
- బీసీసీఐ

'ఈ ప్రదర్శనతో భారతావని మురిసిపోతోంది. బంగారు తరం వచ్చేసింది'
- మిథాలీ రాజ్

బోర్డు నజరానా రూ. 5 కోట్లు

వరుసగా రెండోసారి అండర్-19 టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. భారత జట్టులోని సభ్యులతో పాటు సహాయ సిబ్బందికి కలిపి రూ. 5 కోట్లు రివార్డుగా అందజేయనున్నట్టు బోర్డు ఆదివారం ప్రకటించింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులను బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ ప్రశంసించారు. యువ భారత్ అద్భుత ఆటతీరు గురించి బీసీసీఐ అవార్డుల కార్యక్రమంలో మాట్లాడుకున్నామనీ, ఆ మరుసటిరోజే జట్టు ప్రపంచకప్ సాధించడం సంతోషంగా ఉందని బిన్నీ అన్నారు.





అవార్డు నాన్నకు అంకితం

స్కాట్లాండ్‌పై అజేయ సెంచరీ (110 నాటౌట్)తో ఆల్‌రౌండర్ త్రిష అండర్-19 మహిళల వరల్డ్ కప్‌లో చరిత్ర సృష్టించింది. అదే జోరుతో సెమీఫైనల్, ఫైనల్లో జట్టు విజయాలలో కీలక భూమిక పోషించింది. తద్వారా 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచింది. ఈ అవార్డును తండ్రి రామిరెడ్డికి అంకితమిస్తున్నట్టు ప్రకటించింది..'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డును అందుకున్న సందర్భంగా తీవ్ర భావోద్వేగానికి లోనైన త్రిష కొద్దిసేపు మాట్లాడలేకపోయింది. 'ఈ విజయం ఎంతో ప్రత్యేకం. ఏం మాట్లాడాలో తెలియడంలేదు. నాకు మద్దతుగా నిలిచిన అందరికీ థ్యాంక్స్ నా సామర్థ్యాలమీద దృష్టి సారించడమే ఈరోజు ఆటలో ప్రణాళిక. దానిని పక్కాగా అమలు చేశా. ఇక..నా ఈ అవార్డు నాన్నకు అంకితం ఇస్తున్నా. ఎందుకంటే నేను నికార్సయిన ఆల్‌రౌండర్‌నని ఆయన నమ్మారు. దేశానికి సాధ్యమైనన్ని విజయాలు అందించడమే నా ధ్యేయం' అని త్రిష వివరించింది.

మనమ్మాయిల మరో ప్రపంచం

యువ భారత్‌దే అండర్-19 ప్రపంచకప్

ఆహా..ఏమి ఆట మనమ్మాయిలది! టోర్నీ ఆరంభం నుంచి అంతిమ సమరం వరకూ అదే జోరు.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో తిరుగులేని ప్రదర్శనతో హోరెత్తించారు. మన స్పిన్నర్ల బౌలింగ్‌లో పరుగులు చేసేందుకు ప్రత్యర్థి బ్యాటర్లు సాహసించలేకపోయారు..తెగించి షాట్లకు యత్నిస్తే బౌల్డయ్యారు..దాంతో ప్రత్యర్థులు పట్టుమని వంద పరుగులు చేసేందుకు నానా తంటాలు పడ్డారు..ఇక స్వల్ప లక్ష్యాలను ఓపెనింగ్ బ్యాటర్లు.. మరీముఖ్యంగా తెలుగమ్మాయి గొంగడి త్రిష దూకుడుతో ఇట్టే ఛేదించారు. మొత్తంగా మన అమ్మాయిలు ఆల్‌రౌండ్ షోతో రెండోసారీ ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్ కప్‌ను దక్కించుకొని భళా అనిపించారు.

త్రిష ఆల్‌రౌండ్ షో ● ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఘన విజయం

కౌలాలంపూర్: అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్‌లో నల్లేరుపై బండిలా సాగిన డిఫెండింగ్ చాంపియన్ భారత పయనం ట్రోఫీని చేజిక్కించుకోవడంతో ముగిసింది. గ్రూపు దశ, సూపర్ సిక్స్, సెమీఫైనల్ వరకు అప్రతిహత విజయాలతో దుమ్మురేపిన యువ భారత్ ఫైనల్‌నూ ఏకపక్షం చేసింది. సెమీఫైనల్లో పటిష్ఠమైన ఆస్ట్రేలియాను మట్టికరిపించిన దక్షిణాఫ్రికా ఆటలు కూడా మన జట్టు ముందు సాగలేదు. ఏకంగా 9 వికెట్లతో సఫారీలను చిత్తు చేసిన భారత్ వరుసగా రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. 2023లో జరిగిన ఆరంభ టోర్నీలో షఫాలీ సారథ్యంలో భారత్ టైటిల్ నెగ్గింది. ఇక, ఆదివారం జరిగిన ఫైనల్లో..మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా భారత స్పిన్నర్ల ధాటికి గడగడలాడింది. 20 ఓవర్లలో 82 పరుగులకే కుప్పకూలింది. మీక్ వాన్ (23), బోథా (16), ఫే కౌలింగ్ (15) ఒకింత ప్రతిఘటించారు. త్రిష మూడు, పరునిక, ఆయుషి శుక్లా, వైష్ణవీ శర్మ తలా మూడేసి వికెట్లు పడగొట్టారు. ఇక.. ఓపెనర్ త్రిష (33 బంతుల్లో 8 ఫోర్లతో 44 నాటౌట్) సూపర్ షోతో పాటు సనిక చల్కే (22 బంతుల్లో 4 ఫోర్లతో 26 నాటౌట్) ధనాధన్ బ్యాటింగ్‌తో 11.1 ఓవర్లలో 84/1తో లక్ష్యాన్ని భారత్ అలవోకగా ఛేదించింది. **త్రిష 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు అందుకుంది.**

త్రిష.. తగ్గేదేలె: బౌలింగ్‌లో మూడు వికెట్లు తీసి సౌతాఫ్రికా భరతం పట్టిన త్రిష.బ్యాటింగ్‌లో సహజ శైలిలో చెలరేగింది. చూడముచ్చటైన షాట్లతో అలరించింది. ఆమె దూకుడుకు స్వల్ప లక్ష్యం కూడా మరింత చిన్నదైంది. తొలి ఓవర్ మూడో బంతికే బౌండరీ సాధించిన తెలుగు బ్యాటర్..కౌలింగ్ వేసిన రెండో ఓవర్లో రెండు అందమైన కవర్ డ్రైవ్‌లతో ఆకట్టుకుంది. ఇక శేషిణి నాయుడు వేసిన నాలుగో ఓవర్లో 4,4,4తో శివాలెత్తింది. తదుపరి ఓవర్లో కమలిని అవుటైనా..వచ్చీరావడంతోనే బౌండరీ సంధించిన వైస్-కెప్టెన్ సనిక..స్కోరుబోర్డులో వేగాన్ని ఏ మాత్రం తగ్గనీయలేదు. పవర్ ప్లేలో 44/1తో లక్ష్యం దిశగా భారత్ దూసుకు పోయింది. ఎనిమిదో ఓవర్లో త్రిష, సనిక చెరో ఫోర్ దంచారు. 10వ ఓవర్లో ఓవర్లో త్రిష క్యాచవుట్ నుంచి బయటపడింది. కానీ 11వ ఓవర్లో ఇద్దరూ చెరో బౌండరీ కొట్టడంతో లక్ష్యానికి భారత్ చేరువైంది. తర్వాతి ఓవర్ రెండో బంతిని సనిక ఫోర్‌కు తరలించడంతో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి.

స్పిన్నర్లు భళా..దక్షిణాఫ్రికా విలవిల..: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికా భారత స్పిన్నర్లను ఎదుర్కోవడానికి నానా తంటాలు పడింది. ముఖ్యంగా మధ్య ఓవర్లలో మన స్పిన్నర్లు ప్రత్యర్థిని పూర్తిగా కట్టిపడేశారు. దాంతో 7-14 ఓవర్లలో దక్షిణాఫ్రికా ఒక్క బౌండరీ కూడా కొట్టలేకపోయింది. రెండో ఓవర్లో మరో ఓపెనర్ సిమోన్‌ను డకౌట్ చేసిన సిసోడియా భారత్‌కు బ్రేక్ ఇచ్చింది. అయితే ప్రమాదకర బ్యాటర్ బోథాను ఆంధ్ర పేసర్ షబ్నమ్ తన మొదటి ఓవర్లోనే అవుట్ చేయడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. తర్వాత దారా (3)ను ఆయుషి శుక్లా బౌల్డ్ చేయగా.. సగం ఓవర్లు ముగిసే సరికి సఫారీలు 33/3తో నిలిచారు. కెప్టెన్ రెనికే (7)ను పెవిలియన్ చేర్చడం ద్వారా త్రిష తన వికెట్ల వేటను ఆరంభించింది. వెంటనే మెసో (10)ను ఆయుషి బౌల్డ్ చేయడంతో దక్షిణాఫ్రికా 44/5తో దయనీయంగా నిలిచింది. మీక్ వాన్‌ను ఊరించే బంతితో అవుట్ చేసిన త్రిష.తర్వాతి బంతికే శేషిణిని (0)ను బౌల్డ్ చేసింది. ఆపై దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ఎంతోసేపు సాగలేదు.

సంక్షిప్తస్కోర్లు

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 82 ఆలౌట్ (మీక్ వాన్ 23, బోథా 16, కౌలింగ్ 15, త్రిష 3/15, పరునిక సిసోడియా 2/6, ఆయుషి శుక్లా 2/9, వైష్ణవీ శర్మ 2/23);
భారత్: 11.2 ఓవర్లలో 84/1 (త్రిష 44 నాటౌట్, సనిక 26 నాటౌట్, రెనికే 1/14).



నికీ ప్రసాద్

'సప్త' సారథులు

కర్ణాటకకు చెందిన నికీ ప్రసాద్ కెప్టెన్సీలో భారత్ ఈ ఏడాది అండర్-19 వరల్డ్ కప్‌ను చేజిక్కించుకుంది. ఇప్పటి వరకు అండర్-19 ప్రపంచ కప్‌లు సాధించిన భారత సారథుల (పురుషులు, మహిళల విభాగాల్లో) వివరాలు చూస్తే..

1. మహ్మద్ కైఫ్ (2000-వన్డే)
2. విరాట్ కోహ్లీ (2008-వన్డే)
3. ఉన్ముక్త్ చంద్ (2012-వన్డే)
4. పృథ్వీ షా (2018-వన్డే)
5. యష్ ధుల్ (2022-వన్డే)
6. షఫాలీ (2023, టీ20)
7. నికీ ప్రసాద్ (2025, టీ20)



309 పరుగులు 7 వికెట్లు

భద్రాచలానికి చెందిన త్రిష టోర్నీలో ఆడిందనే దానికంటే.. ఏలిందనే చెప్పుకోవాలి. డాషింగ్ ఓపెనర్‌గా త్రిష పరుగుల వరద పారించింది. ప్రతి మ్యాచ్‌లోనూ ప్రత్యర్థి బౌలర్లపై మెరుపుదాడి చేస్తూ జట్టుకు పటిష్ఠపునాది వేసింది. స్కాట్లాండ్‌పై అజేయంగా 110 పరుగులు చేసిన త్రిష.. టోర్నీ చరిత్రలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా నిలిచింది. ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో 77.25 సగటుతో 309 పరుగులు చేసింది. ఈ క్రమంలో టోర్నీ చరిత్రలో అత్యధిక పరుగులు సాధించిన ప్లేయర్‌గా రికార్డులకెక్కింది. లెగ్ స్పిన్నర్‌గానూ రాణించిన ఆమె ఏడు వికెట్లు పడగొట్టింది. 3/6 త్రిష అత్యుత్తమ ప్రదర్శన.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

టైటిల్ వెనుక.. చిచ్చర పిడుగులు

టోర్నీ ఆసాంతం జైత్రయాత్ర కొనసాగించిన భారత యువకెరటాలు.. అజేయంగా వరల్డ్‌కప్ టైటిల్‌ను నిలబెట్టుకొన్నారు. గ్రూప్ దశ నుంచి అదరగొట్టిన మన అమ్మాయిలు.. భారీ స్కోర్లు చేయడమే కాదు బౌలింగ్‌లోనూ అదరగొట్టారు. తెలుగమ్మాయి గొంగడి త్రిష ఆల్‌రౌండ్ షోతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించగా.. కమిలిని కూడా చక్కగా రాణించింది. అయితే, ఆయుషి శుక్లా, వైష్ణవి శర్మ, పరుణిక సిసోడియా లాంటి బౌలర్లు ఈ టోర్నీ ద్వారా వెలుగు చూడడం శుభపరిణామం.

కమలిని: తమిళనాడుకు చెందిన ఎడమ చేతి వాటం బ్యాటర్ కమలిని ఓపెనర్‌గా త్రిషకు చక్కని సహకారం అందించింది. బ్యాట్‌తోనూ దీటుగా రాణించింది. ఏడు మ్యాచ్‌ల్లో 47.66 సగటుతో 143 పరుగులు చేసింది. సూపర్ సిక్స్‌లో స్కాట్లాండ్‌పై 51, సెమీస్‌లో ఇంగ్లండ్‌పై 56 పరుగులతో సత్తాచాటింది.

వైష్ణవి శర్మ: గ్వాలియర్‌కు చెందిన లెఫ్టామ్ స్పిన్నర్ వైష్ణవి. టోర్నీలోనే అత్యధికంగా 17 వికెట్లు పడగొట్టింది. మలేసియాతో మ్యాచ్‌లో హ్యాట్రిక్ సహా 5/5తో ప్రకంపనలు సృష్టించింది. సెమీస్‌లో 3/23తో ఇంగ్లండ్ వెన్నువిరిచిన వైష్ణవి.. ఫైనల్లో సౌతాఫ్రికాపై 2/23తో నిలకడగా రాణించింది.

ఆయుషి శుక్లా: తన స్పిన్‌తో ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెట్టింది ఆయుషి. ఆడిన 7 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు పడగొట్టింది.

సనిక చల్కే: ముంబైకి చెందిన సనిక వైస్ కెప్టెన్, మిడిలార్డర్ బ్యాటర్. ఓపెనర్లు శుభారంభం అందిస్తే.. అదే జోరును కొనసాగిస్తూ జట్టుకు భారీ స్కోర్లు అందించడానికి తీవ్రంగా కృషి చేసింది.

పరుణిక సిసోడియా: మన స్పిన్ విభాగంలో మరో తురుపుముక్క పరుణిక. వైష్ణవి, ఆయుషి తరహాలోనే రాణిస్తూ 10 వికెట్లు కూల్చింది. సెమీస్‌లో 3/21తో అదరగొట్టిన సిసోడియా.. ఫైనల్లో 2/6తో వావ్ అనిపించింది.

తెలుగు వెలుగు



షబ్నం

విశాఖపట్నంకు చెందిన షబ్నం షకీల్ రెండోసారి ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంది. ఏడు మ్యాచ్‌ల్లో 4 వికెట్లు పడగొట్టింది. జోషిత తరహాలోనే ప్రత్యర్థులకు కళ్లెం వేసింది. మొత్తం 17 ఓవర్లు బౌల్ చేసిన షబ్నం ఓవర్‌కు 4 పరుగులు మాత్రమే ఇచ్చింది. 2/9 ఆమె అత్యుత్తమ ప్రదర్శన.

అభి'షేక్' చేశాడు

- విజృంభించిన బౌలర్లు
- ఆఖరి టీ20లోనూ భారత్ విజయం
- చిత్తుగా ఓడిన ఇంగ్లండ్



37 బంతుల్లోనే అదిరే శతకం

4-1తో సిరీస్ కైవసం

ముంబై: అభిషేక్ శర్మ సుడిగాలి ఇన్నింగ్స్ (54 బంతుల్లో 7 ఫోర్లు, 13 సిక్సర్లతో 135)కు ఇంగ్లండ్ జట్టు బెంబేలెత్తిపోయింది. వాంఖడేలో అతడి సిక్సర్ల సునామీకి స్టాండ్స్ దద్దరిల్లిపోయాయి. పేసర్లు, స్పిన్నర్లు అనే తేడా లేకుండా ఎవరి బంతి అయినా క్రీజులో పడితే చాలు.. బౌండరీకే అన్నట్టుగా అభిషేక్ ఆటతీరు సాగింది. ఆ తర్వాత బౌలర్ల ఆధిపత్యానికి ఇంగ్లండ్ జట్టు కనీసం అభిషేక్ వ్యక్తిగత స్కోరును కూడా సాధించలేకపోయింది. ఫలితంగా ఆ జట్టు టీ20 చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 150 పరుగుల భారీ తేడాతో ఓడింది. అటు 4-1 తేడాతో టీమిండియా సిరీస్‌ను సగర్వంగా పూర్తి చేసింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా భారత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 247 పరుగులు చేసింది. శివమ్ దూబే (13 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 30) వేగంగా ఆడాడు. కార్స్‌కు మూడు, ఉడ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో ఇంగ్లండ్ 10.3 ఓవర్లలో 97 రన్స్ చేసి ఓడింది. సాల్ట్ (23 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 55) రాణించాడు. షమికి 3.. అభిషేక్, దూబే, వరుణ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్.. ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా వరుణ్ చక్రవర్తి నిలిచారు.

పోరాటమే లేకుండా..: భారత్ పరుగుల వరద పారించిన చోట ఇంగ్లండ్ దారుణంగా చతికిల పడింది. ఓపెనర్ సాల్ట్ మినహా అంతా విఫలమయ్యారు. తొలి ఓవర్‌ను 4,4,6తో ఆరంభించిన సాల్ట్ 17 రన్స్ రాబట్టాడు. మరో ఎండ్‌లో మాత్రం తమకేం సంబంధం లేదన్నట్టుగా భారత స్పిన్నర్ల ధాటికి సహచరులు ఇలా వచ్చి అలా పెవిలియన్ చేరారు. అయి నా సాల్ట్ ధాటికి జట్టు పవర్‌ప్లేలో 68/3 స్కోరుతో నిలిచింది. అలాగే ఏడో ఓవర్లో సిక్సర్‌తో అతడు 21 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. కానీ తర్వా తి ఓవర్‌లోనే సాల్ట్‌ను దూబే అవుట్ చేయడంతో గెలుపుపై ఉన్న కాస్త ఆశలు ఆవిరయ్యాయి. దీనికి తోడు అభిషేక్ తొమ్మిదో ఓవర్లో 2 వికె ట్లు తీయడంతో జట్టు 90/7 స్కోరుతో ఓటమి ఖాయమైంది. చివరికి 11వ ఓవర్లో షమి తీసిన 2 వికెట్లతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ పేలవంగా ముగిసింది.

ఒక్కడే ఆడేశాడు..: టాస్ గెలిచి భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించిన ఇంగ్లండ్‌కు తామెంత పెద్ద తప్పు చేశామో రుచి చూపించాడు ఓపెనర్ అభిషేక్ శర్మ. బౌలర్లపై ఎలాంటి కనికరం లేకుండా అతడు చూపిన విధ్వంసానికి వాంఖడే పరుగుల హోరులో తడిసి పోయింది. పదేపదే స్టాండ్స్‌లోకి పడిన సిక్సర్లను తెచ్చేందుకు ఇంగ్లండ్ ఫీల్డర్లు తెగ కష్టపడ్డారు. అంతకుముందు ఇన్నింగ్స్ తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన ఓపెనర్ శాంసన్ అదే ఓవర్లో మరో 6,4తో అదరగొట్టాడు. కానీ రెండో ఓవర్లోనే ఉడ్ షార్ట్ పిచ్ బంతికి డీప్ స్క్వేర్‌లెగ్‌లో ఆర్చర్‌కు దొరికిపోయాడు. ఈ సిరీస్ ఆద్యంతం తను ఇలాంటి బంతులకే వెనుదిరగడం గమనార్హం. ఇక మూడో ఓవర్లో 4,6,6తో అభిషేక్ హవా సాగింది. తర్వాతి రెండు ఓవర్లలో రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 17 బంతుల్లోనే ఫిఫ్టీని కూడా పూర్తి చేశాడు. అప్పటికి ఇన్నింగ్స్‌లో ఐదు ఓవర్లు కూడా పూర్తికాలేదు. అటు తిలక్ (24) ఉన్న కాసేపు వేగంగా ఆడడంతో పవర్‌ప్లేలో జట్టు 95/1 స్కోరుతో నిలిచింది. ఆ తర్వాత స్పిన్నర్లు రషీద్, లివింగ్‌స్టోన్‌ల తొలి ఓవర్లలో అభిషేక్ రెండేసి సిక్సర్లతో పరుగులు రాబట్టాడు. మరోవైపు తొమ్మిదో ఓవర్లో తిలక్‌ను కార్స్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 115 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇందులో అభిషేక్‌వే 89 పరుగులుండడం అతడి వేగాన్ని సూచిస్తుంది. ఎక్కడా తగ్గకుండా సాగిన తన జోరుకు 37 బంతుల్లోనే రెండో సెంచరీ సైతం పూర్తి చేసుకున్నాడు. కానీ కెప్టెన్ సూర్య (2) ఈ మ్యాచ్‌లోనూ నిరాశపర్చగా, ఈ దశలో దూబే జత కలవడంతో స్కోరులో మరింత వేగం పెరిగింది. 12వ ఓవర్లో అతడి 4,6తో స్కోరు 150 దాటింది. అయితే చివర్లో బౌలర్లు కట్టడి చేశారు. వరుస ఓవర్లలో జట్టు దూబే, హార్దిక్ (9), రింకూ (9) వికెట్లను కోల్పోయింది. అయినా మరో ఎండ్‌లో అభిషేక్ బౌండరీలు బాదడం ఆపలేదు. చివరికి అతడిని 18వ ఓవర్లో రషీద్ అవుట్ చేయడంతో అద్భుత ఇన్నింగ్స్‌కు తెర పడినట్టయ్యింది. మరోవైపు ఆఖరి రెండు ఓవర్లలో పది పరుగులే చేసి రెండు వికెట్లు కోల్పోవడంతో 250లోపే పరిమితమైంది.

1
- టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు (135) సాధించిన భారత బ్యాటర్‌గా అభిషేక్. అలాగే జట్టు తరఫున ఒకే మ్యాచ్‌లో ఎక్కువ సిక్సర్లు (13) సాధించడంతో పాటు, పవర్‌ప్లేలో ఎక్కువ రన్స్ (58) సాధించిన బ్యాటర్‌గానూ నిలిచాడు. పవర్‌ప్లేలో భారత జట్టుకిదే (95) అత్యధిక పరుగుల రికార్డు.
- ఇన్నింగ్స్ 10.1 ఓవర్లలోనే సెంచరీ పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా అభిషేక్. గతంలో 10.2 ఓవర్లలో డికాక్ విండీస్‌పై శతకం సాధించాడు.
- తొలి 39 బంతుల్లోనే 100 పరుగులు పూర్తి చేయడం భారత్‌కిదే తొలిసారి. గతంలో బంగ్లాపై 43 బంతుల్లో సాధించింది.
- టీ20ల్లో భారీ (150 రన్స్) తేడాతో ఓడడం ఇంగ్లండ్‌కిదే తొలిసారి.

2
- శాశ్వత సభ్య దేశాలతో జరిగిన టీ20ల్లో రెండో వేగవంతమైన సెంచరీ (37 బంతుల్లో) సాధించిన అభిషేక్. డేవిడ్ మిల్లర్, రోహిత్ శర్మ (35 బంతుల్లో) టాప్‌లో ఉన్నారు.
- భారత్ తరఫున అభిషేక్‌ది రెండో వేగవంతమైన (17 బంతుల్లో) అర్ధసెంచరీ. తొలి స్థానంలో అతడి మెంటార్ యువరాజ్ (12 బంతుల్లో) ఉండడం విశేషం.

స్కోరుబోర్డు

భారత్: శాంసన్ (సి) ఆర్చర్ (బి) ఉడ్ 16; అభిషేక్ (సి) ఆర్చర్ (బి) రషీద్ 135; తిలక్ (సి) సాల్ట్ (బి) కార్స్ 24; సూర్యకుమార్ (సి) సాల్ట్ (బి) కార్స్ 2; దూబే (సి) రషీద్ (బి) కార్స్ 30; హార్దిక్ (సి) లివింగ్‌స్టోన్ (బి) ఉడ్ 9; రింకూ (ఎల్బీ) ఆర్చర్ 9; అక్షర్ (రనౌట్) 15; షమి (నాటౌట్) 0; బిష్ణోయ్ (సి) కార్స్ (బి) ఒవర్టన్ 0; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 247/9. వికెట్ల పతనం:** 1-21, 2-136, 3-145, 4-182, 5-193, 6-202, 7-237, 8-247, 9-247. **బౌలింగ్:** ఆర్చర్ 4-0-55-1; ఉడ్ 4-0-32-2; ఒవర్టన్ 3-0-48-1; లివింగ్‌స్టోన్ 2-0-29-0; రషీద్ 3-0-41-1; కార్స్ 4-0-38-3.

ఇంగ్లండ్: సాల్ట్ (సి సబ్) జురెల్ (బి) దూబే 55; డకెట్ (సి) అభిషేక్ (బి) షమి 0; బట్లర్ (సి) తిలక్ (బి) వరుణ్ 7; బ్రూక్ (సి) వరుణ్ (బి) బిష్ణోయ్ 2; లివింగ్‌స్టోన్ (సి) రింకూ (బి) వరుణ్ 9; బెథెల్ (బి) దూబే 10; కార్స్ (సి) వరుణ్ (బి) అభిషేక్ 3; ఒవర్టన్ (సి) సూర్యకుమార్ (బి) అభిషేక్ 1; ఆర్చర్ (నాటౌట్) 1; రషీద్ (సి సబ్) జురెల్ (బి) షమి 6; ఉడ్ (సి సబ్) జురెల్ (బి) షమి 0; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 10.3 ఓవర్లలో 97 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-23, 2-48, 3-59, 4-68, 5-82, 6-87, 7-90, 8-90, 9-97, 10-97. **బౌలింగ్:** షమి 2.3-0-25-3; హార్దిక్ 2-0-23-0; వరుణ్ 2-0-25-2; బిష్ణోయ్ 1-0-9-1; దూబే 2-0-11-2; అభిషేక్ 1-0-3-2.



చాంపియన్ ప్రజ్ఞానంద

టైబ్రేకర్‌లో గుకేష్‌కు షాక్
టాటా స్టీల్ చెస్

వి కాన్‌జీ: టాటా స్టీల్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద విజేతగా నిలిచాడు. ఆదివారం హోరాహోరీగా సాగిన టైబ్రేకర్‌లో 2-1తో వరల్డ్ చాంపియన్ గుకేష్‌ను ప్రజ్ఞానంద ఓడించాడు. చివరి, 13వ రౌండ్‌లో గ్రాండ్‌మాస్టర్ గుకేష్, ప్రజ్ఞానంద ఇరువురూ పరాజయం చవిచూశారు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్..గుకేష్‌కు షాకివ్వగా, విన్సెంట్ కీమర్..ప్రజ్ఞానందకు చెక్ పెట్టాడు. దాంతో గుకేష్, ప్రజ్ఞానంద చెరో 8.50 పాయింట్లతో సమంగా నిలవడంతో రెండు గేమ్‌ల టైబ్రేకర్ నిర్వహించారు. ఇందులో తొలి గేమ్‌లో గుకేష్ నెగ్గగా, రెండో గేమ్‌లో ప్రజ్ఞానంద విజయం సాధించాడు. ఫలితంగా విజేతను తేల్చేందుకు సడన్ డెత్ నిర్వహించాల్సి వచ్చింది. ఇందులో ప్రజ్ఞానంద గెలుపొందాడు.

సర్వీసెస్ ప్రపంచ రికార్డు ఛేదన

- నాలుగో ఇన్నింగ్స్‌లో 376 రన్స్ ఉఫ్
- ఒడిశాపై సంచలన విజయం

కటక్: రంజీ ట్రోఫీ చరిత్రలోనే రెండో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా సర్వీసెస్ అరుదైన ఘనతను అందుకొంది. ఓపెనర్లు శుభమ్ రోహిల్లా (209 నాటౌట్), సూరజ్ వశిష్ఠ (154 నాటౌట్) అజేయ శతక జోరుతో.. గ్రూప్-ఎలో ఒడిశాతో జరిగిన మ్యాచ్‌లో సర్వీసెస్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గతేడాది త్రిపురతో మ్యాచ్‌లో రైల్వేస్ 378 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. కాగా, నాలుగో ఇన్నింగ్స్‌లో వశిష్ఠ, రోహిల్లా 376 పరుగుల అజేయ భాగస్వామ్యంతో.. వికెట్ నష్టపోకుండా నాలుగో ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు ఛేదించిన జట్టుగా సర్వీసెస్ ప్రపంచ రికార్డు సృష్టించింది. 376 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా ఆటకు ఆఖరి రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 46/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సర్వీసెస్ వికెట్ నష్టపోకుండా 376 పరుగులు చేసి విజయం సాధించింది. అయితే, గ్రూప్‌లో మూడో స్థానంతో నాకౌట్‌కు చేరుకోలేక పోయింది. బరోడాపై విజయంతో జమ్మూ కశ్మీర్ క్వార్టర్స్ బెర్త్‌ను ఖరారు చేసుకొంది.

రాణించిన రిత్విక్ జోడీ

- 4-0తో టోగోపై భారత్ గెలుపు

న్యూఢిల్లీ: డేవిస్ కప్ వరల్డ్‌కప్ గ్రూప్-1లో ప్లేఆఫ్స్‌లో భారత్ 4-0తో టోగోను చిత్తు చేసింది. తొలి రోజు రెండు సింగిల్స్ మ్యాచుల్లోనూ నెగ్గిన భారత్.. ఆదివారం జరిగిన డబుల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌ల్ని సొంతం చేసుకొంది. తొలుత జరిగిన డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీ-తెలుగు కుర్రాడు రిత్విక్ చౌదరి జంట 6-2, 6-1తో ఎమ్‌లపా-ఇసాక్‌ను చిత్తు చేశారు. నాలుగో మ్యాచ్‌గా జరిగిన రివర్స్ సింగిల్స్‌లో కరణ్ సింగ్‌కు అరంగేట్రం చేసే చాన్స్ దక్కింది. కరణ్ 6-2 6-3తో ఇసాక్‌పై నెగ్గాడు. ఫలితం తేలిపోవడంతో ఐదో మ్యాచ్ ఆడలేదు. ఈ విజయంతో భారత్ గ్రూప్-1లో తన స్థానాన్ని నిలబెట్టుకొంది.

రోడ్లకు మహర్దశ

ఆంధ్రజ్యోతి ఫీల్డ్ రిపోర్ట్

(మొదటి పేజీ తరువాయి)

చేయించడం, కొన్నిచోట్ల కొత్త రోడ్లు వేస్తుండటంతో జనం కష్టాలు తీరుతున్నాయి. నాటి గతుకుల రోడ్ల స్థానంలో అద్దంలా మెరిసిపోతున్న రోడ్లు దర్శనమిస్తున్నాయి. మట్టిరోడ్ల స్థానంలో గ్రామాలకు తారు రోడ్లు, గ్రామాల్లో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో కొత్తగా తారు రోడ్లు వేస్తున్నారు. దీంతో ఎట్టకేలకు రోడ్లకు మహర్దశ వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా నాడు, నేడు మచ్చుకు కొన్ని దృశ్యాలు...

ప్రకాశం జిల్లా



ప్రకాశం జిల్లాలో చీమకుర్తి, మద్దిపాడు మండలాలకు వారధిగా ఉండే నేకునంబాదు-దొడ్డవరం రోడ్డు ఇది. అప్పట్లో ఈ రోడ్డు నిర్మాణానికి అనుమతులిచ్చిన జగన్ ప్రభుత్వం నిధులు మాత్రం ఇవ్వలేదు. దాంతో మొన్నటి వరకూ ఈ రోడ్డుపై అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 3.05 కి.మీ దూరం రహదారి నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేసి రోడ్డు నిర్మించేశారు.

కృష్ణా జిల్లా




కృష్ణా జిల్లా కోడూరు మండల కేంద్రం నుంచి రామకృష్ణాపురం వెళ్లే రోడ్డు ఇది. జగన్ ప్రభుత్వంలో రోడ్డంతా గుంతలు పడిపోయి కాల్వలను తలపిస్తున్నా పట్టించుకున్నవారు లేరు. వేల కోట్ల రూపాయలు బటన్లు నొక్కాను అని చెప్పుకొన్న అప్పటి సీఎం జగన్ దీని కోసం కేవలం రూ.71 లక్షలు కేటాయించలేకపోయారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక... ఆ 71 లక్షలు ఖర్చు పెట్టడంతో గుంతల రోడ్డు కాస్తా ఇలా మారిపోయింది.

నంద్యాల జిల్లా



కచ్చాపచ్చాగా నిర్మాణం సగంలో వదిలేసినట్లున్న ఈ రోడ్డు నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం రామతీర్థం ఎస్టీ కాలనీలోని రహదారి. జగన్ ప్రభుత్వంలో ఇలాగే వదిలేసిన ఈ రోడ్డును ప్రస్తుత ప్రభుత్వం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తి చేసింది.

గుంటూరు జిల్లా



వైసీపీ హయాంలో రాష్ట్రంలో రోడ్ల దుస్థితికి నిదర్శనం ఈ చిత్రం. గుంటూరు నుంచి పెదపలకలూరు వెళ్లే ప్రధాన రహదారి ఇది. రోడ్డంతా గుంతలు... వాటి నిండా నీటితో ప్రమాదాలకు నెలవుగా మారిన వైనమిది. అయినా అప్పటి జగన్ ప్రభుత్వంలో గుంతలు పూడ్చాలన్న ఆలోచన కూడా రాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ రహదారిని ఇలా అద్దంలా మార్చింది.

అనకాపల్లి జిల్లా




అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం ఘాట్ రోడ్డు జంక్షన్ నుంచి మండల కేంద్రానికి వెళ్లే రహదారి ఇది. దారిపొడవునా గుంతలతో ఈ రోడ్డు నరకానికి మార్గంగా నిలిచింది. కేవలం 15 లక్షల రూపాయలు వెచ్చించలేని నాటి సీఎం జగన్ తీరుతో ఈ రోడ్డుపై ప్రయాణించే ప్రజలు నరకం చూశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ 15 లక్షలు కేటాయించడంతో ఇదుగో నాటి గుంతల రోడ్డు నేడు నున్నగా ముస్తాబైంది.

కర్నూలు జిల్లా



మట్టి దిబ్బలు... పారుదల లేక నిలిచిపోయిన మురుగునీరుతో కనిపిస్తున్న ఇది కూడా రోడ్డే. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలంలోని అగ్రహారంలో ఉన్న బీసీ కాలనీ రోడ్డు జగన్ సీఎంగా ఉండగా ఇలా ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ రహదారిని అటూ ఇటూ డ్రైనేజ్‌లతో సీసీ రోడ్డుగా ఇలా నున్నగా మార్చేశారు.

పెందుర్తిలో...



పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని మండల కేంద్ర పరవాడ సినిమా హాల్ జంక్షన్ నుంచి బొట్టవానిపాలెం వరకు ప్రధాన రహదారి ఎక్కడికక్కడ గోతులు ఏర్పడి దారుణంగా వుండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రూ.12 లక్షలతో అభివృద్ధి చేశారు. దీంతో ప్రయాణం సాఫీగా సాగుతున్నదని ప్రజలు అంటున్నారు.

విజయనగరం జిల్లా





అడుగు తీసి అడుగు వెయ్యాలంటే భయం. వాహనం నడపాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. పై ఫొటోలలో మొదటిది విజయనగరం-నెల్లిమర్ల రోడ్డు. రెండోది నెల్లిమర్ల నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం వెళ్లే రహదారి. రోడ్ల నిండా గోతులు ఉండడంతో ఆ గోతులు ఎంత లోతున్నాయో తెలియక ఈ రహదారులపై ప్రయాణమంటే జనం హడలెత్తిపోయేవారు. జగన్ హయాం అంతా ఈ రోడ్లపై ప్రజలు ఇలాగే ఇక్కట్లు అనుభవించారు. ఎన్నో ప్రమాదాలు జరిగాయి. కొందరు ప్రాణాలూ కోల్పోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు ఈ రహదారులకు మహర్దశ పట్టింది.

రైతుబజార్లలో రాజకీయాలు!

- మూడేళ్లుగా పూర్తికాని ఉద్యోగుల బదిలీలు
- అధికారుల వ్యక్తిగత పనుల్లో సిబ్బంది
- దుకాణాల కేటాయింపుల్లో ఇష్టారాజ్యం
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రైతుకు నష్టం లేకుండా వినియోగదారులకు సరైన ధరలకు కూరగాయలు అందించే లక్ష్యంతో రాష్ట్రంలో ఏర్పాటైన రైతుబజార్లలో రాజకీయ ప్రమేయం పెరుగుతోంది. కొన్ని చోట్ల రాజకీయ నాయకుల అండతో కొందరు ఉద్యోగులు వ్యాపారులతో కుమ్మక్కై, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దుకాణదారుల నుంచి పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయినా.. వసూళ్లపై దృష్టి సారించడం లేదు. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే రూ.20 లక్షలపైగా బకాయిలు వసూలు కావాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. షాపుల కేటాయింపు విషయంలో మాత్రం రాజకీయ నాయకుల సిఫారసులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. చాలా చోట్ల రైతుబజార్ల బయట వరకు అనధికారికంగా దుకాణాలకు అనుమతిస్తున్నారు. చివరికి రైతుబజార్లలో పారిశుధ్య పనులకు పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది వాటిలో కొంత సొమ్ము జేబులో వేసుకుంటున్నారు. దీంతో రాష్ట్రంలో రైతుబజార్ల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. కొందరు అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. రైతుబజార్లలో ఖాళీగా ఉన్న షాపులకు వేలం నిర్వహించాల్సి ఉన్నా ఆ పని చేయడం లేదు. దీంతో షాపుల ద్వారా వచ్చిన డబ్బుతోనే జీతాలు ఇవ్వాల్సి వస్తోంది. రాష్ట్రంలో ఏటా రైతుబజార్ల నుంచి రూ.13 కోట్లు దాకా ఆదాయం వస్తోంది. అయినా సిబ్బందికి జీతభత్యాలు అరకొరగానే ఇస్తున్నారు. గత ప్రభుత్వం రైతుబజార్ల సిబ్బందికి పీఆర్సీ ప్రకారం జీతాలు పెంచకపోవడంతో వారు ఇలా అక్రమాలకు తెరదీస్తున్నారని, అద్దెల కేటాయింపులకు వేలల్లో ముడుపులు తీసుకుంటున్నారని ఆరోపణలున్నాయి. రైతుబజార్లలో స్థాయిని బట్టి సిబ్బంది ఉండగా, కొందరు



సిబ్బందిని జిల్లా అధికారుల దగ్గర సొంత పనులకు వినియోగిస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 10 మందికిపైగా సిబ్బంది ఈ విధంగా పని చేస్తున్నారని తెలిసింది. దీనివల్ల రైతుబజార్లలో మిగిలిన సిబ్బందిపై పనిభారం పెరుగుతోంది. ఎన్టీఆర్ జిల్లాలో రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లను మాత్రమే బదిలీ చేశారు. మిగతా జిల్లాల్లో ఎస్టేట్ ఆఫీసర్ల బదిలీలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. అక్కడ కింది స్థాయి సిబ్బందిని మాత్రం బదిలీ చేయలేదు. విజయవాడలో ఒక ఎస్టేట్ ఆఫీసర్‌ను హెడ్ ఆఫీస్‌కు సరెండర్ చేసి, తిరిగి వేరే చోట పోస్టింగ్ ఇచ్చారు. బదిలీల విషయంలో డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. రాజకీయ నాయకులు చెప్పిన వారికి పోస్టింగ్‌లు ఇస్తున్నారు. ఒకే చోట మూడేళ్లు దాటినా చాలా మంది సిబ్బందిని బదిలీ చేయడం లేదు. మరోవైపు మార్కెటింగ్ డైరెక్టర్ రైతుబజార్ల సీఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రైతుబజార్లకు సంబంధించి, కొన్ని వ్యవహారాలను జాయింట్ కలెక్టర్లకు అధికారాలు అప్పగించినా.. చాలా చోట్ల జేసీల పర్యవేక్షణ లోపించింది. గత ప్రభుత్వంలో నిర్మించిన కొత్త రైతుబజార్లను ఇంత వరకు ప్రారంభించలేదు. సంచార రైతుబజార్లు ఇటీవల ప్రారంభించి, మళ్లీ కొన్ని పక్కన పెట్టేశారు. మార్కెటింగ్ అధికారుల బదిలీలు జరగకపోవడంతో కొందరు అధికారులు జిల్లా, రాష్ట్ర ప్రధాన కార్యాలయాల్లో ఏళ్ల తరబడి తిష్ట వేసి పైరవీలు సాగిస్తున్నారు. నాడు-నేడు పథకం కింద గత వైసీపీ ప్రభుత్వంలో రూ.వందల కోట్లలో పనులకు టెండర్లు పిలిచారు. ప్రభుత్వం మారిన తర్వాత వాటి గురించి పట్టించుకున్న నాథుడే లేదు.

తెలంగాణలో సగం మంది బీసీలే!

- బీసీలు 46.25 శాతం
- ముస్లింలలో బీసీలు 10.08 శాతం
- ఎస్సీలు 17.43, ఎస్టీలు 10.45 శాతం
- వివరాలను వెల్లడించిన సబ్ కమిటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కులాలవారీ జనాభా లెక్క తేలింది. కులసర్వే నివేదికను ప్రణాళిక విభాగం అధికారులు ఆదివారం క్యాబినెట్ సబ్‌కమిటీకి అందజేశారు. అనంతరం నివేదిక వివరాలను సబ్‌కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సభ్యులుగా ఉన్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ వెల్లడించారు. రాష్ట్ర జనాభాలో బీసీలు 46.25 శాతం ఉన్నారని, ముస్లింలలో బీసీలు 10.08 శాతం ఉన్నారని తెలిపారు. ఈ రెండు వర్గాలు కలిసి మొత్తం బీసీలు 56.33 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక ఎస్సీలు 17.43 శాతం ఉండగా, ఎస్టీలు 10.45 శాతం ఉన్నారని చెప్పారు. కాగా, రాష్ట్రంలో ఓసీలు 13.31 శాతం ఉండగా.. ముస్లింలలో ఓసీలు 2.48 శాతం ఉన్నట్లు తెలిపారు. వీరితో కలిపి మొత్తం ఓసీ జనాభా 15.79 శాతం ఉందన్నారు. ఓసీలు, బీసీల్లోని ముస్లింలంతా కలిసి రాష్ట్రంలో ముస్లింల జనాభా 12.56 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, విద్య సర్వేలో రాష్ట్రం మొత్తం జనాభాలో 96.9 శాతం మంది పాల్గొన్నారని తెలిపారు. మరో 3.1 శాతం (సుమారు 16 లక్షల) మంది వివిధ కారణాలతో సర్వేలో పాల్గొనలేదని చెప్పారు. రాష్ట్రంలోని 3.70 కోట్ల జనాభాలో 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొనడం చాలా సంతృప్తిగా ఉందని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ అన్నారు. సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారని వెల్లడించారు.

అడవిదొంగ పెద్దిరెడ్డిని వదిలేదిలేదు

- పెద్దిరెడ్డి అంటేనే అరాచకాలకు మారుపేరు
- జగన్ సహా తప్పు చేసినవారెవరూ తప్పించుకోలేదు
- వైసీపీ మరో 15 ఏళ్లు సింగిల్ డిజిట్ సీట్లకే పరిమితం
- అసెంబ్లీకి వెళ్లని వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి
- వారియర్.. పవన్ నాయకత్వంలో పనిచేస్తున్నందుకు గర్వంగా ఉంది
- పుంగనూరు జనసేన సభలో నాగబాబు



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న నాగబాబు

పుంగనూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ప్రకృతి సంపదను చెరబట్టిన అడవి దొంగ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని, ఆయన అక్రమాస్తుల విలువ మన రాష్ట్ర బడ్జెట్ రూ.2లక్షల కోట్లను దాటిపోయిందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు ఆరోపించారు. మాజీ సీఎం జగన్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి, కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి సహా అక్రమాలకు పాల్పడ్డ ప్రతి ఒక్కరిపైనా చర్యలుంటాయన్నారు. చట్టం నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరని, అందరినీ మెడపెట్టి లోపల తోస్తామని హెచ్చరించారు. చిత్తూరు జిల్లా సోమలలో ఆదివారం జరిగిన జనంలోకి జనసేన బహిరంగ సభలో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డిపై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవిని అడ్డుపెట్టుకుని రాష్ట్ర సంపదను దోచేశారన్నారు. తమను గెలిపించిన ప్రజల సమస్యలు శాసనసభలో మాట్లాడలేనప్పుడు 11మంది వైసీపీ ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏమీ చేయలేదంటూ వైసీపీ సన్నాసులు, కుక్కలు అనేక విమర్శలు చేస్తున్నారని, వారు కళ్లు తెరిచి అభివృద్ధిని చూడాలని హితవు పలికారు. పెద్దిరెడ్డి అంటే దౌర్జన్యాలు, దోపిడీలు, అరాచకాలకు మారుపేరుగా నిలిచారనే విషయం పుంగనూరు నియోజకవర్గంలో మార్మోగుతోందని నాగబాబు విమర్శించారు. పెద్దిరెడ్డి తన అక్రమాస్తుల విషయం ఎప్పటికైనా బయటపడుతుందన్న భయంతోనే మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలో రికార్డులను దహనం చేయించారంటూ విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వానికి పగ కంటే ప్రజల సంక్షేమమే ముఖ్యమని, 8 నెలల్లో సీఎం చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, నరేంద్రమోదీలు అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టారన్నారు. వైసీపీని మరో 15 ఏళ్లు సింగల్ డిజిట్ సీట్లకే పరిమితం చేసే బాధ్యత తాము తీసుకున్నామని, 15 ఏళ్లు రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు కలిసికట్టుగా ఉంటాయన్నారు. గతంలో పంచాయతీరాజ్, అటవీశాఖ మంత్రిగా పెద్దిరెడ్డి పాలనకు నేడు నీతి, నిజాయితీగా పని చేస్తున్న మంత్రి పవన్‌కల్యాణ్ పనితీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. వారియర్.. నిజయితీపరుడైన పవన్ నాయకత్వంలో పనిచేస్తున్నందుకు తమ పార్టీ శ్రేణులందరికీ గర్వంగా ఉందని చెప్పారు. పదవుల మీద, అధికారాల మీద ఆశలేదని, పవన్ ఆశయాల మేరకే పనిచేస్తున్నామని చెప్పారు. మైనింగ్, ఎర్రచందనం, మాఫియాను అణగదొక్కుతానని అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో అన్నమయ్య జిల్లా కలికిరి సభలో ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలు పెద్దిరెడ్డికి వర్తిస్తాయన్నారు. వారి నెత్తిమీద కత్తివేలాడుతోందని, దారం తెగగానే శిక్ష తప్పదని హెచ్చరించారు. సమావేశంలో టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన నాయకులు హరిప్రసాద్, కిరణ్‌రాయల్, వేణుగోపాల్‌రెడ్డి, పగడాల రమణ, సుభాషిణి, రాందాస్‌చౌదరి తదితరులు ప్రసంగించారు.

గుండె పరీక్షల్లో సీటీ ఎఫ్ఎఫ్ఆర్

ఏఐ సహకారంతో కొత్త పరీక్ష అందుబాటులోకి..

ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ రమేశ్‌బాబు

విజయవాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శరీరంలో కీలకమైన గుండె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహకారంతో నూతనంగా సీటీ ఎఫ్ఎఫ్ఆర్ టెక్నాలజీని దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చామని ఆస్టర్ రమేశ్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ పోతినేని రమేశ్ బాబు వెల్లడించారు. ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌లో ఇదొక నూతన అధ్యాయమని పేర్కొన్నారు. విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు గుండెకు ఉన్న ముప్పును గుర్తించడానికి ఈసీజీ, ఎకో, ట్రెడ్‌మిల్ వంటి పరీక్షలపై ఆధారపడాల్సి వస్తోందని, ప్రాథమికంగా రోగ నిర్ధారణ కోసం కాల్షియం స్కోర్, సీటీ యాంజియోగ్రామ్ పరీక్షలను ఉపయోగిస్తున్నామని చెప్పారు. కానీ... ఇప్పుడు టెక్నాలజీతో విప్లవాన్ని సృష్టిస్తున్న ఏఐ, రికరెంట్, మల్టీలేయర్డ్ డీప్ న్యూరల్ నెట్‌వర్క్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ వంటివి గుండె, మెదడు, కేన్సర్, జన్యు, సింగిల్ సెల్ అట్లాస్ వంటి అంశాలపై హై రిజల్యూషన్ ఇమేజింగ్ ద్వారా కచ్చితమైన రోగ నిర్ధారణను తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు.



విజయవాడలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమేశ్



కృష్ణా నదిలో ఈత పోటీలు

» వివిధ రాష్ట్రాల నుంచి 600 మంది రాక

విజయవాడ (వన్‌టౌన్), ఫిబ్రవరి 2: కృష్ణా నదిలో దుర్గాఘాట్ వద్ద 25వ కృష్ణా రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి 600 మంది స్విమ్మర్లు ఈ పోటీలకు హాజరయ్యారు. పదేళ్ల నుంచి 80 సంవత్సరాల వయస్సు వాళ్లు పోటీల్లో పాల్గొన్నారు. ఈత పోటీలను విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం ఏడు వయసు కేటగిరీల్లో పోటీలు జరిగాయి. అమరావతి ఫెస్టివల్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, బీజేపీ రాష్ట్ర నాయకుడు పాతూరి నాగభూషణం ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

ఢిల్లీని భ్రష్టుపట్టించారు

» ఆప్ పాలనలో అభివృద్ధికి దూరమైన రాజధాని

» 1995 నాటి హైదరాబాద్‌లా ఇప్పటి ఢిల్లీ ఉంది

» తెలుగు వారంతా ఏకపక్షంగా బీజేపీకే ఓటేయాలి

» ఎన్నికల ప్రచార సభలో సీఎం చంద్రబాబు పిలుపు


చంద్రబాబు ఎన్నికల ప్రచార సభకు హాజరైన జనం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్‌లో దేశం దూసుకుపోతుంటే ఢిల్లీ మాత్రం మురికికూపంగా మారుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 1995లో హైదరాబాద్ ఎలా ఉండేదో ఆ పరిస్థితి నేడు ఢిల్లీ ఉందన్నారు. ఆదివారం ఢిల్లీలోని షహదారా నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థుల తరఫున నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. షహదారా ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి సంజయ్ గోయల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలోకి ఉన్నప్పటికీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు కూడా ఇవ్వలేకపోయిందని విమర్శించారు. ఢిల్లీ అభివృద్ధి బాట పట్టాలన్నా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నా బీజేపీని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటు అవసరాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన బాధ్యత తెలుగు తమ్ముళ్లు, చెలెళ్లపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని నాశనం చేసిందని, కేజ్రీవాల్ ఢిల్లీని భ్రష్టుపట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో బీజేపీ గెలుపు దేశ చరిత్రకు ఒక మలుపు అన్నారు. అధికారం కోసం కాదు... ప్రజాసేవ కోసం రాజకీయాలు చేయాలని అన్నారు. ఆయారాం, గయారాంలు కాదు.. సుస్థిర పాలన అందించాలని, ప్యాలెస్‌లు కట్టుకునేవారిని కాదు... ప్రజలకు చిత్తశుద్ధితో సేవచేసేవారిని ఎన్నుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. 'దేశ రాజధాని అయిన ఢిల్లీ సమస్యల వలయంలో చిక్కుకుపోయి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఒక్కప్పుడు బిహార్ నుంచి ఇక్కడికి ఉపాధికి వచ్చేవారు. కానీ ఇప్పుడు ఇక్కడి పాలకుల తీరుతో యువత ఉద్యోగాల కోసం బెంగళూరు, హైదరాబాద్ వెళ్తున్నారు. ఆప్ పాలనలో అభివృద్ధి లేదు, రోడ్లు లేవు, మౌలిక సదుపాయలు లేవు. గాలి కాలుష్యం తట్టుకోలేనంతగా ఉంది. డబుల్ ఇంజన్ సర్కారు వచ్చి ఉంటే వాషింగ్టన్, న్యూయార్క్‌ను ఢిల్లీ తలదన్నేది. బీజేపీని గెలిపిస్తే సంక్షేమం, అభివృద్ధి రెండూ ప్రజలకు అందుతాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఏడు నెలల్లో 7 లక్షల కోట్లు తెచ్చాం

'ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీచేస్తే ప్రత్యర్థి పార్టీ గల్లంతైంది. డిపాజిట్లు కూడా తెచ్చుకోలేకపోయింది. ఏడు నెలల్లోనే రాష్ట్రానికి రూ.7లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చాం. డబుల్ ఇంజన్ సర్కారుతోనే ఇది సాధ్యమైంది. రుషికొండ ప్యాలెస్ కట్టిన జగన్ ఆ ప్యాలెస్‌లోకి ప్రవేశించేలోపే ఇంటికి వెళ్లారు. ఢిల్లీలో కూడా కేజ్రీవాల్ బ్రహ్మాండమైన శీష్ మహల్ కట్టారు. ఆ మహల్‌లోకి ప్రవేశించడానికి ముందే మీరు చిత్తుగా ఓడించాలి. తెలుగు వారు ఎక్కడున్నా ఒక్కటిగా ఉండాలి. మీకు అండగా, తోడుగా నేనుంటా' అని చంద్రబాబు భరోసా ఇచ్చారు. 'పెట్టుబడుల కోసం ఇటీవల దావోస్ వెళ్లినప్పుడు 650 మంది అక్కడ ఉన్నారు. ఏఐ, గ్రీన్ ఎనర్జీని ప్రధాని మోదీ ప్రమోట్ చేస్తున్నారు. 1995లో ఐటీ గురించి మాట్లాడాను... ఇప్పుడు ఏఐ గురించి మాట్లాడుతున్నాను. వికసిత్ భారత్‌లో భాగంగా 2047 కల్లా దేశం నెంబర్ వన్ అవుతుంది. భారతీయులు శక్తిమంతమైన జాతిగా మారతారు" అని చంద్రబాబు తెలిపారు. కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి గురించి సీఎం చంద్రబాబు నిరంతరం ఆలోచిస్తారని కొనియాడారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, దగ్గుమళ్ల ప్రసాదరావు, బస్తీపాటి నాగరాజు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కృష్ణప్రసాద్, బైరెడ్డి శబరి, జీఎం హరీష్, బాలశౌరి, ఉదయ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హస్తినలో తెలుగు నేతల ప్రచారం

ఢిల్లీ పీఠాన్ని కైవసం చేసుకోడానికి బీజేపీ అన్ని అస్త్రాలను ప్రయోగిస్తోంది. ఇప్పటికే మూడుసార్లు అధికారాన్ని చేజిక్కించుకున్న ఆమ్ ఆద్మీ పార్టీపై విజయం సాధించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అందులో భాగంగా తెలుగు ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఢిల్లీలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజలు దాదాపు 8లక్షల మంది ఉన్నారు. వీరిలో సుమారు 3లక్షల మంది వరకు ఓటర్లు ఉండొచ్చని అంచనా. ఈ నేపథ్యంలో బీజేపీ, ఆప్, కాంగ్రెస్ పార్టీలు తెలుగు ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డాయి. ఎన్డీఏ కూటమి భాగస్వామ్య పక్షమైన బీజేపీని గెలిపించాలని కోరుతూ టీడీపీ జోరుగా ప్రచారం చేస్తోంది. సోమవారంతో ఎన్నికల ప్రచారానికి తెరపడనున్న నేపథ్యంలో ఆదివారం రాత్రి తెలుగు సంఘాల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీలో తెలుగు సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని చంద్రబాబుకు ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత రాత్రి 8.15 గంటలకు ఢిల్లీలోని సహద్రలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రచారం నిర్వహించారు. త్రినగర్ అసెంబ్లీ అభ్యర్థి తిలక్‌రామ్ గుప్తా తరఫున పెమ్మసాని సతీమణి శ్రీ రత్న, ఆయన కుమార్తె ప్రచారంలో పాల్గొన్నారు.

వర్సిటీల్లో ఇన్‌చార్జిల పాలన ఎన్నాళ్లు?



» 17 వర్సిటీల్లో వీసీ పోస్టులు ఖాళీ

» ప్రభుత్వం మారాక వీసీలు రాజీనామా

» అప్పటి నుంచీ నియామకాలు కరువు

రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల్లో పాలన కుంటుపడింది. పూర్తిస్థాయి వీసీలు లేకపోవడం, ఇన్‌చార్జి వీసీలు పాలనపై పట్టు పెంచుకోకపోవడంతో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. వీటికితోడు కొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. వైసీపీ హయాంలో అడ్డగోలుగా నియమితులైన వీసీలు.. కూటమి సర్కారు వచ్చాక తమ పదవులకు రాజీనామాలు చేశారు. ఈ నేపథ్యంలో కొత్త వీసీల నియామకం చేపట్టాల్సి ఉన్నా.. ఉన్నత విద్యా మండలి అలసత్వంతో ఆలస్యమవుతున్నాయి. మరో నెల వరకు నియామకాలు చేపట్టే అవకాశం లేకుండా పోయింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో దాదాపు ఆరు నెలలుగా వీసీల్లేకుండా యూనివర్సిటీల పాలన సాగుతోంది. మూడు నెలల కిందట వీసీ పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానించినా.. భర్తీ ప్రక్రియ కొలిక్కి రాలేదు. ఈలోగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నియామకం మళ్లీ వాయిదా పడింది. విద్యా శాఖ జాప్యంతో 17 విశ్వవిద్యాలయాలు ఇన్‌చార్జులతో నెట్టుకొస్తున్నాయి. రెగ్యులర్ వీసీలు లేక పాలన గాడితప్పుతోందన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల కృష్ణా యూనివర్సిటీలో నిధుల దుర్వినియోగంపై వివాదం తలెత్తింది. రిజిస్ట్రార్‌పై స్వయంగా ప్రొఫెసర్లే ఫిర్యాదు చేసే స్థాయికి పరిస్థితి వెళ్లింది. అంతకముందు చాన్స్‌లర్ లేని ఆర్జీయూకేటీల్లో వసతుల లేమి బయటపడింది. ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అలాగే నాగార్జున యూనివర్సిటీలో నాసిరకం భోజనం పెడుతున్నారంటూ హాస్టల్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. వర్సిటీల్లో పరీక్షలు సకాలంలో నిర్వహించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అయినా వీసీల నియామకంలో ఉన్నత విద్యాశాఖ వేగంగా చర్యలు తీసుకోలేకపోతోంది. ఖాళీ అయిన వీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేయగా 17 యూనివర్సిటీలకు 2,500కు పైగా దరఖాస్తులు అందాయి. అయితే రెండున్నర నెలల తర్వాత గానీ వాటిపై సెర్చ్ కమిటీలు ఏర్పాటుకాలేదు. ఇటీవల నియామకమైన సెర్చ్ కమిటీల సమావేశాలు చాలా వరకు ముగిశాయి. 4 వర్సిటీలు మినహా అన్ని సెర్చ్ కమిటీల సమావేశాలు పూర్తయ్యాయి. వాటి నివేదికలు ప్రభుత్వానికి అందినట్లు తెలిసింది. అయితే, ఈలోగా ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూలు విడుదల కావడంతో వీసీల నియామకానికి మళ్లీ బ్రేక్ పడింది. మార్చి 8న ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు విడుదలవుతాయి. ఆ తర్వాత రెండు మూడు రోజుల వరకు కోడ్ అమల్లో ఉంటుంది. అంటే మరో నెల రోజుల వరకు వీసీల నియామకం జరిగే అవకాశం లేదు.

మూకుమ్మడిగా రాజీనామాలు

గత ప్రభుత్వంలో నియమితులైన వీసీలు కూటమి అధికారంలోకి రాగానే మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. దీంతో ఒకేసారి 17 వర్సిటీల్లో వీసీ పోస్టులు ఖాళీ అయ్యాయి. అయితే వెంటనే ఆ ఖాళీలను భర్తీ చేయకుండా ఉన్నత విద్యాశాఖ నిర్లక్ష్యం చేసింది. గత ప్రభుత్వంలో నియామకమైన ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌కు.. కూటమి ప్రభుత్వం మండలి ఇన్‌చార్జ్ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. అప్పటినుంచీ ఉన్నత విద్యాశాఖలో ఏ నిర్ణయం సకాలంలో తీసుకోలేదు. పైగా వైస్ చైర్మన్‌గా ఉన్న కె.రామ్మోహన్‌రావు వీసీ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. మండలి వైస్ చైర్మన్‌గా, ఇన్‌చార్జ్ చైర్మన్‌గా ఉంటూ ఒక యూనివర్సిటీ వీసీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడంపైనా విమర్శలు వచ్చాయి. మరోవైపు యూనివర్సిటీలను ఆయన పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఏదో ఒక రోజు తనను పంపించేస్తారంటూ ఫైళ్లన్నీ పక్కనపెట్టేశారు. ఈ క్రమంలో వీసీల నియామక ప్రక్రియలో తీవ్ర జాప్యం జరిగింది. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశ పరీక్షలకు సంబంధించి కన్వీనర్ల నియామకంపైనా ఇది ప్రభావం చూపనుందని ఉన్నత విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

ప్రియుడితో కలిసి పిల్లలకు చిత్రహింసలు

» ఏలూరు జిల్లాలో దారుణం.. పోలీసులచొరవతో పిల్లలకు చికిత్స


చిన్నారుల వీపుపై గాయాలు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రియుడి మోజులో పడిన ఓ మహిళ.. తల్లి స్థానాన్ని కూడా మరచిపోయింది. ప్రియుడితో కలిసి తన ఇద్దరి పిల్లలను విచక్షణా రహితంగా కొట్టి చిత్రహింసలు పెడుతోంది.. ఎట్టకేలకు ఈ విషయం స్థానికుల ద్వారా పోలీసుల దృష్టికి వెళ్లగా, వారు పిల్లలను రక్షించి ఆస్పత్రిలో చేర్పించారు. వివరాలివీ.. ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం తాడిచర్లకు చెందిన గానాల శారదకు పదేళ్ల క్రితం వివాహమైంది. వారికి రాహుల్, రేణుక ఇద్దరు పిల్లలున్నారు. భర్తతో విభేదించి తాడిచర్లకు చెందిన ప్రియుడు నల్లవెలుగుల పవన్‌తో కలిసి ఆమె జంగారెడ్డిగూడెం పట్టణంలో సహజీవనం చేస్తోంది. శనివారం రాత్రి తొమ్మిదేళ్ల కుమారుడు ఉదయ రాహుల్‌ను ఆమె ప్రియుడు పవన్ వైర్‌తో వీపుపై తీవ్రంగా కొట్టాడు. రాహుల్ భయంతో బయటికి పరుగులు తీయగా స్థానికులు గమనించి శారద, పవన్‌లకు దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా పవన్, శారదలు పిల్లలిద్దరినీ కొడుతూ, గాయాలపై కారంచల్లి, తమ నోట్లో పచ్చిమిరపకాయ పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని బాధిత బాలుడు రాహుల్ తెలిపాడు. ఆదివారం ఈ సమాచారం కలెక్టర్ వెట్రిసెల్వి దృష్టికి వెళ్లడంతో, ఆమె ఈ ఘటనపై స్థానిక అధికారులతో మాట్లాడి పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఘటనపై కేసు నమోదు చేశామని, నిందితుడిని త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు.

ఓవర్‌లోడ్‌తో లిఫ్ట్‌లో ఇరుక్కున్న భక్తులు

» మార్కాపురం రైల్వే స్టేషన్లో 3 గంటలపాటు నరకయాతన

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): లిఫ్టులో ఇరుక్కుపోయిన 14 మంది ప్రయాణికులు మూడు గంటలపాటు నరకయాతన అనుభవించారు. ప్రకాశం జిల్లా మార్కాపురం రోడ్డు రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకొంది ఘటన. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పలువురు భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం శ్రీశైలం వెళ్లేందుకు తిరుపతి నుంచి మార్కాపురం వచ్చే రైలెక్కారు. ఆదివారం వేకువజామున 4 గంటలకు మార్కాపురం రోడ్డు స్టేషన్‌లో రైలు దిగి, ప్లాట్‌ఫాం నుంచి వెలుపలకు వచ్చేందుకు అక్కడి లిఫ్ట్ ఎక్కారు. అది మధ్యలో మొరాయించింది. రైల్వే పోలీసుల సాయంతో మూడు గంటలపాటు శ్రమించి వారిని ఉదయం 7 గటలకు బయటికి తీశారు. లిఫ్ట్ సామర్థ్యం ఎనిమిది మంది కాగా 14 మంది ఎక్కారు. వారి లగేజీ కూడా ఉండడంతో ఓవర్‌లోడ్ కారణంగా లిఫ్ట్ మధ్యలో నిలిచినట్లు సాంకేతిక సిబ్బంది తెలిపారు.

ఉద్యోగులకు 25 వేల కోట్ల బకాయిలు!

» తక్షణమే ఒక డీఏ ప్రకటించాలి.. కేఆర్ సూర్యనారాయణ

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు రూ.25 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ చెప్పారు. సంఘం కాకినాడ జిల్లా మూడో కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం కాకినాడలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెలా ఉద్యోగులకు రూ.6,500 కోట్ల వేతనాలు ఇవ్వాల్సి వస్తోందని, ఇవే కాకుండా ఇంకా వివిధ రకాల బెనిఫిట్లు రావాల్సి ఉందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తమకు పూర్తిగా అవగాహన ఉన్నందువల్ల బకాయిపడిన మూడు డీఏల్లో ఒకటి ప్రకటించి ఉద్యోగుల్లో ఆశలు చిగురింపచేయాలని కోరారు. ప్రతినెలా వేతనం ఇచ్చేలా చెల్లింపులపై చట్టబద్ధత చేయాలని, తమ సమస్యలపై ఉన్నతస్థాయి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

టాస్క్ లేదు.. ఫోర్స్ లేదు!

(మొదటి పేజీ తరువాయి)

దుండగులు నిప్పుపెట్టిన సంగతి తెలిసిందే. అసైన్డ్ భూముల దోపిడీ బయటకు రాకుండా ఉండేందుకు రెవెన్యూ రికార్డులను బూడిద చేసేందుకు కుట్రపూరితంగా అగ్గిరాజేశారు. ఆ తర్వాత అగ్నిప్రమాదం జరిగిందని నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ సంఘటనపై రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ ఆర్పీ సిసోడియా మదనపల్లెకు వెళ్లి విచారించారు. ఆ తర్వాతే రాష్ట్ర వ్యాప్తంగా అసైన్డ్, ఇనాం, షరతుగల పట్టా భూముల అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేయించింది. 10 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను గత జగన్ ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ చేయగా, అందులో 5.50 లక్షల ఎకరాలను జీఓ 596కి విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి బయటకు తీశారని విచారణలో బయటపడింది.

ప్రతిపాదన బుట్టదాఖలు

భూ అక్రమాల పరిధి భారీగా ఉండటంతో ఈ అంశంపై గత ఏడాది డిసెంబరులో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ప్రధానంగా చర్చ జరిగింది. భూ దోపిడీకి పాల్పడిన వైసీపీ నేతలు, అధికారుల గుట్టు బయటకు తీసేందుకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ), డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు (డీఎస్పీ), ఇతర రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. సాధారణంగా సీఎం ఆదేశాలపై రెవెన్యూ శాఖ వెంటనే స్పందించి అమల్లోకి తీసుకొస్తూ ఆదేశాలు ఇవ్వాలి. కానీ రెండు నెలలవుతున్నా సీఎం ఆదేశాలకు అతీగతీ లేదు. టాస్క్ లేదు. ఫోర్స్ లేదు. కలెక్టర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుకు సంబంధించిన మినిట్స్‌లోనూ ఈ అంశం ప్రస్తావన తీసుకురాలేదని తెలిసింది. అంటే.. టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలన్న సీఎం ఆదేశాలను రెవెన్యూశాఖ అజెండా నుంచి తప్పించినట్లు తెలుస్తోంది. మరోవైపు సీఎం కార్యాలయం కూడా దీనిపై ఇప్పటి వరకు ఆరా తీయలేదని తెలిసింది. దీంతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదన బుట్టదాఖలైంది.

అక్రమాల్లో అధికారుల పాత్ర

రెవెన్యూశాఖ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు విషయంలో ఎందుకిలా వ్యవహరిస్తోందన్న అనుమానాలు లేకపోలేదు. ఇందుకు అనేక కారణాలున్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన భూముల అక్రమాల్లో వైసీపీ నేతల భాగస్వామ్యం ఎంతుందో.. అంతకంటే ఎక్కువగానే రెవెన్యూ అధికారుల పాత్ర ఉంది. తహసీల్దార్లు, ఆర్డీఓ స్థాయి అధికారులు, కలెక్టర్లుగా పనిచేసిన కొందరు ఐఏఎస్‌ల పాత్ర కూడా ఉందన్న ఆరోపణలున్నాయి. ఆర్డీఓలుగా డిప్యూటీ కలెక్టర్లు ఉన్నారు. వారి ప్రమేయం లేకుండా, కలెక్టర్ల ఆమోదం లేకుండా అసైన్డ్ భూములను జీఓ 596కి విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి తీయలేరు. అంటే.. అక్రమంగా నిషేధిత జాబితా నుంచి బయటకు తీసిన 5 లక్షల ఎకరాల వ్యవహారంలో అనేక మంది ఆర్డీఓలు, సీనియర్ అధికారుల పాత్ర ఉంది. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి విచారణ చేస్తే, ఆనాటి పాపాల్లో భాగస్వాములైనవారి మెడకు చుట్టుకుంటుంది. రాజకీయ నేతలు ఇరుక్కుంటారు. ఇది ఇప్పుడున్న రెవెన్యూ అధికారులకు ఇష్టం లేదని తెలుస్తోంది. భూ అక్రమం కేసులో ఒకనేత, అధికారిని టచ్ చేస్తే వారికి శత్రువులై పోతామనో లేక అది ఒకరి నుంచి మరొకరికి అంటుకొని మొత్తంగా ఇటు నేతలు, అటు అధికారయంత్రాంగం ఇబ్బంది పాలవుతారన్న ఆందోళనతోనో కొందరు సీనియర్ అధికారుల ఒత్తిడితో టాస్క్‌ఫోర్స్ అంశాన్ని బుట్టదాఖలు చేసినట్లు తెలుస్తోంది. నిజానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైతే రాష్ట్రస్థాయిలో జీఓ 596 నుంచే విచారణ చేపట్టాలి. అప్పుడు నాటి రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి మండల తహసీల్దార్ల వరకు విచారణ ఎదుర్కోవాలి. ఈ పరిణామాలన్నీ కళ్లముందు కనిపించే కొందరు సీనియర్ అధికారులు అడ్డుకున్నారన్న ప్రచారం ఉంది.

తిరుమలలో బ్రాండెడ్ హోటళ్లు!

» లైసెన్సులు జారీచేసే యోచనలో టీటీడీ

» త్వరలోనే కొత్త పాలసీ అమలుకు సిద్ధం

తిరుమల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి భక్తులకు హోటళ్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించే దిశగా కొత్త పాలసీ అమలుకు టీటీడీ సిద్ధమవుతోంది. జాతీయస్థాయిలో పేరొందిన బ్రాండెడ్ సంస్థలకు హోటళ్ల లైసెన్సులు జారీచేయాలని భావిస్తోంది. తిరుమలలో 10 పెద్ద క్యాంటీన్లు, 6 జనతా క్యాంటీన్లు ఉన్నాయి. వీటిని గతంలో టెండర్ల విధానంలో టీటీడీ కేటాయించేది. భారీగా అద్దె చెల్లించేందుకు ముందుకు వచ్చేవారికి లైసెన్సు జారీ చేసేది. అయితే ఆహార పదార్థాల ధరల్లో నిబంధనలు లేకపోవడంతో భక్తుల నుంచి నిత్యం ఫిర్యాదులొచ్చేవి. ఈ క్రమంలో జనతా హోటళ్లకు మాత్రం నిర్ణీత అద్దెను ముందుగానే నిర్ణయించి డిప్ విధానం ద్వారా లైసెన్సులు కేటాయిస్తూ వస్తున్నారు. ఇకపై పెద్ద క్యాంటీన్ల(రెస్టారెంట్లు)కు కూడా ఇదే తరహాలో లైసెన్సులు జారీ చేయాలని తాజాగా నిర్ణయించారు. రెస్టారెంట్లలో ఆహారపదార్థాల నాణ్యత, ధరల విషయంలో వస్తున్న విమర్శలకు ఫుల్‌స్టాప్ పెట్టనున్నారు. హోటళ్ల నిర్వహణ రంగంలో అనుభవం కలిగిన నిపుణులు, ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో టీటీడీ ఇటీవల పలు సమావేశాలు నిర్వహించింది. లైసెన్సుల కేటాయింపులో కొత్త పాలసీని తీసుకురావాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. లైసెన్సు కాలపరిమితి మూడేళ్లు కావడంతో సరైన వసతులు కల్పించడం లేదని గుర్తించారు. కొంతమంది ఒక పేరుపై లైసెన్స్ పొంది మరొకరికి సబ్‌లీజుకు ఇస్తున్నారు. తమ సంస్థ పేరు కాకుండా మరొకపేరు పెట్టుకుని హోటళ్లను నడుపుతున్నారు. కొత్త పాలసీలో ఈ లోపాలనూ సరిదిద్దనున్నారు. రెస్టారెంట్లను టెండరు ద్వారా కాకుండా నిర్ణీత అద్దెతో డిప్ విధానంలో కేటాయించనున్నారు. లైసెన్సు కాల పరిమితి ఐదేళ్లకు పెంచనున్నారు. బ్రాండెడ్ సంస్థలకు లైసెన్సు కేటాయిస్తే వాటి ప్రతిష్ఠ దెబ్బతినకుండా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తారని టీటీడీ భావిస్తోంది. ఆహార పదార్థాల ధరల నియంత్రణకూ కొన్ని నిబంధనలు తీసుకురానుంది. నాణ్యత తనిఖీకి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనుంది. ప్రస్తుత లైసెన్స్‌ల కాలపరిమితి ముగిశాక త్వరలోనే కొత్త పాలసీని అమలుకు టీటీడీ ప్రణాళిక రూపొందిస్తోంది.

ఏపీసీవోఎస్టీలో అక్రమాలు!

గత ప్రభుత్వంలో సభ్య కార్యదర్శి ఇష్టారాజ్యం

» స్నేహితురాలికి అర్హతలేకున్నా ఏవోగా నియామకం

» ఏవోకు ప్రస్తుత సీఎంవోలోని ఓ అధికారి అండ

» కూటమి ప్రభుత్వ పెద్దలకు తాజాగా ఫిర్యాదులు

అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అనుబంధ విభాగమైన ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఏపీసీవోఎస్టీ)లో గత ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విజయవాడ భవానీపురంలో ఉన్న కార్యాలయంలో గత ప్రభుత్వంలో సీఎంవోలో పని చేసి గతేడాది రిటైరైన ఐఏఎస్ అధికారి సతీమణి ప్రొఫెసర్‌గా తెలంగాణాలో పనిచేస్తూ, డిప్యుటేషన్‌పై వచ్చి, ఏపీసీవోఎస్టీ సభ్య కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు తాజాగా కూటమి ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు అందాయి. భర్త అండతో ఆమె చెలరేగిపోయినట్లు తెలిసింది. అప్పట్లో రాష్ట్ర సచివాలయంలో పని చేసే, తన స్నేహితురాలైన మహిళా సెక్షన్ ఆఫీసర్‌ను ఏపీసీవోఎస్టీ పరిపాలనాధికారిగా నియమించారు. ఆమె ఏపీసీవోఎస్టీ పరిపాలనాధికారి పోస్టుకు సాంకేతికపరంగా అర్హురాలు కాకున్నా.. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమార్గంలో ఆ సీటు అప్పగించడం అప్పట్లో చర్చనీయాంశమైంది. రెగ్యులర్ ఉద్యోగుల్ని పక్కన పెట్టి, క్లాస్4 ఉద్యోగుల్ని పునర్నియమించి, వారి ద్వారా అక్రమాలకు సాగించారని ఆరోపణలున్నాయి. ఇద్దరు క్లాస్4 ఉద్యోగులకు ఇప్పటికీ నియామక పత్రాలు లేవని సమాచారం. ఈ నేపథ్యంలో ఏపీసీవోఎస్టీలో తప్పుడు విధానాలను ఆడిట్ విభాగం రిమార్కులు రాసినట్లు తెలిసింది. కోర్టు కేసు విషయంలో అటవీశాఖకు ప్రభుత్వ న్యాయవాది ఉండగా, పరిపాలనాధికారి ప్రభుత్వ ధనం రూ.2లక్షలు ఖర్చు పెట్టి, ప్రైవేటు లాయర్‌ను ఖర్చు పెట్టినట్లు ఆడిట్ నివేదిక తేల్చినట్లు తెలిసింది. రిటైరైన ఉద్యోగులకు జీపీఎఫ్ సొమ్ము చెల్లింపులకు ముడుపులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏపీసీవోఎస్టీలో వివాదాలకు పరిపాలనాధికారి కేంద్రబిందువుగా మారినట్లు అటవీశాఖలో చర్చ నడుస్తోంది. ఐఏఎస్ అధికారి సతీమణి సభ్య కార్యదర్శి సీటు నుంచి వెళ్లిపోయినా ఆమె హయాంలోని ఫైళ్ల విషయంలోనూ గోప్యత పాటిస్తూ, ఆర్టీఐ ద్వారా పలువురు సమాచారం అడిగినా ఇవ్వకుండా సాకులు చెప్తున్నారు. పరిపాలనాధికారికి ప్రస్తుత సీఎంవోలోని ఓ అధికారి సహకరిస్తుండటం వల్లే ఆమె ఇంకా కొనసాగుతున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో ఏపీసీవోఎస్టీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపితే.. వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కూటమి ప్రభుత్వానికి తాజాగా ఫిర్యాదులందాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.